thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 308 | కరీంనగర్ మంగళవారం, 14 జనవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పెద్ద ఎత్తున కోడి పందేలు

విజయవాడ: ఏపీలో సంక్రాంతి సంబరాలు వేడుకగా జరుగుతున్నాయి. విజయవాడ, కృష్ణా జిల్లాలో పెద్ద ఎత్తున కోడి పందేల బరులు వెలిశాయి. విజయవాడ నగర శివారులోని రామవరప్పాడు, నున్న, గన్నవరం, అంపాపురం తదితర ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేశారు. కోడి పందేలు రూ.లక్షల్లో జరుగుతన్నాయి. బరుల్లో పందేల గురించి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. పందెం రాయుళ్లు కత్తులు కట్టి కోడి పుంజులను బరిలోకి వదులుతున్నారు. నగదు తీసుకురాని వారి కోసం బరుల నిర్వాహకులు స్పాట్ క్యాష్ సౌలభ్యం ఏర్పాటు చేశారు. పందేలను వీక్షించేందుకు గ్యాలరీలు సైతం ఏర్పాటు చేశారు.

# నీ పాపం పండేను నేడే.. నీ భరతం పడతా చూడు.!



### కౌశిక్ రెడ్డి దౌర్జన్యం పై స్పీకర్ కు జగిత్యాల ఎమ్మెల్యే ఫిర్యాదు
### రాష్ట్రంలో కలకలం రేపుతున్న కరీంనగర్ సంఘటన
### కౌశిక్ రెడ్డి ఈసారి తప్పించుకోలేరు అంటున్న విశ్లేషకులు

## అతడో రౌడీ ఎమ్మెల్యే: ఎమ్మెల్యే సంజయ్



మొహమ్మద్ ఇమ్రాన్


దూకుడు మంచిదే.. అతి దూకుడు ప్రమాదకరం.. ఈ విషయంలో విచక్షణ జ్ఞానం కోల్పోయిన కౌశిక్ రెడ్డి వివాదాలకు దూరంగా ఉండే ఎమ్మెల్యేగా పేరున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేతిలో చిక్కిపోయారు. తోటి ఎమ్మెల్యే పై దుర్భాషలాడడం సరైనది కాదనీ రాష్ట్ర వ్యాప్తంగా కౌశిక్ రెడ్డి తీరును ఎండగడుతున్నారు. కరీంనగర్ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం ఈ దెబ్బతో కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే పదవి ఊడి పోతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల ప్రతినిధిగా తాను ప్రసంగిస్తుండగా కౌశిక్ రెడ్డి మొదట నీదే పార్టీ చెప్పాలంటూ అడ్డు తగలడం, దాడికి సిద్ధమై పైపైకి దూసుకెల్లడం.. రాజ్యాంగ విరుద్ధంగా గుర్తించి నిర్ధారించి తన వాక్ స్వతంత్రానికి అడ్డు వచ్చిన కౌశిక్ రెడ్డిని చట్ట సభల నుండి సస్పెండ్ చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. సంజయ్ కుమార్ ఫిర్యాదుతో ఇక కౌశిక్ రెడ్డి పాపం పండుతుందని, స్పీకర్ కౌశిక్ రెడ్డి భారతం పడతారని అంటున్నారు. హుజురాబా ద్ఎన్నికల నుండి ఇప్పటివరకు అనేకసార్లు వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ రాజకీయ కారణాలను చూపెడుతూ బయటపడుతూ వచ్చారు. ఈసారి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో సాటి శాసనసభ్యుడిపై దౌర్జన్యానికి దిగిన సంఘటన రాజకీయ వర్గాలను నివ్వరపరిచింది. కౌశిక్ రెడ్డిని ఈ దెబ్బతో కట్టడి చేస్తారన్న బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. శాసనసభ స్పీకర్కు విచక్షణ అధికారాలు ఉంటాయని ఈసారి సంజయ్ కుమార్ దెబ్బనుండి తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. స్పీకర్ ను కలిసిన అనంతరం సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ నిర్ణయానికి తీర్పు చెప్పేది సభాపతి స్పీకర్ అని పేర్కొన్నారు. తాను ఎప్పుడు రాజకీయ తీవ్ర విమర్శల జోలికి వెళ్లలేదని పదేళ్ల అనుభవాన్ని గుర్తు చేశారు టిఆర్ఎస్ లో ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్పై పరుష పదజాలాలు ప్రయోగించలేదని, ఇప్పుడు కూడా ఎవరిని దూషించే అవసరం లేదన్నారు. తన రాజకీయ కుటుంబం నేపథ్యం అంతా విలువలతో కూడుకున్నదని గుర్తు చేశారు.

**వైయస్సార్ సిపి నుండి రౌడీయిజం..** అయితే కౌశిక్ రెడ్డి రౌడీయిజం గుండాయిజం బెదిరింపులకు చిరునా మాగా మారారని డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.వైఎస్ ఆర్సిపి లో పనిచేసిన సమయంలో తెలంగాణ ఉద్యమకారులపై దాడి చేసిన తప్పుడు ధోరణిచరిత్ర కౌశిక్ రెడ్డికి ఉందన్నారు.అలాంటి ఎమ్మెల్యే పవిత్రమైన అసెంబ్లీలో ఉండరా దని కరీంనగర్ లో జరిగిన దౌర్జన్యాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లాన న్నారు. పార్టీ ఫిరాయింపులు రాజకీయ నిర్ణయాలు అన్నింటిని ప్రజలు గమనించి ఎన్నికల్లో తీర్పునిస్తారని అన్నారు. టిఆర్ఎస్ అధిష్టానం అనేక మంది శాసనసభ్యులను లోబరుచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ సమావేశంలో తనపై జరిగిన దాడిని అమానుష సంఘటనగా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సహా ఎమ్మెల్యేలంతా ఖండించి తనకు సంఘీభావం ప్రకటించడం పట్ల సంజయ్ కుమార్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

**విచారణ జరిపి చర్య తీసుకుంటాం: స్పీకర్ గడ్డం ప్రసాద్..** కరీంనగర్ సమావేశంలో తనపై దాడికి దిగిన కౌశిక్ రెడ్డి పై చర్య తీసుకోవాల్సిందిగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పందించారు. కరీంనగర్ ఘటనపై సమగ్ర వివరాలు తెప్పించుకొని హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై చర్య తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చారు.

దీంతో హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి గడ్డు పరిస్థితులు కనిపిస్తున్నాయి కొందరైతే ఏకంగా హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై వేటు తప్పదని అభిప్రాయపడుతున్నారు.

# మొదలైన పతంగుల జాతర...




హైదరాబాద్, జనవరి 13: పతంగుల పండుగ అనే పిలుచుకునే సంక్రాంతి పండగు రానే వచ్చింది. సంక్రాంతికి సందర్భంగా స్కూళ్లకు వారం రోజుల పాటు సెలవులు ప్రకటించడంతో ఇప్పటికే చాలా మంది సొంతూళ్లకు వెళ్లిపోయారు. స్వగ్రామంలో కుటుంబసభ్యుల మధ్య పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటన్నారు. సంక్రాంతి పండగలో ప్రధానంగా వినిపించేది పతంగులు. పండగ వచ్చిందంటే చాలు యువత కైట్స్ ఎగురవేసేందుకు ఉత్సుకత చూపుతుంటారు. కొంత మంది పండుగకు ముందు నుంచే పతంగులను ఎగురవేస్తుంటారు. పండుగ మూడు రోజుల పాటు ఆకాశంలో పతంగుల జాతర కనిపిస్తుంది. ఎక్కడ చూసినా రంగు రంగుల కైట్స్ చూపరులను కనువిందు చేస్తుంటాయి. ఆకాశం రంగుల మయం అయిందా అన్నట్లుగా గాలిలో పతంగులు ఎగురుతూ కనిపిస్తుంటాయి. బిల్డింగ్పైకి ఎక్కి యువత కైట్స్ను ఎగురవేస్తుంటారు. మార్కెట్లో దొరికే వివిధ రకాల గాలిపటాలను తీసుకువచ్చి పోటాపోటాగా పతంగులు ఎగురవేస్తుంటారు యువత. గట్టి గట్టిగా కేకలు పెడుతూ ఎంజాయ్ చేస్తుంటారు. వీరి సందడితో పాటు డీజే మోత మోగుతుంది. ఎక్కడికక్కడ భవనాలపై డీజే సౌండ్లతో.. యువత కేకలతో దద్దరిల్లి పోతుంది. సూర్యోదయం అవ్వగానే పరుగున వెళ్లే యువత సాయంత్రానికి గాని ఇంటికి చేరుకోరు. అంతగా సందడి చేస్తారు. ఆడిపాడి ఎంజాయ్ చేస్తుంటారు. ఇప్పుడు మార్కెట్లోకి కొత్తకొత్త పతంగులు అందుబాటులోకి వచ్చాయి. హీరోల ఫోటోలు, అలాగే చిన్న పిల్లలు ఇష్టపడే కార్టూన్ ఫోటోల తోనూ పతంగులు మార్కెట్లోకి వచ్చాయి. పెద్ద మొత్తంలో పతంగులతో మార్కెట్లోనూ సందడి నెలకొంది.

**పతంగులకు ఫేమస్ ప్లేస్...** హైదరాబాద్లో అనేక ప్రాంతాల్లో పతంగులను అమ్మతుంటారు. అయితే పతంగుల అమ్మకానికి పెట్టింది పేరుగా చార్మినార్ వద్ద ఉండే గుల్జార్ హౌజ్ నిలిచింది. ఇక్కడ ఎన్నో వేల రకాల పంతగులు అందుబాటులో ఉంటాయి. గుల్జార్ హౌజ్తో పాటు మూసాబౌలి, బేగంబజార్, దూల్ పేట్, లాల్ దర్వాజా తదితర ప్రాంతాల్లో గాలిపటాలను అమ్మతుంటారు. ఒక్కప్పుడు గుండుబాగు స్థావరంగా నిలిచిన దూల్పేట్లో ఇప్పుడు పతంగుల అమ్మకాలు జరుగుతున్నాయి. చెడు వ్యాపారన్ని పక్కన పెట్టేసి మరీ పతంగుల తయారీనే వ్యాపారంగా పెట్టుకున్నారు అక్కడి స్థానికులు. అయితే ఈ వ్యాపారంలో ఆశించిన స్థాయిలో ఆదాయం రాదని అక్కడి వ్యాపారులు చెబుతున్నారు. అయినప్పటికీ పతంగుల తయారీకి వెనక్కి తగ్గేదే లేదన్నది వారి మాట. సంక్రాంతిని పురస్కరించుకున్న రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో తయారైన వివిధ రకాల కైట్స్ కూడా హైదరాబాద్కు చేరుకున్నారు. దీంతో ఆయా మార్కెట్లలో పతంగుల జోరు కొనసాగుతోంది.

**లోకల్ మాంజానే బెస్ట్...** %మరోవైపు ఎంతో ప్రమాదకరమైన చైనా మాంజాను ప్రభుత్వం బ్యాండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో లోకల్ మాంజాకు భారీగా డిమాండ్ పెరిగింది. నగరంలోని మంగళహట్ ఏరియాలో చాలా మంది లోకల్ మాంజాను తయారుచేస్తుంటారు. లోకల్ మాంజాతో పాటు బరేలీ, కృష్ణ, గన్, సిక్స్ కాట్, 12 కాట్, నైన్ కాట్ అంటూ పలు రకాలు మాంజాలను వారు తయారు చేస్తారు. ఇప్పుడు లోకల్ మాంజాకే గిరాకీ ఎక్కువగా ఉందని వ్యాపారులు సైతం చెబుతున్నారు. చైనా మాంజాతో ప్రమాదం ఉందని.. లోకల్ మాంజానే ఉపయోగించి.. సేఫ్గా పతంగులను ఎగురవేయాలని పలువురు చెబుతున్న మాట. ప్రస్తుతం మార్కెట్లో బంగారం, వెండి పూతలతో చేసే పతంగులకు భలే గిరాకీ ఉంది. మామూలుగా పేపర్, మెటల్, ప్లాస్టిక్ వంటి ఐటెమ్స్తో పతంగులను తయారు చేయడం కామన్. అయితే బంగారం, వెండి పూతలతో చేసిన పతంగులు మార్కెట్లో తెగ సందడి చేస్తున్నాయి. వీటి ధరకు కూడా చాలా కాస్టిలీనే అని చెప్పుకోవాలి. గ్రామ్ గోల్డ్ కోటెట్ గిఫ్ట్ ప్యాక్కు ధర రూ.200 నుంచి రూ. 500 వరకు ఉండగా.. సిల్వర్ ప్యాక్ ధర రూ.850 వరకు అమ్ముతున్నారు. ఇక ఈ రెండింతో పాటు జర్మన్ సిల్వర్, మెటల్ రైట్, సిల్వర్ చక్కి, సీసం పుడ్, జైపూర్ మీనా ఆర్ట్ వర్క్ తో కూడిన గిఫ్ట్ ప్యాక్స్కు మార్కెట్లోకి వచ్చాయి. జనం కూడా వీటిని కొనేందుకు ఎగబడుతున్న పరిస్థితి.

**ఎంజాయే కాదు.. జాగ్రత్త కూడా ముఖ్యమే..** కైట్స్ ఎగురవేస్తూ ఎంజాయ్ చేయడమే కాదు.. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం భారిన కూడా పడే అవకాశం ఉటుంది.

పతంగులు ఎగురవేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవడం బెటర్. పతంగుల కోసం ఉపయోగించే మాంజాను పట్టుకునే ముందు చేతి వేళ్లకు టేప్ చుట్టుకోవడం మరిచిపోవద్దు. దీని వల్ల పతంగులు ఎగురవేసేటప్పుడు మాంజా వల్ల చేతి వేళ్లకు ప్రమాదం జరగకుండా ఉంటుంది.





## కిషన్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు..

### హాజరైన ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా

దిల్లీ: దిల్లీలోని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో సోమవారం సాయంత్రం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు.





# గ్రామాల్లో ఎన్నికల సందడి

## రిజర్వేషన్ల పై ఒకటే చర్చ!

కరీంనగర్: గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో ఎక్కడ చూసినా రిజర్వేషన్ల పై చర్చతో గ్రామాల్లో రచ్చబండలు బిజీ గా మారిపోయాయి. పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు సంక్రాంతి పండుగకు ఊరికి వచ్చేవారిని మచ్చిక చేసుకునేందుకు ఆశావాహులు ఆరాటపడుతుండగా గ్రామాల్లో ఇప్పటికే అన్నా మీ ఊరు ఎవరికి రిజర్వేషన్ అవుతుంది..? ఎస్సీకా, బీసీ కా ,మహిళలకా, జనరల్ కా అని ఆశావహులు గ్రామాల్లో ఒకరికొకరు చర్చించుకుంటున్నారు. ఎస్సీ అయితే నేను ఉంటా, బీసీ అయితే నువ్వుండు, జనరల్ అయితే ఫలానా రెడ్డిని పెడదాం... అంటూ రచ్చబండల వద్ద ఆయా పార్టీల నాయకులు మాట్లాడుకుంటున్న మాటలు ఇవి. గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావహులు ప్రభుత్వం ప్రకటించే రిజర్వేషన్ల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వీరంతా ప్రజల మద్దతు కోసం ఇప్పటికే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ బాగానే ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలకు హాజరు హాజరవడవే కాకుండా మృతుల కుటుంబాలను పరామర్శించడం, క్షతగాత్రులను పలకరిస్తూ బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ఇటీవల కులగణన నిర్వహించడంతో ఆశావహుల్లో గుబులు పట్టుకుంది. రిజర్వేషన్ ఏది వస్తుందో అంచనా వేయలేకపోతున్నారు. అధికార పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి కూడా సర్పంచ్ స్థానానికి పోటీ చేసి సత్తా చాటుకునేందుకు నాయకులు సన్నద్ధమవుతున్నారు.

**పదవిని దక్కించుకునేందుకు ఆరాటం..** పంచాయతీ ఎన్నికల్లో ఎన్ని డబ్బులు ఖర్చు అయినా సరే ఈసారి సర్పంచ్ పదవిని దక్కించుకోవాలని వివిధ పార్టీల నాయకులు తహతహలాడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం చేస్తే పది నుంచి 20 లక్షల వరకు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో బీసీ,ఓసి రిజర్వేషన్‌లో పోటీ చేసిన అభ్యర్థులే ఎక్కువగా ఖర్చు చేసేవారు.కానీ నేడు ఎస్సీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు సైతం ఖర్చుపెట్టడంలో తగ్గేదే లేదని వారి సన్నిహితుల వద్ద చెబుతున్నారు.తమ సన్నిహితులను మచ్చిక చేసుకుని వెంట తిప్పు కుంటు బలనిరూపణ చేసుకునేందుకు పోటిలో ఉండే అభ్యర్థులు సంక్రాంతి సంబరాలతో షురూ చేసేందుకు సన్నద్దులవుతున్నారు

**సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్..** ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల అంటూ ప్రకటన చేయడంతో ఆశావాహులు తమ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. అధికారులు సర్పంచ్ వార్డు సభ్యుల గుర్తులను ఇప్పటికే ఖరారు చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన తాము సిద్ధంగా ఉన్నామని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ నేతల్లో ఉత్సాహం మరింత పెరిగింది. గ్రామాల్లో సైతం ఒకవైపు కాంగ్రెస్ పార్టీ మరోవైపు బీఆర్ఎస్. బీజేపీ నాయకులు తమ తమ పార్టీ అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఎక్కువ మొత్తంలో స్థానాలను తమ పార్టీకి చెందిన వారే గెలవాలంటే తమ పార్టీకి చెందిన వారే గెలువాలనే పట్టుదలతో పార్టీల నాయకులు ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా గ్రామాల్లో మంచి పేరున్న అభ్యర్థులపై పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు.



# మహా కుంభమేళాలో.. విచిత్ర సాధువులు..

ప్రపంచంలో అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళాకు సామాన్య భక్తులతో పాటు సాధువులు లక్షలాదిగా తరలివస్తున్నారు. 144 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమం 45 రోజులు పాటు జరగనుంది. తొలిరోజు ఉదయానికే సుమారు 60 లక్షల మందికి పైగా భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించినట్లు అంచనా. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్?కు హాజరైన కొందరు విచిత్ర సాధువులు తమ అసాధారణ ఆహార్యం, పద్ధతులతో భక్తులను అమితంగా ఆకర్షిస్తున్నారు. ఒక సాధువు 32 ఏళ్లుగా స్నానం చేయకపోతే.. మరొకరు 14 ఏళ్లుగా కుడిచేయి పైకి ఎత్తే ఉంచారు.. ఇంకొకరు 45 కిలోల రుద్రాక్ష తలపాగాతో కనిపిస్తారు. కనివినీ ఎరుగని విధంగా అసాధారణ ఆధ్యాత్మిక కట్టుబాట్లు ఆచరిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ఈ రోజు ప్రారంభైన మహా కుంభమేళాకు హాజరైన 57 ఏళ్ల సాధువు గంగాపురి మహారాజ్ 32 ఏళ్లుగా స్నానం చేయలేదు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాధేపురి మహారాజ్ అనే సాధువు హఠయోగి(అంటే సంకల్పం లేదా ప్రతిజ్ఞ). 14 ఏళ్లుగా పైకెత్తిన కుడి చేయి దించనేలేదు. ఆవాహన్ అఖారా కార్యదర్శి మహంత్ గీతానంద్ గిరి 45 కిలోల బరువున్న 1.25 లక్షల రుద్రాక్ష పూసల తలపాగా ధరించి త్రివేణి సంగమానికి అమృత స్నానం ఆచరించేందుకు వచ్చాడు. వీరే కాక అసాధారణ అలవాట్లు, అభ్యాసాలు కొనసాగిస్తున్న ఎంతో మంది సన్యాసులు ప్రయాగ్‌రాజ్‌లో కనిపించారు.

**32 ఏళ్లుగా స్నానం చేయని గంగాపురి మహారాజ్..** తొమ్మిదేళ్ల వయసులో తల్లిదండ్రులు మరణించిన తర్వాత "గురు మా" తనను దత్తత తీసుకున్నాడని గంగాపురి చెప్పారు. 1992లో అకస్మాత్తుగా ఇక స్నానం చేయనని ప్రమాణం చేశాడు. 2016లో ఉజ్జయిని కుంభమేళా సందర్భంగా గంగాపురి తన ప్రస్తుత గురువు మహంత్ రాజ్‌పురిని కలిశాడు. షాహి స్నాన్ (రాచరిక స్నానం) సమయంలో అతడు తన తలపై గురువు జుట్టు నుంచి ఒక చుక్క నీటిని తీసుకొని ఈ ఆచారాన్ని పూర్తి చేశాడు. 32 ఏళ్లు గడిచినా ఒక్కరోజు కూడా స్నానం చేయలేదు. ఇతడు ఐదు అంగుళాల ఎత్తయిన చెప్పులు, ఎక్కువగా కుట్టని దుస్తులను ధరిస్తాడు. ఎల్లప్పుడూ ఒక చిన్న త్రిశూలం, గురువు ఇచ్చిన శివలింగాన్ని వెంట తీసుకెళుతుంటాడు. పగటిపూట సాధారణ సాధనతో పాటు కొన్నిసార్లు స్మశాన వాటికలో ధ్యానం కూడా చేస్తాడు.


**14 ఏళ్లుగా కుడి చేయి పైకెత్తి..** రాధేపురి మహారాజ్ దేశ సంక్షేమం, భారతదేశాన్ని విశ్వగురువుగా మార్చడమే ధ్యేయంగా హఠ యోగా ఆచరిస్తున్నాడు. దీంతోఅతడి ఎడమ చేయితో పోలిస్తే కుడి చేయి సన్నగా మారింది. అంతకుముందు, రాధేపురి కొన్నాళ్ల పాటు నిలబడే ఉండే హఠయోగా చేశాడు. అప్పట్లో ఆ స్థితిలోనే నిద్రపోయేవాడు

**రుద్రాక్ష బాబా..** మహంత్ గీతానంద్‌ను "రుద్రాక్ష బాబా" అని కూడా పిలుస్తారు. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లోని కొట్కాపురా నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వచ్చారు.

మానవత్వాన్ని, సనాతన ధర్మాన్ని రక్షించడానికి ప్రతిరోజు 12 గంటలపాటు అత్యంత బరువైన రుద్రాక్ష తలపాగా ధరిస్తాడు. ఆయన ప్రతిజ్ఞ పూర్తి కావడానికి ఇంకా ఆరేళ్ల సమయం ఉంది.

# తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యం: మంత్రి ఉత్తమ్

ఖమ్మం: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా రూ.54 కోట్ల వ్యయంతో 27 చెరువుల కింద 2400 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుందని చెప్పారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఉగాదిలోపే ఈ ప్రాజెక్టును నిర్మించబోతున్నాం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరివ్వాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాం. ఖమ్మంలోనే కీలక మంత్రులున్నారు. ఖజానా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల్లో ఉంది. పొంగులేటి వద్ద రెవెన్యూ, హౌసింగ్, తుమ్మల చేతుల్లో వ్యవసాయ శాఖ ఉంది. అందుకే ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నాం. గత భారాస ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలను కూడా ఆయకట్టులోకి తీసురాలేదు. పాలమూరు, సీతారామ పరిస్థితి కూడా అంతే. అందుకే మేం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి ఎకరాకు నీరందించాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ఈ వానాకాలం వరిపంట రికార్డు స్థాయిలో 153 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది.



తెలంగాణ వరి రైతులు రికార్డు సృష్టించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కింద సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న పంపులను ఆన్ చేశారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ "ఇందిరమ్మ రాజ్యం వచ్చినందుకు గత పదేళ్లలో అమలు కాని పథకాలను అమలు చేశాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాం.

రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ, రూ.22వేల కోట్ల రుణమాఫీ, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేశాం. ఖమ్మం జిల్లాను వ్యవసాయపరంగానే కాదు భవిష్యత్తులో పారిశ్రామికంగానూ అభివృద్ధి చేస్తామని మాటిస్తున్నా" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# కౌశిక్‌రెడ్డి వీధిరౌడీలా నాపై దాడి చేశారు: ఎమ్మెల్యే సంజయ్



కరీంనగర్: హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వీధిరౌడీలా తనపై దాడిచేశారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో జరిగిన ఘటనపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "కౌశిక్‌రెడ్డి స్వతహాగా చేశారా? ఎవరైనా రెచ్చగొడితే చేశారా? అనేది తేలాలి. ఘటనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశా. నివేదిక తెప్పించుకుని చర్యలు తీసకుంటారని భావిస్తున్నా. గతంలో ఇతర పార్టీల నేతలను భారాసలో చేర్చుకున్నారు. ఇతర పార్టీల నుంచి చేరికలపై కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి. క్షమాపణలు చెప్పి కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేస్తే నేను కూడా చేస్తా" అని సంజయ్ అన్నారు.

**ఏం జరిగిందంటే? :** కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు.

# వీధుల్లో భోగి మంటలు.. ఊరూవాడా పండగ సందడి



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో భోగి పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేశారు. మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. మరోవైపు ఉదయాన్నే భక్తులు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కోసం నగరవాసులు స్వగ్రామాలకు రావడంతో సందడి నెలకొంది. హరిదాసులతో పాటు అలంకరించిన బసవన్నలు ఇంటింటికీ వెళ్తున్నాయి.




లాస్ ఏంజెలెస్‌లోని కార్చిచ్చుల వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. కొన్ని చిన్న మంటలను అదుపు చేసినా.. పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లో వ్యాపించిన మంటలను మాత్రం పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోతున్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణాసంచాతోనే ఇది మొదలైనట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు ఈ అగ్ని ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది ప్రాణాలు కోల్పోగా.. పాలిసేడ్స్‌లో 8 మంది మరణించారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. పాలిసేడ్స్‌లో 23,707 ఎకరాలను, ఏటోన్‌లో 14,117 ఎకరాలను, కెన్నెత్‌లో 1,052 ఎకరాలు, హుర్సెట్‌లో 779 ఎకరాలను దగ్ధం చేశాయి. మొత్తం 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు 160 చదరపు కిలోమీటర్లు కాలిబూడిదయ్యింది.

**పింక్ రంగులోకి మారిన నగరం .. ఎందుకంటే..?...** అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేయడానికి కొన్ని రసాయనాలు కలిపిన ఫోస్ చెక్ అనే మిశ్రమాన్ని దాదాపు 9 విమానాలు, 20 హెలికాప్టర్ల సాయంతో నగరంపై వెదజల్లుతున్నారు.

పింక్ రంగులో ఉన్న ఆ పదార్థం అక్కడి నిర్మాణాలు, మొక్కలపైనా అవి పడి అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేస్తుంది. దీనిలోని అమ్మోనియం పాలీఫాస్ఫేట్ అంతవేగంగా ఆవిరి కాదు. దేనిమీదైనా పడితే సుదీర్ఘకాలం ఉండిపోతుంది. ఇది వృక్షాలపై పడి.. అగ్నికి ఆక్సిజన్ అందకుండా చేయడంతో అవి వేగంగా వ్యాపించలేవు.

**వేడుకలే నిప్పు పెట్టాయా..?..** లాస్ ఏంజెలెస్‌లో అతిపెద్దదైన పాలిసేడ్స్ ఫైర్ కారణం న్యూఇయర్ వేడుకలని అనుమానిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కాల్చిన టపాసులతో అంటుకొని అక్కడ అగ్నిప్రమాదం జరిగింది. దానిని ఆర్పినా.. మిగిలిన నిప్పునకు బలమైన గాలులు తోడు కావడంతో కార్చిచ్చు రాజుకొన్నట్లు అనుమానిస్తున్నారని వాషింగ్టన్ పోస్టు కథనంలో పేర్కొంది. ఉపగ్రహ చిత్రాలు, రేడియో కమ్యూనికేషన్లు, స్థానికులను ఇంటర్వ్యూ చేసిన అనంతరం పాలిసేడ్స్ ఫైర్ అక్కడే మొదలైందని ఆ పత్రిక చెబుతోంది.

**ఫైర్‌ఫైటర్ దుస్తుల్లో దొంగ..** సంపన్న ప్రాంతమైన పాలిసేడ్స్ సహా ఇతర ప్రాంతాల్లో విలువైన వస్తువులను వదిలేసి చాలా ఇళ్లు ఖాళీ చేశారు. దొంగలకు అవే లక్ష్యంగా మారుతున్నాయి. ఇప్పటివరకు 29 మంది దొంగలను అరెస్టు చేసినట్లు లాస్ ఏంజెలెస్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా వెల్లడించారు. వీరిలో ఒకరు ఏకంగా అగ్నిమాపక సిబ్బంది దుస్తుల్లో అక్కడ సంచరిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఖాళీ ఇళ్లను కాపాడేందుకు 400 మంది నేషనల్ గార్డ్స్‌ను ఇక్కడ మోహరించారు. ఇక ఇటీవల కెన్నెత్‌ఫైర్‌ను అంటించినట్లు అనుమానిస్తున్న వ్యక్తి మెక్సికో నుంచి వచ్చిన అక్రమ వలసదారుడిగా గుర్తించారు. అతడి నుంచి బ్లోటార్చ్‌ను కూడా స్వాధీనం చేసుకొన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ప్రాణాంతకంగా మారిన ప్రైవేటు డ్రోన్లు..** లాస్ ఏంజెలెస్‌లో ప్రైవేటు డ్రోన్లు అగ్నిమాపక విమానాలకు ప్రాణాంతకంగా మారాయి. తాజాగా ఓ డ్రోన్ సూపర్ స్కూపర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో విమానం దెబ్బతింది. అసలే వనరులు చాలక లాస్ ఏంజెలెస్ ఇబ్బందిపడుతున్న వేళ ఈ డ్రోన్లు తలనొప్పిగా మారాయి. తాజాగా ఆ డ్రోన్ ఆపరేటర్ కోసం ఎఫ్‌బీఐ గాలింపు మొదలుపెట్టింది.

# మందా జగన్నాథం పాలమూరు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు



హైదరాబాద్: పాలమూరు జిల్లా రాజకీయాల్లో మాజీ ఎంపీ మందా జగన్నాథం తనదైన ముద్ర వేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన మంద జగన్నాథం పార్థివ దేహాన్ని కేటీఆర్, ఇతర నాయకులు. సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జగన్నాథం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... మంద జగన్నాథం మరణంతో తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని తెలిపారు. పాలమూరు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. నాలుగు సార్లు ఎంపీగా అయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. వివాదరహితుడు సౌమ్యుడు..తెలంగాణ మేలు కోరుకున్న వ్యక్తి అని చెప్పారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిని మందా జగన్నాథం ఆకాంక్షించారని కేటీఆర్ తెలిపారు.

# పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తాం

ఖమ్మం జిల్లా: తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందని రాష్ట గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. . తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం కుసుమంచిలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లను ఇవాళ(సోమవారం) ప్రారంభించారు. రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటిని మంత్రి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేదల కల నెరవేర్చుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఒక్క రూపాయి ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు. కేవలం పేదవారయితే చాలు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో పేదవాడికి తీయని కబురు చెబుతున్నామని అన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయబోతున్నామని అన్నారు. నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ



ఇళ్ల నిర్మాణం జరుగబోతోందన్నారు. రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ. 12 వేలు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ భరోసా పథకం ద్వారా రూ.12 వేలు రెండు విడతలుగా ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




కరీంనగర్: హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓ న్యూస్ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా 35 మంది పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్ నుంచి కరీంనగర్ తీసుకెళ్లనున్నారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్డీవో మహేశ్వర్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. తన పట్ల దురుసుగా ప్రవర్తించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదుపై కౌశిక్‌రెడ్డిపై ఇంకో కేసును ఫైల్ చేశారు. ఈమేరకు వేర్వేరుగా మూడు కేసులను పోలీసులు నమోదు చేశారు.

చురకలు




# తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి పండుగ



యుగయుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీర ధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలే మన సాంప్రదాయాలు. హైందవ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచారాలకు "పండగ కేంద్ర బిందువు, పండుగలు శుభ సూచకాలు. ప్రతి కుటుంబంలో కష్ట నష్టాలను మరపించి, నూతనోత్సాహాన్ని కలిగిస్తాయి. పండగలు పురాణేతిహాస, రుతు సంబంధాలు, శీతోష్ణ స్థితుల, సామాజిక జీవన విధానాధారాలుగా ఏర్పడ్డాయి. ప్రతి పండగలో పరమార్థం ఉన్నందునే అవి సాంప్రదాయాలుగా మారాయి. డోలు సన్నాయి వాద్యాలు, వాటి రాగాలకు అనుగుణంగా విన్యాసాలు చేసే అలంకృత గంగిరెద్దులు, హరిలో రంగ హరీ అంటూ, నడినెత్తి నుండి నాసిక దాకా తిరుమణి శ్రీచూర్ణ పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లు ఘల్లుమనగా, బోడి తలపై రాగి అక్షయపాత్ర కదల కుండా, చిందులు తొక్కే హరిదాసులు, అడుగడు గునా ముంగిళ్లలో రంగుల అక్కతులు, భోగిమం టలు, కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు, బొమ్మల పండుగలతో కలబోసిన గ్రామీణ సుందర మనో హర దృశ్యాలు తెలుగు వారికే ప్రత్యేకమైన సాంప్ర దాయ ప్రతీకలు. "చాంద్రమానం" పాటించే తెలుగువారు "సౌరమానం" ప్రకారం జరిపే పండుగ సంక్రాంతి". "తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమ కేషు సంచరత: సూర్యస్య పూర్వస్మాదాశే ఉత్తర: రాశౌ సంక్రమణ ప్రవేశ: సంక్రాంతి:". మేషం మొదలైన 12 రాశు లలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి.సంక్రాంతి అంటే మారడం, చేరడం అని అర్థం. కర్కాటకం నుంచి మకర సంక్రాంతి వరకు సూర్యుడు దక్షిణాభి ముఖంగా సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'దక్షిణాయణం' అంటారు. మకర సంక్రాంతి నుంచి కర్కాటక సంక్రాంతి వరకు ఉత్తరాభి ముఖుడై సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'ఉత్తరాయణం' అని అంటారు. దేవతలకు ఉత్తరాయణం ఉత్తమ కాలమని, దక్షిణాయణం పితృదేవతలకు ముఖ్య కాలమని భావిస్తారు. ఉత్తరాయణంలో మరణిస్తే మోక్షప్రాప్తి కలుగు తుందంటారు. అందుకే అంపశయ్యపై భీష్మాచార్యుడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే వరకు వేచి ఉన్నాడని మహా భారతం చెబుతోంది.. మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి సంబరాలలో మొదటిది భోగి పండగ. ఇతర పండుగల వలె తిథి ప్రధానము అయినది కాదు. ఇది ధనుర్మాసానికి, దక్షిణాయనానికి ఆఖరు రోజు. మకర సంక్రమణానికి పూర్వపు రోజు. గోదాదేవి తిరుప్పావై రచన పూర్తి చేసిన ముప్పయవ నాడు రంగ నాథుడు ప్రత్యక్షమై ఆమెను వివాహమాడతానని, సకల భోగాలు సమకూర్చుస్తానని చెప్పి, వివాహమాడగా, వివాహ తంతు పూర్తికాగానే ఆమె స్వామి వారిలో ఐక్యం పొందుతుంది. అందుకే "భోగి" అని ఈ పర్వమానికి పేరు. జన సామాన్యానికి భోగ భాగ్యాలు ఇచ్చే రోజని ప్రతీతి. భోగినాడు మేఘాధిపతి యైన ఇంద్రపూజు చేయడం ఆనవాయితీ. బలి చక్రవర్తి అణగిన దినంగా చెపుతారు. భోగి నాడు భోగి పీడ నివారణ, తెల్లవారగానే అభ్యంగన స్నానం చేయడం, విధాయక కృత్యం. చంటిపిల్లలకు తలంటు పోసి, భోగి పళ్ళు పోయడంతో దృష్టి పరిహారం చేస్తారు. కొత్త బట్టలు కట్టి, కుర్చీలో కూర్చుండ చేసి, రేగు పళ్ళు, పైసలు, చెరుకు ముక్కలు, బోడీకలు దిగువార బోస్తారు. ధనుర్మాసం నెలరోజులు ఆడపిల్లలు తయారు చేసిన గొబ్బి పిడకలు చేయడం, తెల్లవారగట్ల భోగిమంటలు చేయడం ఆచరిస్తారు. మకర సంక్రాంతి సూర్యుడు ఉత్తర గతుడు కావడం త ఉత్తరాయణ ప్రవేశమవుతుంది. ఉత్తరాయణం దేవతలకు అర్థమైన కాలం, ఈ అయనంలో మృతి చెందిన వారు పుణ్యాత్ములై, సూర్య సాయుజ్యం పొందగలరని వేద వచనం. సూర్య సంచారమును బట్టి ఏర్పడిన పండుగ. ఆడపిల్లలు తెల్లవారు జామున లేచి పెట్టే గొబ్బిల్లు, ఆర్ష కర్మలలో ప్రాముఖ్యం కలిగిన కళా భిజ్ఞత ఉట్టిపడే ముగ్గులు, పళ్ళ నైవేద్యాలు, బాజా భజంత్రీల వాద్యాలు, ఎక్కడ చూసినా ఈనాడు దర్శనమిస్తాయి. రెండవ నాడు జరిపే మకర సంక్రాంతి అత్యంత పురాతనమైనది. సంక్రాంతి నాడు గంగలో స్నానం చేసి, బ్రాహ్మణునికి పెరుగు దానం చేయాలనే నియమాన్ని పాటించిన యశోదకు కృష్ణుడు జన్మించాడని దుర్వాసముని ద్వారా వివరింపబడి, ఆయన సూచనపై ద్రోణాచార్యుని సతి కృపి, సంక్రాంతి పర్వాన్ని జరిపి, పెరుగు దానం చేయడం ద్వారా అశ్వత్థామకు జన్మనిచ్చినట్లు పురాణ కథనం. ఈ సందర్భంగా నువ్వుల ముద్దలతో నలుగు పెట్టుకుని, తలంటి స్నానాలు చేసిన ముత్తయిదువలు, అలంకృతులై, ఐదు మట్టి ముంతలు పుచ్చుకుని, ఒక్కొక్క ముంతలో బియ్యం, పప్పు దినుసులు, చెరుకు, క్యాబేజీ ముక్కలు, రేగుపళ్ళు, నువ్వులు ఉంచి, మూకుడు మూతతో ఉంచి, ఎరిగిన వాళ్ళ ఇళ్ళకు వెళ్లి ఇస్తారు. నువ్వులతో చేసిన భక్ష్యాలతో భోజనం చేస్తారు. చిన్నపిల్లలకు మిఠాయి ఉండలు, రేగు పళ్ళు పంచుతారు.మకర సంక్రాంతినాడు రాముని పూజచేసి ఉపవాసం ఉండాలని చతుర్వర్గ చింతామణిలో ఉంది. ఈనాడు సూర్యుని ఆరాధించి, తిలలు, కూష్మాండాలు, భాండాలు, కంబళి, ధా న్యాలు, లోహాలు, వస్త్రాలు, తైల దీపాలను దానం చేయాలని శాస్త్ర వచనం. భోజనానికి బంధు మిత్రులను ఆహ్వానించడం, నగలతో అలంకరించుకుని నూతన వస్త్ర ధారణ గావించిన ముత్తయిదువలు పంచదారలో నువ్వులు కలిపి చిమ్మిలి చేసి, పంచి పెడతారు. సంవత్సరం పొడవునా, స్నేహితులై ఉండాలని ఆకాంక్షిస్తూ, శుభ, సుఖ ప్రదం కావాలని దీవనలు పెద్దవారి నుండి పొందడం ఆచారం. ఇక చివరిది కనుము పండుగ. అధర్వణ వేదంలో దీనిని వృషభోత్సవమని పేర్కొన్నారు. ముందు సంక్రమణం పెళ్లిన మరువాడు పశువులకు చేసే పండగ ఇది. కనుమ నాడు మినుములు తినాలట..కనుమనాడు మినుములు తినాలని, లేకపోతే యముడు ఇనుము కొరికిస్తాడని పెద్దలు అంటారు. కొన్ని ప్రాంతాల్లో కనుమనాడు తమ గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించే ఆచారం ఉంది. పురుషులు గ్రామ పొలిమేరల్లో కోడి పందాలు, పొట్టేళ్ల పందేలు జరుపుతారు. కనుమ రోజున ప్రయాణం పెట్టుకోకూడదని అంటారు. వెళ్లే వెంటనే తిరిగి రావడం కుదరదని ప్రతీతి. కనుమ నాడు కాకి కూడా ఎక్కడికీ బయల్దేరదనే సామెత. కనుమునాడు గోపూజ చేయడం కొన్ని చోట్ల కనిపి స్తుంది. ఆవులను, దూడలను, ఎడ్లను, శుభ్రంగా కడిగి, కొమ్ము లకు ముఖానికి పసుపు రాచి, కుంకుమ పెడతారు. అలంకరణార్థం కుచ్చులు, కొత్త కట్టు తాళ్ళు పెడతారు. వీధుల వెంట ఊరే గిస్తారు. పశువుల శాలలను శుభ్రపరిచి మామిడాకుల కట్టి, పూలతో అలంకరిస్తారు. సాయం కాలం పొంగలి నైవేద్యాన్ని పశు వుల శాల వద్ద పెడతారు. పవిత్రోదకం చల్లుతారు. పంటలు పండించే భగవంతునికి పొలాలను దున్నే ఎద్దులకు కృతజ్ఞత తెలిపే పర్వం సంక్రాంతి యనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు వారికి ఇష్టమైన సంక్రాంతి సంబరాలకు తెలుగు నేల సిద్ధమవుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పురాణ పురుషులు... మల్లాది చంద్ర శేఖరులు - జనవరి 14...మల్లాది వర్ధంతి



ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వ్మాయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరా తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# హాస్య రస గుళికలు...జంధ్యాల రచనలు - జనవరి 14...హాస్యబ్రహ్మ జంధ్యాల జయంతి



జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ఈ పేరు తెలుగు ప్రజలకు దాదాపు తెలియ దనే చెప్పాలి. కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, ఆయన సుపరిచితు లేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అత్యంత ప్రజా దరణ పొందిన విజయ వంతమైన సినిమాలకు కథలు, ఆకట్టుకునే సంభాషణలు సమకూర్చారని, చిర కాలం గుర్తుండి పోయే చిత్రాలకు దర్శకత్వం వహించారని సినిమాల తో పరిచయం, సంబంధం ఉన్నా చాలా మందికి తెలియదు. ఆయనే ..హాస్యబ్రహ్మ గా పేరు పొంది, ఇంటి పేరుతో ప్రఖ్యాతి గాంచిన వెండితెర హాస్య బ్రహ్మ జంధ్యాల. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (జనవరి 14, 1951 - జూన్ 19, 2001 ) తెలుగు సినిమా రచయిత, దర్శకులు. జంధ్యాల అని ఇంటి పేరు తోటే సుప్రసిద్ధుడైన ఆయన అసలుపేరు జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ప్రత్యేకించి హాస్యకథా చిత్రాలు తీయ టంలో ఆయనది అందె వేసిన చెయ్యి. జంధ్యాల చెప్పిన ప్రసిద్ధ వాక్యం - నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం. అనేది నానుడి. జంధ్యాల 1951 జనవరి 14 న పశ్చిమ గోదావరి జిల్లా నరసా పురంలో జన్మించాడు. బి.కామ్ వరకు చదువు కున్నారు. చిన్న తనం నుండి నాటకాల పట్ల ఆసక్తి గా ఉండేవారు. స్వయంగా నాటకా లు రచించారు. ఆయన రాసిన నాటకాల్లో "ఏక్ దిన్ కా సుల్తాన్, గుండెలు మార్చబడును" ప్రముఖ మైనవి. ఆయన నాటకాలు అనేక బహుమతులు అందుకున్నాయి. 1974లో జంధ్యాల సినిమా రంగ ప్రవేశం చేసారు. శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు వంటి అనేక విజయ వంతమైన సినిమాలకు మాటలు రాశారు. ముద్ద మందారం సినిమా తో దర్శకుడిగా మారి, శ్రీవారికి ప్రేమలేఖ వంటి చిరస్మరణీయ చిత్రాన్ని సృజించారు. 1976 లో దేవుడు చేసిన బొమ్మలు చిత్రం ద్వారా మాటల రచయితగా తన సినిమా జీవితం మొదలు పెట్టారు. ఐదేళ్ళలో సుమారు 85 సినిమాలకు రచయితగా పని చేయగా అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయం సాధిం చడంతో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత దర్శకు డిగా మారి, అనేక హాస్య చిత్రాలను రూపొందించారు. ఆరోగ్య కరమైన హాస్యానికి జంధ్యాల పేరు గాంచారు. హాస్యబ్రహ్మ అని పేరు పొందారు. రచయితగా 300కు పైగా సినిమాలు, దర్శకుడు గా షుమారు 50 సినిమాలు చేసారు. అప్పటి కామెడీ హీరోలకు లైఫ్ ఇచ్చాయి ఈయన సినిమాలు. ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించారు. శ్రీలక్ష్మి, బ్రహ్మానందం లాంటి వారిని ఈ రోజుకి ప్రేక్షకులు గుర్తుంచు కున్నారంటే ఆయన సినిమాలే కారణమనేది వాస్తవం. జంధ్యాల కేవలం హాస్యమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ రచించే వారు. అజరామర 'శంకరా భరణం' చిత్రంతో పాటు 'సప్తపది' జంధ్యాల రచనకు తార్కాణాలుగా నిలిచాయి. సినిమా పరిశ్రమలో జంధ్యాల, కె.రాఘవేంద్రరావుల కాంబినేషన్ కు విశేష ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'అడవి రాముడు', 'వేట గాడు', 'డ్రైవర్ రాముడు', 'జగదేక వీరుడు అతిలోక సుందరి' వంటి చిత్రాలను జన రంజకంగా రూపొం దించడంలో జంధ్యాల పాత్ర కీలకంగా నిలిచింది. అలాగే కె.విశ్వ నాథ్, జంధ్యాల కాంబినేషన్ కూడా సూపర్‌హిట్ చిత్రాలకు పెట్టింది పేరు. ఈ కాంబినేషన్‌లో 'శంకరా భరణం', 'సాగర సంగమం' వంటి చిత్రాలొచ్చాయి. దర్శకుడుగా ఆయన మొదటి సినిమా ముద్ద మందారం ఈరోజుకి అంత ఆదరణ పొందుతోంది అంటే ఆయన దర్శ కత్వ ప్రతిభే. కామెడీ చిత్రాలకు ఎక్కువగా పని చేసిన జంధ్యాల వేగవంతమైన రచయితగా పేరు తెచ్చు కున్నారు. పది రోజుల్లో సినిమాకు మాటలు రాసేవారు. ఆయన కళాత్మక చిత్రా లకు ఎంత హృద్యంగా రాశారో, హాస్య భరిత చిత్రాలకు అంత చిలిపిగా రాశారు. 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం దర్శకుడు జాతీయ అవార్డు, 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ దర్శకుడు నంది అవార్డు, 1987లో, "పడమటి సంధ్యారాగం" చిత్రానికి ఉత్తమ కథారచయిత అవార్డు, 1992లో, "ఆపద్బాంధవుడు" చిత్రానికి ఉత్తమ మాటల రచయిత అవార్డు లభించాయి. జంధ్యాల తన సినిమాల ద్వారా అనేక మంది నటులను... బ్రహ్మా నందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు తదితర నటీనటులను జంధ్యాల సినీ రంగానికి పరిచయం చేశారు. ఇంటి పేరు తోటే ప్రసిద్ధుడైన జంధ్యాలను మీ అసలు పేరు ఏమిటి అని అడిగితే ఆయన ఇలా అనేవాడు: "నేను రామానాయుడి సినిమాకు పనిచేసేటపుడు నాపేరు జంధ్యాల రామానాయుడు, విశ్వనాథ్ గారి సినిమాకు పనిచేసే టపుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్"... అలా అనేవారు తప్ప, తన అసలుపేరు ఎక్కడా చెప్పు కోలేదు. జంధ్యాల 2001 జూన్ 19 న హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు.... పేర్లు సాహితి, సంపద.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కుటుంబ కథా చిత్రాలకు అనువైన నటుడు శోభన్ బాబు

# - జనవరి 14.. శోభన్ బాబు జయంతి

తెలుగు సినీ చరిత్రలో శోభన్ బాబు ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన తన అభినయంతో, అందమైన ముఖ కాంతితో, మధురమైన మాటలతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా, మంచితనానికి మారుపేరుగా కూడా ఆయనకు గుర్తింపు ఉంది. శోభన్ బాబు అసలు పేరు ఉప్పలపు శోభనాచలపతి రావు. ఆయన 1937 జనవరి 14న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా చిన నందిగామలో జన్మించారు. చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తి ఉన్న శోభన్ బాబు, తన విద్యలోనూ ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ లో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆయన, న్యాయవాదిగా పనిచేయాలని కలలు కన్నారు. అయితే సినిమా రంగంపై మక్కువ కారణంగా తన ప్రయాణాన్ని మారుస్తూ నటన రంగంలో అడుగు పెట్టారు. శోభన్ బాబు 1959లో "దైవ బలం" అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. అయితే ఆయనకు గుర్తింపు తెచ్చిన చిత్రం 1965లో వచ్చిన "మనుషులంతా ఒకటే". ఈ చిత్రం ద్వారా ఆయన తండ్రి పాత్రలు, ప్రేమిక పాత్రలు, కుటుంబ కథా చిత్రాలకు అనువైన నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారు. శోభన్ బాబు దాదాపు 200కి పైగా చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాల్లో ఆయన పాత్రలు సున్నితమైన భావోద్వేగాలను పండించాయి. ప్రేమ కథా చిత్రాలు, సాంఘిక చిత్రాలు, పౌరాణిక పాత్రలు ఇలా అన్ని విధాలుగా ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. తన చిత్రాల్లో ఉన్న సహజత్వం, వినమ్రత, నిగర్వం ఆయన నటనకు ప్రత్యేకతను తెచ్చింది. ముఖ్యంగా "సోగ్గాడు", "మనవూరు పాండవులు", "కాలం మారింది", "జీవన తరంగాలు", వీరాభిమన్యు, "వాల్తేరు మొనగాడు" వంటి చిత్రాలు శోభన్ బాబును అగ్రహీరోగా నిలిపాయి. శోభన్ బాబు నిష్కల్మషమైన వ్యక్తిత్వానికి ప్రసిద్ధి. సినిమా రంగంలో ఉన్నప్పటికీ ఆయన ఎల్లప్పుడూ సాధారణ జీవన శైలిని అనుసరించారు. సహ నటులతో మంచి అనుబంధం కలిగి, నిరాడంబర వ్యక్తిగా గుర్తింపు పొందారు. సినిమాలకు సంబంధించిన వ్యవహారాలు పూర్తయిన తర్వాత ఎక్కువ సమయం తన కుటుంబానికి కేటాయించేవారు. సినిమా రంగానికి వీడ్కోలు చెప్పిన తరువాత తన జీవితాన్ని పూర్తిగా కుటుంబానికి, ఆధ్యాత్మికతకు అంకితం చేశారు. శోభన్ బాబు తన నటనకు అనేక



అవార్డులు పొందారు. నంది అవార్డు ద్వారా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఉత్తమ నటుడిగా గుర్తింపు, ఉత్తమ నటుడిగా నాలుగుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకున్నారు. భారత ప్రభుత్వం ద్వారా సినీ రంగానికి చేసిన సేవలకు ఆయనకు గౌరవం లభించింది 2008 మార్చి 20న చెన్నైలో గుండెపోటుతో శోభన్ బాబు మరణించారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. శోభన్ బాబు చిత్రాలు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఆయన చిత్రాలు కుటుంబ విలువలు, అనుబంధాలను ప్రతిబింబించే చిత్రాలుగా నిలిచాయి. శోభన్ బాబు తెలుగు చిత్రసీమకు విలువైన ఆభరణం. ఆయన నటన, సౌమ్యమైన వ్యక్తిత్వం, జీవన విధానం ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. శోభన్ బాబు వంటి నటుడు మళ్లీ పుట్టడం అరుదు.

**రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# దారిపై తూట్లు.. తప్పని పాట్లు

మోతె : సూర్యాపేట– ఖమ్మం, దేవరపల్లి 365 బీబీ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చిన రెండేళ్లకే ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. విశాలమైన నాలుగు వరుసల తారురోడ్డుపై దూసుకెళ్లాల్సిన వాహనాలు అక్కడక్కడా రోడ్డు డ్యామేజీతో కుదుపులకు గురై ప్రమాదాల బారిన పడుతున్నాయి.
ప్రస్తుత పరిస్థితులకు అనువుగా అవసరమైన సాంకేతికతతో ఎక్కడా జంక్షన్‌లు లేకుండా నిర్మించిన ఈ రహదారిలో అక్కడక్కడ రోడ్డు పాసింగ్‌ల కోసం అండర్‌పాస్ వంతెనలు అధిక సంఖ్యలో నిర్మించారు. వాగులపై, అండర్ రోడ్డు పాసింగ్ ప్రదేశాల్లో ఆర్ఈ వాల్‌తో నిర్మించిన వంతెనల వద్ద ప్రస్తుతం తారురోడ్డు ధ్వంసమైంది. మోతె మండల కేంద్రం సమీపంలోని రెండు పైవంతెనల పైన, మామిళ్లగూడెం టోల్‌ప్లాజా సమీపంలో వాగుపై నిర్మించిన వంతెనల వద్ద ఈ పరిస్థితి



ఉంది. దీంతో ఆ ప్రదేశంలో తారు పొరను తొలగించి వదిలేశారు. తిరిగి బీటీ వేయలేదు. అక్కడ నామమాత్రంగా పెట్టిన భద్రత సూచికలు రాత్రివేళ కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మోతె సమీపంలో పైవంతెనలపై రోడ్డు ధ్వసమైన చోట రహదారిని మూస్తూ భద్రతా సూచికలు ఏర్పాటు చేసి మరమ్మతులు చేయక నెలల తరబడి అవి అక్కడే దర్శనమిస్తున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు వంతెనల వద్ద ఏర్పడ్డ గుంతల్లో పడి ప్రమాదాలతో పాటు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.
ఈ విషయాన్ని ఓఅండ్‌ఎం మేనేజరు రవి దృష్టికి తీసుకెళ్లగా.. తవ్విన ప్రదేశంలో తారురోడ్డు పునర్నిర్మిస్తామన్నారు. తారు మిక్స్ అందుబాటులో లేక మరమ్మతుల నిర్వహణ కొంత ఆలస్యమైందన్నారు. మరమ్మతులు వెంటనే పూర్తిచేసి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

# పర్యవేక్షణ కరవు.. అవినీతి దరువు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం మరోసారి బయటపడింది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి లేఅవుట్ లేకుండా, పేరు, అనుమతులు లేని వెంచర్‌లలో 154 ప్లాట్లకు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు చేసినందుకు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ పి.గోపిని విచారణ అనంతరం శాఖ డీఐజీ మధుసూదన్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ హెచ్.రవి సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఇప్పటికీ అనేక సార్లు అధికారులు, ఉద్యోగులు అవినీతి, విధుల దుర్వినియోగంతో దొరికినా వారి తీరు మాత్రం మారడం లేదని మరోసారి రుజువవుతోంది.
2019లో కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు జరిగాయి. నాడు రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న వాహేద్‌ఖాన్‌పై బదిలీ వేటు చేశారు. ఆయన బదిలీ అనంతరం మూడు నెలల వ్యవధిలోనే ఏడుగురు సబ్ రిజిస్ట్రార్లను మార్చడంతో వారి పనితీరుకు అద్దం పడుతుంది. ఆ తర్వాత దేవానంద్ బాధ్యతలు ఏడాదిలోనే వసూళ్లకు పాల్పడి ఏసీబీ దొరికి, సస్పెండ్ అయ్యాడు. ఏడాది కాలంగా ఇన్‌ఛార్జులతోనే




నెట్టుకొస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన లక్ష్మీ కూడా అవినీతికి పాల్పడి సస్పెండ్‌కు గురైంది. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.గోపిని రెండు నెలల క్రితం యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆలేరు మండలం, కొలనుపాక గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 472, 473 లో 7.24 ఎకరాల భూమిని ఎలాంటి అనుమతులు లేనప్పటికీ డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో 154 ప్లాట్ల దస్తావేజులు రిజిస్ట్రేషన్లు చేయడం, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఫిర్యాదుతో అధికారులు విచారణ చేసి రుజువు కావడంతో సస్పెండ్ చేశారు.

**గుట్టలో ఎందుకు అలా..**

యాదగిరిగుట్ట అంటేనే స్థిరాస్తి వ్యాపారానికి కేంద్రంగా ఉంది. ఈ ప్రభావం చుట్టూ 40 కిలో మీటర్ల మేర ఉంటుంది. అందుకే యాదగిరిగుట్ట ఎంత దూరం ఉన్నా పక్కనే అన్నట్లుగా స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు దారులకు ఆశలు కల్పిస్తూ, భూముల క్రయవిక్రయాలు చేపడుతుంటారు. నియోజకవర్గంలో ఉన్న ఈ ఒకే ఒక్క ఈ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎప్పుడు కిటకిటలాడుతుంటుంది. ఇదే అదనుగా అక్రమ వసూళ్లకు, రిజిస్ట్రేషన్లకు అణువుగా మారుతోంది. దస్త్రాల పని త్వరగా అవ్వడానికి స్థిరాస్తి వ్యాపారులు కల్పించే ఎరలకు, రాజకీయ నాయకుల అండదండలకు, అభయాలకు లొంగిపోయి నిబంధనలు కూడా తొక్కేస్తుంటారు. ఈ క్రమంలో దొరికి పోతూ అవినీతి పరులుగా మిగులుతుంటారు. అధికారుల అవినీతి జాడ తెలియకుండా డాక్యుమెంట్ రైటర్లు ఇందులో ప్రధాన పాత్ర వహిస్తున్నట్లుగా గతంలో ఏసీబీ దాడుల్లో వెలుగు చూసిందే. ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉండే పై అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అవినీతి, అక్రమాలు సాధారణంగా మారుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

# నిర్మించారు.. మరిచారు



సిరిసిల్ల : మరమగ్గాలపై వస్త్రం ఉత్పత్తి అయ్యాక వాటి ఎగుమతికి ముందు డైయింగ్, ప్రింటింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ ఉంటుంది. ఇది ప్రీ వీవింగ్ ప్రక్రియలో భాగం. ఇదంతా సీఎఫ్‌సీ (ఉమ్మడి వసతుల కేంద్రం)లో జరుగుతుంది. దీనిలో పరిశ్రమల నుంచి వెలువడే రంగులు, రసాయనాల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు 2007లో టెక్స్‌టైల్ పార్కులో రూ.50 లక్షల వ్యయంతో ఈటీపీ (ఇఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను నిర్మించారు. వస్త్రోత్పత్తి పరిశ్రమల విస్తరణకు ముందు చూపుతో నిర్మించిన ఈ ప్లాంటు నిర్మాణానికే పరిమితమైంది. ఏళ్లు గడుస్తున్నా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీనిలో విలువైన విద్యుత్తు సామగ్రి, పైపులు, మోటార్లు చోరీకి గురవుతున్నాయి. ఇతర యంత్ర పరికరాలు తుప్పు పడుతున్నాయి. పార్కులో ఈ యూనిట్‌ను పట్టించుకునేవారే కరవయ్యారు. పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసే ఈ ప్లాంటు పట్టణాల్లో నిర్మించాలంటే ఇప్పుడున్న అంచనా ప్రకారం రూ.5 కోట్లపైన ఖర్చవుతుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత పార్కు పరిపాలనా బాధ్యులకు అప్పగించాలి. ఏళ్లు గడుస్తుండటం, అధికారులు మారడంతో అసలు ఇక్కడ ప్రభుత్వ వ్యయంతో నిర్మించిన ఈటీపీ ప్లాంటు ఉందనే విషయమే చాలా వరకు తెలియని పరిస్థితి ఏర్పడింది.

**ఇలా చేస్తే ఉపయోగం**

పార్కులోని ఈటీపీ వినియోగంలోకి రావాలంటే సీఎఫ్‌సీ కేంద్రం ఏర్పాటు చేయాలి. అందులో నుంచి వచ్చే వ్యర్థ జలాలను ప్లాంటులోకి తరలించి శుద్ధి చేసే వీలుంది. సీఎఫ్‌సీ ఏర్పాటుకు రూ.80 కోట్లతో చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.
సిరిసిల్ల పట్టణంలో కాటన్ అద్దకం పరిశ్రమలు ఉన్నాయి. వీటి నుంచి రంగులు, రసాయనాలు నేరుగా మురుగు కాల్వల్లో కలుస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. వీటిని నియంత్రించాలంటే అద్దకం పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలను ట్యాంకుల్లోకి మళ్లించి వాటిని పార్కులోని ఈటీపీలోకి వాహనాల ద్వారా తరలించి శుద్ధి చేస్తే ఒక రకంగా ఈ ప్లాంటు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.
పార్కులో పరిశుభ్రత, మొక్కల పెంపకం వీధి దీపాల నిర్వహణకు అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏటా యూనిట్ల నుంచి కొంత సొమ్మును వసూలు చేస్తుంది. దీనితో పచ్చదనం, పరిశుభ్రత వంటి పనులు చేపడతారు. పరిశ్రమల కాపలాకు సిబ్బంది లేరు.
పార్కు పరిపాలన వ్యవహారాలు చక్కబెట్టేందుకు చేనేత, జౌళిశాఖలో డీడీఏ స్థాయి అధికారిని నియమించాలి. ప్రస్తుతం పట్టణంలోని ఏడీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. కార్యాలయంలో పని చేసే సిబ్బంది సైతం పొరుగు సేవల ద్వారా నియమించినవారే ఉన్నారు.

**రక్షణకు చర్యలు తీసుకుంటాం**

సాగర్, ఏడీ, చేనేత, జౌళిశాఖ
సీఎఫ్‌సీ కేంద్రం ఏర్పాటు చేస్తే ఈటీపీ వినియోగంలోకి వస్తుంది. వాటిలోని పరికరాలను పరిశీలించి రక్షణకు చర్యలు తీసుకుంటాం.

# యాసంగి సాగుపై అన్నదాతల ధీమా



బోయినపల్లి : యాసంగిలో పంటలకు మధ్యమానేరు నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. దిగువన ఎల్‌ఎండీ జలాశయం, కుడి కాలువ కింద సాగవుతున్న ఆయకట్టుకు 3,255 క్యూసెక్కులను తరలిస్తున్నారు. పంట కోతలు పూర్తయ్యే వరకు విడుదల కొనసాగనుంది. దీంతో పంటలపై అన్నదాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.
బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం దిగువన సాగు చేస్తున్న పంటలకు ఆధారంగా మారింది. యాసంగిలో ఎల్‌ఎండీ, మధ్యమానేరు జలాశయం కుడి కాలువ కింద ఆయకట్టు పంటలకు నీరు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఎల్‌ఎండీకి 16 టీఎంసీలు, కుడి కాలువకు 6 టీఎంసీల నీటిని వదలాలని అక్కడి అధికారులు కోరారు. దీంతో వరి నాట్లు, ఇతర పంటల సాగు ప్రారంభమైన నాటి నుంచి రైతుల అవసరాల మేరకు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ఒక గేటు నుంచి 500 క్యూసెక్కులు వదలడం ప్రారంభించి క్రమేపి 3 వేల క్యూసెక్కులకు పెంచారు. కుడి కాలువకు మొదటగా 350 క్యూసెక్కులు వదలగా ప్రస్తుతం 250 క్యూసెక్కులకు తగ్గించారు. ఎడమ కాలువకు 5 క్యూసెక్కులు తరలిస్తున్నారు. కుడి కాలువ కింద సుమారు 60 వేలు, ఎడమ కాలువ కింద సుమారు 4 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఇప్పటి వరకు ఎల్‌ఎండీకి ఒక టీఎంసీ, కుడి కాలువకు 0.41 టీఎంసీల నీటిని తరలించారు.

**25.81 టీఎంసీల నీటి నిల్వ**

జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 25.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది జనవరిలో 18.03 టీఎంసీలు ఉంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 3,395 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. పంటల సాగుతోపాటు మిషన్ భగీరథకు రోజూ 40 క్యూసెక్కులు వదులుతున్నారు. మల్కపేట రిజర్వాయర్‌కు ట్రయల్ రన్ నిర్వహించి నీటిని తరలిస్తున్నారు. మార్చి వరకు రైతుల అవసరాల మేరకు విడుదల చేయనున్నారు.

**చెక్‌డ్యాంలు నిర్మించాలి**

ఐల పరశురాములు, రైతు, మల్లాపూర్
మానేరు వాగులోని బోరుపై ఆధాపడి నాలుగెకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. జలాశయం దిగువన బోర్లు ఉన్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఎల్‌ఎండీకి నీటిని విడుదల చేసిన సమయంలో పంటలకు నీరందుతుంది. పంట కోతలు పూర్తయ్యే వరకు నీటిని విడుదల చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. జలాశయం దిగువన చెక్‌డ్యాంల నిర్మాణం చేపడితే వాగులో నీరు ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతులకు ఇబ్బంది ఉండదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాలి.

**పంట కోతలు పూర్తయ్యే వరకు...**జగన్, ఈఈ, మధ్యమానేరు
పంటల సాగుకు కోసం జలాశయం నుంచి దిగువన ఎల్‌ఎండీకి 16, కుడి కాలువకు ఆరు టీఎంసీల నీరు కావాలని కోరారు. వీటితోపాటు ఎడమ కాలువకు కూడా విడుదల చేస్తున్నాం. మార్చి నెలాఖరు వరకు నీటి విడుదల ఉంటుంది. ఎస్సారెస్పీ నుంచి జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

# రుణం చెల్లించాక.. మాఫీ!

కరీంనగర్ : ఇలా పంట రుణం తీసుకున్న పలువురు రైతులు.. వివిధ కారణాలతో ముందుగానే డబ్బులు చెల్లించి ఖాతాలు రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లుగా చరవాణులకు సందేశాలు వస్తున్నాయి. దాని ఆధారంగా బ్యాంకులకు వెళ్తే అధికారులు సరైన సమాధానాలు చెప్పడంలేదు. ఇలాంటి వారు జిల్లావ్యాప్తంగా వేలాది మంది ఉంటారని సమాచారం. మరికొన్ని చోట్ల మరణించిన రైతుల ఖాతాలకూ డబ్బులు పడినట్లు ఫోన్లకు సందేశాలు వస్తున్నాయి. ఇలాంటి రైతుల పరిస్థితిపై వ్యవసాయ అధికారులుగానీ, బ్యాంకర్లుగానీ ప్రభుత్వానికి రాసి పంపితేగాని పై స్థాయిలో తెలుస్తుంది. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుంది. ఇండియన్ బ్యాంకు అధికారులు రైతుల వివరాలు పైకి ఆలస్యంగా పంపినట్లు సమాచారం. చెర్లబూత్కూర్‌కు చెందిన ఈరు కొమురయ్య దుర్శేడులోని ఇండియన్ బ్యాంకులో రుణం తీసుకున్నారు. అవి వడ్డీతో సహా రూ.93,662 అయింది. ఈ రుణాన్ని ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించే కంటే ముందే వడ్డీతో సహ చెల్లించి రుణ ఖాతాను రద్దు చేయించుకున్నారు. ఇటీవల నాలుగో విడతలో కొమురయ్య సెల్ ఫోన్‌కు పంట రుణం జమ చేసినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంకు అధికారులను కలిస్తే సరైన సమాధానం చెప్పడం లేదు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు కూర మల్లారెడ్డి గతంలో పంట రుణం దుర్శేడు ఇండియన్ బ్యాంకులో పొందారు. అవి వడ్డీతో కలిపి రూ.26,658



అయింది. మొత్తం చెల్లించి ఖాతాను మూసేయించారు. ఖాతా మూసేసే సమయానికంటే ముందే బ్యాంకర్లు ప్రభుత్వానికి రుణ మాఫీ కోసం పంపారు. వీరికి మొదటి విడతలోనే మాఫీ కావాల్సి ఉంది. కానీ బ్యాంకులో సాంకేతక సమస్యతో నాలుగో విడతలో మాఫీ అయినట్లు ఫోన్‌కు సందేశం వచ్చింది.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే..**కొంతమంది రైతులు ఋం మొత్తం చెల్లించిన తర్వాత కూడా మాఫీ అన్నట్లుగా మెసెజ్‌లు వస్తున్నాయి. దీనిపై మరో రుణ ఖాతాకు జమ చేయమని ప్రభుత్వం ఆదేశాలు ఇస్తేనే ఆ డబ్బులు జమ చేయడానికి వీలవుతుంది. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి

# కొత్త టవర్లు.. పాత కష్టాలు...

మంచిర్యాల దహెగాం మండలంలోని దిగిడ గ్రామంలో 700 మెగా హెడ్జ్ ఫ్రీక్వెన్సీతో టవర్ నిర్మించారు. దీని సామర్థ్యం ప్రకారం 3.5 కిటోమీటర్ల దూరంలోని గ్రామాల్లో సైతం నెట్‌వర్క్ ఉండాలి. కానీ అక్కడ 4జీ, 5జీ చరవాణులు లేనివారికి నెట్‌వర్క్ లేక మొట్లగూడ, రాంపూర్ తదితర గ్రామాలకు వెళ్తున్నారు. అక్కడ కూడా సంకేతాలకోసం ఇబ్బంది పడుతూ చరవాణిలో మాట్లాడుకుంటున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే 2,100 మెగా హెడ్జ్ ఫ్రీక్వెన్సీని టవర్లకు ఏర్పాటు చేస్తే అన్ని రకాల చరవాణులకు నెట్‌వర్క్ పనిచేస్తుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా భారతీయ సంచార్ నిగమ్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మారుమూల గ్రామాల్లో చరవాణి సంకేతాల సమస్యలను తీర్చి అధునాతన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన టవర్ల కారణంగా పాతతరం 2జీ చరవాణులు వాడుతున్న సాధారణ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంకేతాలకష్టాలను తీర్చాలని కేంద్ర ప్రభుత్వం.. రెండేళ్ల కిందట ప్రత్యేకంగా భారత్ సంచార్ నిగమ్ సెల్ టవర్లను మంజూరు చేసింది. స్థల సమస్య కారణంగా జిల్లాలో పలు పనులు నిలిచిపోయాయి. అటవీ, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించగా.. గతేడాది మార్చిలో నిర్మాణాలకు అనుమతి లభించింది. టవర్లు కళ్ల ముందే ఉన్నా.. ప్రస్తుతం పలు ఫోన్లకు సంకేతాలు రాక, సాంకేతిక సమస్య తలెత్తుతోంది.
జిల్లాలోని పలు గిరిజన, గిరిజనేతర మండలాల్లోని మారుమూల గ్రామాల్లో 4జీ, 5జీ సేవలను విస్తరించాలనే సంకల్పంతో.. ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ 62 సెల్ టవర్లను మంజూరు చేసింది. ఒక్కో టవర్ నిర్మాణానికి రూ.1.30 కోట్లు కేటాయించింది. ఆసిఫాబాద్



మండలంలో ఏడు, బెజ్జూరు మండలంలో రెండు, చింతలమానెపెల్లి మండలంలో ఒకటి, దహెగాంలో నాలుగు, కాగజ్‌నగర్‌లో అయిదు, కెరమెరిలో 12, కౌటాలలో నాలుగు, పెంచికల్‌పేట్‌లో మూడు, రెబ్బెనలో ఒకటి, సిర్పూర్(టి)లో నాలుగు, తిర్యాణిలో 13, వాంకిడిలో ఆరు టవర్లు మంజూరు కాగా.. ఈ టవర్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. ఈ టవర్లన్నీ 700 మెగా హెడ్జ్ ఫ్రీక్వెన్సీతో 4జీ 5జీ చరవాణులకు మాత్రమే నెట్‌వర్క్ వస్తోంది. మారుమూల గ్రామాల్లోని పేదలకు ఇలాంటి చరవాణులు లేకపోవడంతో.. మళ్లీ మొదటికి వచ్చింది.

**అటవీశాఖ అనుమతి లేక..**

జిల్లాలో కొత్తగా 16 బీఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేక నిర్మాణాలకు నోచుకోవడంలేదు. కడంబా, బీంజిగూడ, రేగులగూడ, గోంది, గోయగాం, బాబెజరి, జోడేఘాట్, ఇస్తాపేట్, అంతాపూర్, మాణిక్‌పటార్ తదితర గ్రామాలకు టవర్లు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేక ఇంకా పనులు ప్రారంభించలేదు.

**అధికారి ఏమన్నారంటే..**

జిల్లాలో కొత్తగా నిర్మించిన టవర్లు నెట్‌వర్క్ కవరేజ్ ఎక్కువ దూరం అందించే సాంకేతిక సామర్థ్యం కలిగి ఉన్నాయని బీఎస్ఎన్ఎల్ డీఈఈ శ్రీధర్ తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించామన్నారు. టవర్లలో సాంకేతిక లోపం ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ధరణి రిజిస్ట్రేషన్లకు సాంకేతిక చిక్కులు

మంచిర్యాల : తెలంగాణ భూ పరిపాలనలో ధరణి పోర్టల్ నుంచి భూ భారతిగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ధరణి పోర్టల్ విధానాన్ని రద్దు చేస్తూ కొత్త వెబ్‌సైట్ రూపకల్పన చేయడానికి ఎన్ఐసీకి బాధ్యతలు అప్పగించారు. ఆ కంపెనీ నుంచి పూర్తి సమాచారం మార్పిడి చేసుకొని కొత్త తరహా సాంకేతికతను ఎన్ఐసీ అనుసంధానం చేస్తోంది. ఫలితంగా ధరణిలో సాంకేతిక పరమైన సమస్యలు ఏర్పడి రిజిస్ట్రేషన్లు చేయడానికి అంతరాయం ఏర్పడింది. ధరణి పోర్టల్ ఏర్పడినప్పటి నుంచి వ్యవసాయ భూములను తహసీల్దారు కార్యాలయాల్లో, ఇళ్ల స్థలాలు, ఇళ్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లాలో 16 గ్రామీణ, రెండు అర్బన్ మండలాలు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ భూములను మండల తహసీల్దారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తారు. భూముల కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం 43 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. కొత్త వెబ్‌సైట్ ఆధునికీకరణ కారణంగా భూముల రిజిస్ట్రేషన్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల తహసీల్దారు కార్యాలయంలో ఒక దస్తావేజు రిజిస్ట్రేషన్‌కు ఉదయం నుంచి సాయంత్రం సమయం పట్టిందని అధికారులు తెలిపారు. దస్తావేజు ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే సర్వర్ డౌన్, లాగ్ ఔట్ అవుతూ సాంకేతిక సమస్య ఏర్పడింది. జిల్లాలో గురువారం సాంకేతిక కారణాల వల్ల ఏడు రిజిస్ట్రేషన్లు ఆగిపోగా, అమ్మకందారులు, కొనుగోలుదారు రాక తొమ్మిది నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యతో భూముల విక్రయ దస్తావేజులు, దానపట్టా దస్తావేజుల్లో జాప్యమైంది.

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథావిధిగా..**

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథావిధిగా భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 42, లక్షెట్టిపేటలో 10 దస్తావేజులు రిజిస్ట్రేషన్లు చేశారు. తహసీల్దారు కార్యాలయాల్లో నిర్వహించే ధరణి భూముల రిజిస్ట్రేషన్లలో మాత్రమే సాంకేతిక సమస్యతో జాప్యమైంది.

# నిషేధం.. కాగితాలకే పరిమితం

రాయికల్ : పల్లెల్లో, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఇలా ఏది కొన్నా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంలో క్షేత్రస్థాయిలో కఠిన వైఖరి అవలంభించకపోవడంతో మానవ జీవితంలో నిత్యావసర వస్తువుగా మారి మానవాళి మనుగడకు సవాలు విసురుతోంది. వినియోగించడం సరికాదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించే అధికారుల చర్యలు కాగితాలకే పరిమితం కావడంతో ప్లాస్టిక్ భూతం కరాళ నృత్యం చేస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు ఒక్కో ఇంటి నుంచి సుమారు 10 ప్లాస్టిక్ కవర్లు చెత్త కుప్పల్లోకి చేరుతున్నాయి. రోజుకు 8 నుంచి 10 టన్నుల చెత్త సేకరిస్తుండగా అందులో 50 శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘం అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తుండగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి.

**సమష్టి సహకారంతోనే నియంత్రణ**

జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్



చెత్త సేకరణ వాహనాల ద్వారా మైకుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంలో దాతల సహకారంతో నారసంచులు పంపిణీ చేశాం. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తుండటంతో ప్లాస్టిక్ విక్రయాలు కొంత మేర నియంత్రణలో ఉన్నాయి. ఇప్పటివరకు జరిమానాల రూపంలో రూ.22వేల ఆదాయం సమకూరింది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి తనిఖీలు సద్దుమనిగాక తిరిగి యథావిధిగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విక్రయదారులు, వినియోగదారులు సమష్టిగా సహకరించినప్పుడే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. **వినియోగంతో అనర్థాలెన్నో..** పర్యావరణంపై అవగాహన లేని కొందరు జనావాసాల్లో, వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పడేయడం వలన వర్షాలు కురిసినపుడు నీరు భూమిలోకి ఇంకి పోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా చేరుకోవడంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తినడం ద్వారా గర్భకోశ వ్యాధులు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. భూమిపైకి చేరిన ప్లాస్టిక్ కవర్లు నాశనం కావాలంటే వేల సంవత్సరాలు పడుతుండగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్లాస్టిక్ సంచులు, గ్లాసుల్లోని పదార్థాలు వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ చెత్తను కాల్చడంతో వచ్చే వాయువులు విషపూరితమై సమీప కాలనీవాసులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

# స్థాయి సరే.. సౌకర్యాలు ఎలా..?

నల్గొండ : జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి స్థాయి పెరుగుతోంది. వైద్య కళాశాలలో ముందు (2019) 250 పడకలు మాత్రమే ఉండేవి. తర్వాత వైద్యకళాశాలకు అనుమతి రావడంతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. తాజాగా రూ.23.75 కోట్లతో కొత్తగా సీసీబీ (క్రిటికల్ కేర్ బ్లాక్)తో మరో 80 పడకలు, అధునాతన వసతులతో ప్రత్యేక ఆసుపత్రి మరో 20 రోజుల్లో సిద్ధం కానుంది. వైద్య కళాశాల తరగతి గదులు నూతన భవనం(ఎస్ఎల్‌బీసీ ప్రాంతం)లోకి మార్చడం ద్వారా 200 పడకలు కొత్తగా అందుబాటులోకి వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు అదనపు భవనంపై మరో అంతస్తు నిర్మించడానికి అనుమతి రావడంతో మరో 200 పడకలు అందుబాటులోకి రానున్నాయి. మరో నాలుగు నెలల్లో జనరల్




ఆసుపత్రి 1,030 పడకల స్థాయికి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా జనరల్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందనున్నాయి.

**మానవ వనరుల పరిస్థితి ఏంటి..?**

జనరల్ ఆసుపత్రి పడకల స్థాయి పెరుగుతున్నా మానవ వనరుల సంఖ్య 250 పడకలకు సరిపోయేంత మాత్రమే ఉంది. ప్రస్తుతం వైద్యవిధాన పరిషత్ పరిధిలో కింది స్థాయి సిబ్బంది 180 మంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. జనరల్ ఆసుపత్రిలో 550 పడకలకు 260 మంది వరకు ఉండాలి. కొత్తగా అందుబాటులోకి వచ్చే వార్డులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే మరో 260 మంది కిందిస్థాయి సిబ్బంది అవసరం ఉంటుంది. పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్ కేర్ విభాగాల్లో పూర్తి స్థాయి సిబ్బంది లేని కారణంగా ప్రస్తుతం సిబ్బందిపై పని భారం పెరుగుతోంది. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు.

**మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం**

డా.నగేశ్, డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ ఆసుపత్రి

జనరల్ ఆసుపత్రిలో పడకల స్థాయికి తగినట్లుగా పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది లేని మాట వాస్తవమే. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఇటీవల జనరల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. అధికారులతో సంప్రదింపులు జరిపి గుత్తేదారుల ద్వారా మానవ వనరుల స్థాయి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కట్టమైసమ్మా.. కనిపించేలా చేయమ్మా



హైదరాబాద్ : చాలాచోట్ల చెరువు కట్టలపై మైసమ్మ దేవాలయాలు కనిపిస్తుంటాయి. స్థానికులు కట్ట మైసమ్మగానే కొలుస్తుంటారు. కనుమరుగైన చెరువులను గుర్తించడానికి హైడ్రా అధికారులకు ఇప్పుడు ఈ అమ్మవారి ఆలయాలే ఆధారం కానున్నాయి. నగరంలో కనిపిస్తున్న చెరువులు ఎన్ని..? కనిపించనివి ఎన్ని..? ఈ రెండు ప్రశ్నలకు కచ్చితమైన సమాధానం కనుగొనేందుకు హైడ్రా నడుం బిగించింది. మూడు దశాబ్దాల నాటి ఉపగ్రహ చిత్రాలు, ఇతరత్రా శాస్త్రీయ ఆధారాలతో తటాకాల లెక్క తేల్చేందుకు సర్వే చేపట్టింది. అధ్యయనం ఇటీవలే మొదలైంది. ఆరంభంలోనే హైడ్రా అదరగొట్టే ఫలితం సాధించింది. మాదాపూర్‌లో నాలుగు మీటర్ల మేర మట్టితో కప్పేసిన ఏడెకరాల ఈదులకుంట వెలుగులోకి వచ్చింది. అదే మాదిరి రికార్డుల్లో లేని ఇతర నీటి వనరులనూ గుర్తిస్తామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ చెబుతున్నారు. శాస్త్రీయ పద్ధతులతో, పరిశోధనాత్మక సర్వేతో మట్టిలో పాతుకుపోయిన నీటి వనరులకు పునరుజ్జీవం కల్పిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**మొదటి విజయం నమోదు..**

జీహెచ్ఎంసీ వద్ద 185 చెరువుల జాబితా ఉంది. ఇందులో ఈదులకుంట వివరాలు లేవు. స్థానికుల ఫిర్యాదులతో సర్వే ఆఫ్ ఇండియా పటాలు, ఎన్ఆర్ఎస్ఏ ఉపగ్రహ చిత్రాలను తెప్పించుకుని మూడుసార్లు చెరువును స్వయంగా పరిశీలించారు. చివరకు 15 అడుగుల లోతున కుంట ఆనవాళ్లను గుర్తించారు. పూడ్చిన చెరువుకు తిరిగి ఎలా ప్రాణం పోయాలన్నదానిపై ముందుకెళ్తున్నామని అధికారులు చెబుతున్నారు.

**1025 చెరువులపై సర్వే..**

నీటిపారుదలశాఖ నోటిఫైడ్ చెరువుల జాబిత, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హెచ్ఎండీఏ రికార్డులతోపాటు.. ట్రాక్(తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్), ఎన్ఆర్ఎస్ఏ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ), సర్వే ఆఫ్ ఇండియా సంస్థలు రికార్డు చేసిన దశాబ్దాల నాటి ట్రోపోషీట్లు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఓఆర్ఆర్ లోపల 1025 ప్రాంతాల్లో నీటి జాడను గుర్తించారు. "తూము, అలుగు, చెరువు కట్ట, కట్ట మైసమ్మ దేవాలయం వంటి ఆధారాలను మొదట నమోదు చేసుకుంటున్నాం. తర్వాత.. అక్కడ ప్రస్తుతం నీరు నిలుస్తుందా, మట్టి కుప్పలతో నింపేశారా, ఆక్రమణ జరిగిందా, జనావాసాలున్నాయా, వ్యాపార కేంద్రాలను నిర్మించారా, వరద నాలా సంగతేంటి, ఇతరత్రా వివరాలను సేకరిస్తున్నాం. వాటిని ఉపగ్రహ చిత్రాలతో పోల్చి చూసి.. చెరువు ఆనవాళ్లను ప్రాథమికంగా నిర్ధారిస్తున్నాం."అని హైడ్రా చెబుతోంది.

**సీఎం చేతుల మీదుగా..**

ప్రస్తుతం చేపడుతోన్న సర్వేలో చెరువులను మాత్రమే గుర్తిస్తామని, అక్కడున్న నివాసాలు కూల్చమని, మిగిలి ఉన్న తటాకాలనైనా కాపాడుకోవాలనేది హైడ్రా ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఆక్రమణకు గురైన బతుకమ్మకుంటను ఇలాగే కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, స్థానికుల పోరాటం, రెవెన్యూ, హైడ్రా అధికారుల కృషితో న్యాయపోరాటం ద్వారా బతికించుకోగలిగామని అంటున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ చెరువు పునరుజ్జీవ కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తామని అధికారులు తెలిపారు.

# లీజు ఒకరిది.. అనుభవం మరొకరిది




హైదరాబాద్ : జీహెచ్ఎంసీ ఆస్తులను అక్రమంగా అనుభవిస్తున్న దుకాణాలపై అధికారులు దృష్టిసారించారు. మున్సిపల్ మార్కెట్లు, కాంప్లెక్స్‌లు, మోడల్ మార్కెట్లలో అక్రమ లీజుదారులను ఖాళీ చేయించడమే లక్ష్యంగా రంగంలోకి దిగారు. మొత్తం దుకాణాల్లో మూడొంతుల మేర లీజు పూర్తయినవి ఉండటంతో 50 శాఎతానికిపైగా దుకాణాలకు ఎస్టేట్స్ విభాగం ఇప్పటికే మూసివేత నోటీసులు జారీ చేసింది. బల్దియా చరిత్రలో ఈ స్థాయిలో నోటీసులివ్వడం ఇదే మొదటిసారి.

**రూ.కోట్ల ఆస్తులు..**

అబిడ్స్‌లోని మోజంజాహి మార్కెట్లో 20కిపైగా దుకాణాలున్నాయి. చార్మినార్ సమీపంలోని పత్తర్‌గట్టీ, మదీనా, గౌలిగూడ, కోఠి, కింగ్ కోఠి, దిల్‌సుఖ్‌నగర్, పటాన్‌చెరు, ఉప్పల్, హబ్సిగూడ, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కనే జీహెచ్ఎంసీకి చెందిన మున్సిపల్ మార్కెట్లు, కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మార్కెట్లలోని అద్దెలను ప్రాతిపదికగా తీసుకుంటే వాటి నుంచి బల్దియాకు ఏటా రూ.30 కోట్ల ఆదాయం రావాలి. ప్రస్తుతం వసూలవుతోంది కేవలం రూ.4 కోట్లు మాత్రమే. కొన్నిచోట్ల 30, 40 ఏళ్ల క్రితం నిర్ణయించిన అద్దెతోనే దుకాణాలు కొనసాగుతున్నాయి. వాటిలో అసలైన లీజుదారుల ఆధీనంలో ఉన్న ఆస్తులు నామమాత్రమే. గతానికి భిన్నంగా బల్దియా నుంచి మూసివేత నోటీసులు అందడం, ఖాళీ చేయాలని ఒత్తిడి పెరగడంతో ఉప్పల్, హబ్సిగూడ, ఇతర ప్రాంతాల్లోని దుకాణదారులు నిత్యం కేంద్ర కార్యాలయానికి వరుస కడుతున్నారు. వారితో ఎస్టేట్స్ విభాగం అదనపు కమిషనర్ అశోక్‌సామ్రాట్ సమావేశం నిర్వహిస్తున్నారు.

**డిజిటలీకరణ వైపు..**

మార్కెట్లు, కాంప్లెక్స్‌లతోపాటు మోడల్ మార్కెట్లు, కమ్యూనిటీ హాళ్లను జియోట్యాగ్ చేయాలని, ఆయా ఆస్తుల వివరాలను డిజిటలీకరించాలని ఇటీవల కమిషనర్ ఇలంబర్తి ఐటీ విభాగాన్ని ఆదేశించారు. పరాధీనంలోని భవనాల జాబితా రూపొందించాలన్నారు.

# ఖర్చు కొండంత.. రాబడి పిసరంత



హైదరాబాద్ : కోటి ఇరవై లక్షలమంది దాహార్తిని తీర్చే జలమండలి అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. మహానగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్న జలమండలి రాబడి, వ్యయం మధ్య పొంతన లేకపోవడంతో లోటు బడ్జెట్‌తో తల్లడిల్లుతోంది. ప్రతినెలా వచ్చే రాబడి ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకే సరిపోతుండగా.. ప్రతినెలా విద్యుత్ బిల్లులు బకాయి పడుతోంది. ఏ ప్రాజెక్టు చేపట్టాలన్నా ప్రభుత్వం వైపు చూడాల్సి వస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ఎండీ అశోక్‌రెడ్డి జలమండలి రాబడి వ్యయాలను వివరించగా.. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని.. వాటిని అధిగమించేందుకు తక్షణ కార్యాచరణను రూపొందించుకోవాలని ఆదేశించారు.

**ఆదాయంతో సమంగా విద్యుత్తు ఛార్జీలు**

జలమండలికి ప్రతి నెలా రూ.120 కోట్లు వరకూ ఆదాయం వస్తుండగా వ్యయం రూ.230 కోట్లు ఉంటోంది. ఇందులో విద్యుత్తు ఛార్జీలకే సుమారు రూ.110 కోట్లు, రూ.120 కోట్ల మేర ఉద్యోగుల వేతనాలు, నిర్వహణ వ్యయం అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, జలమండలి ఎండీ, ఇతర నిపుణులతో ఏర్పడే కమిటీ జలమండలి ఆర్థిక స్థితిగతులు, రాబడికి అవకాశాలపై అధ్యయనం చేయనుంది.

**ప్రభుత్వ శాఖలవే రూ.4,300 కోట్లు**

జలమండలికి వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ.4,300 కోట్ల బకాయిలు రావాలి. విద్యుత్తు శాఖకు చెల్లించాల్సిన బకాయిలు రూ.5,500 కోట్లకు చేరాయి. కృష్ణా, గోదావరి నుంచి నీటిని తరలించేందుకు చేపట్టిన ప్రాజెక్టులకు తీసుకున్న రుణం రూ.1,847 కోట్లు ఉంది. మొత్తంమీద జలమండలి రూ.8,800 కోట్ల లోటులో ఉంది. వివరించారు. 8 లక్షల కుటుంబాలకు సరఫరా చేస్తున్న ఉచిత నీటి నిమిత్తం ప్రభుత్వం ఏటా రూ.300కోట్లు జలమండలికి ఇస్తోంది.

**11 సంవత్సరాలుగా పెంచలేదు**

2013కు ముందు నీటి ఛార్జీలను నగరంలో పెంచారు. సుమారు 11 ఏళ్లుగా అవే ఉన్నాయి. వేతనాలు, నిర్వహణ వ్యయం భారీగా పెరిగిన అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి రెండో దశకు నిధుల సమీకరణపై దృష్టిసారించిన జలమండలి పకడ్బందీ ఆర్థిక ప్రణాళిక కు కసరత్తు చేస్తోంది.

# గుట్ట.. గుటకాయ స్వాహా..!

బషీరాబాద్: రోడ్డు నిర్మాణం చేసే ఓ గుత్తేదారు అటవీ భూమిలో చెట్లను తొలగించి మట్టిని తోడేశాడు. ఈ వ్యవహారం తెలిసినా కూడా సంబంధిత శాఖ అధికారులు సైతం ఏమీ చేయలేకపోయారని ఆరోపణలు వస్తున్నాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. పెద్ద యంత్రాలు, టిప్పర్లు ఏర్పాటు చేసి అటవీ భూమిలో దర్జాగా దారి నిర్మాణం చేసుకొని గుట్టను కరిగించారు. వందల ట్రిప్పుల మట్టిని దర్జాగా తరలించారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**దారి చదును కారణంగా చూపి..**

బషీరాబాద్ మండలం గొట్టిగకలాన్ నుంచి పాటుమీదిపల్లి మీదుగా రుద్రారం వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. దారి చదునుకు పెద్దమొత్తంలో మట్టి అవసరం అవుతుంది. బషీరాబాద్ రేంజ్ పరిధిలోని గొట్టిగకలాన్ ఊరి శివారులో అటవీ ప్రాంతం ఉంది. రోడ్డు పేరుతో గుత్తేదారు గుట్టపై దట్టంగా పెరిగిన చెట్లను తొలగించి మట్టిని తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇటీవల అటవీశాఖ అధికారి ఒకరు అక్కడికి వెళ్లి పరిశీలించి వచ్చారనీ, ఒక టిప్పర్‌ను సైతం పట్టుకున్నారని తెలిపారు. ఈ విషయాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఇదే సమయంలో మట్టి తరలింపుపై అన్ని విధాల పరిశీలన చేశామని, వారిపై చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

**నాయకులు, అధికారుల అండ చూసుకునేనా..**

అటవీభూమిలో మట్టి తరలింపుపై గుత్తేదారుకు రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల అండ ఉందని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిశీలన చేసి వెళ్లిపోయారని, మట్టి తరలింపును అడ్డుకోవడం లేదన్నారు. జిల్లా పాలనాధికారి స్పందించి అటవీ భూమిలో మట్టి తరలిస్తున్న గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పత్రాలతోనే సరి..!

నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరింది. మిల్లర్ల నుంచి 10 శాతం బ్యాంకు గ్యారెంటీ ఉంటేనే ధాన్యం మరాడించేందుకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఇప్పటి వరకు ఒక్క మిల్లు నుంచి బ్యాంకు గ్యారెంటీ పత్రం లేకుండానే సీఎంఆర్ ప్రక్రియ అప్పగించారు. మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేయడంతో ప్రభుత్వ కేంద్రాల్లోకి ధాన్యం తగినంత రాలేదు. ధాన్యం కొనుగోళ్లలో ఎప్పుడూ తొలిస్థానంలో ఉండే నల్గొండ జిల్లా ఈసారి ఐదో స్థానానికి పరిమితమైంది. మిర్యాలగూడ, సాగర్, హుజూర్‌నగర్, కోదాడ, నల్గొండ, భువనగిరి ప్రాంతాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. నెలన్నర రోజుల వరకు సేకరణ ప్రక్రియ



ప్రారంభించలేదు. దీంతో వ్యాపారులు రైతుల వద్ద నుంచి పెద్దఎత్తున కొనుగోలు చేశారు.

గతేడాది వానాకాలానికి సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 174 మిల్లులకు 6.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇటీవల అప్పగించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంఆర్ అప్పగించే ముందే బ్యాంకు గ్యారెంటీ పత్రాలు తీసుకోవాల్సి ఉండగా.. రాజకీయ, ఇతరత్రా కారణాలతో కేవలం ఒప్పంద బాండు పేపర్లు తీసుకుని మరాడించేందుకు అంగీకరించారు. చాలా సంవత్సరాల నుంచి మిల్లర్లు సీఎంఆర్ ప్రక్రియను సజావుగా అప్పగించకపోవడానికి కారణం ఎలాంటి బ్యాంకు గ్యారెంటీలు అప్పగించకపోవడమే. ప్రభుత్వం గతంలో జరిగిన అక్రమాలు నిరోధించేందుకు బ్యాంకు పూచీకత్తు పత్రాలు అప్పగించాలని షరతులు విధిస్తే సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారిని 'ఈనాడు' వివరణ కోరగా.. సీఎంఆర్ ప్రక్రియకు ముందే బ్యాంకు గ్యారెంటీలు తీసుకోవాల్సి ఉన్నప్పటికి మిల్లర్లు బాండ్ పేపర్లు మాత్రమే ఇచ్చారు. బ్యాంకు గ్యారెంటీలు తర్వాత ఇస్తామని చెప్పారు. త్వరలో అన్నీ మిల్లుల నుంచి వీటిని సేకరిస్తామని చెప్పారు.

# పిల్లలూ.. నేను వచ్చేశా..!

నాంపల్లి : హలో పిల్లలూ.. బాగున్నారా..! నేను మీ గాలిపటాన్ని.. సంక్రాంతి సెలవులు వస్తున్నాయి కదా.. ఇక మీరు నాతో ఆడుకోవడానికి ఎదురు చూస్తున్నారని నాకు తెలుసు. అయితే ఆడుకునే ముందు నా గురించి కొన్ని విషయాలు చెబుతాను వింటారా..

**నా పుట్టుక గురించి..** ఐదు వేల ఏళ్ల క్రితం రుగ్వేదలో ఉత్తరాయణ కాలంలో దేవున్ని గాఢ నిద్రలోంచి మేల్కొల్పేందుకు నన్ను ఎగురవేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. నేను మన ఆసియా ఖండంలోని చైనాలో పుట్టానని మరికొందరు చెబుతుంటారు. ఏడో శతాబ్దంలో చైనాకు చెందిన హుయిన్ షాంగ్ బుద్దిస్ట్ మిషనరీల ద్వారా మన భారతదేశంలో అడుగిడినట్లు పేర్కొంటున్నారు. ఆ తర్వాత నన్ను ఓ సంప్రదాయ పండగలా చూస్తున్నారు. అందుకే ఉత్తరాయణ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా నా పేరిట పండగలు, పోటీలు నిర్వహిస్తారు. ఇది ఒక సాంస్కృతిక కృత్యంగా జరుపుతారు.

**గుజరాత్ వేదికగా కైట్ ఫెస్టివల్..**

మన దేశంలోని అన్ని పట్టణాలు, పల్లెల్లో నాతో గడపడానికి ఆసక్తి చూపుతుంటారు. దేశంలో 1989లో గుజరాత్‌లోనే మొట్టమొదటి అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ జరిగింది. ఆ రోజు ప్రపంచ దేశాల నుంచి వచ్చిన వారు విభిన్నమైన పెద్ద పెద్ద గాలిపటాలతో పోటీ పడుతుంటారు. ఏటా జనవరి 14న ఈ ఒక్క రాష్ట్రంలోనే 2 వేల వేదికల పైనుంచి ఎగురవేస్తారు. ఆ తర్వాత రాజస్థాన్‌లోని జైపూర్‌లో పెద్ద ఎత్తున పండగ నిర్వహిస్తారు. ఇలా దేశంలోని అన్ని పట్టణాలకూ నేను విస్తరించా. పిల్లలూ మీరంతా చదువుల్లో ఉన్నతంగా రాణిస్తూనే.. తల్లిదండ్రులను.. తోటి వారిని గౌరవిస్తూ ఈ సెలవుల్లో నాతో సరదాలు పంచుకుంటారని భావిస్తున్నా.



**చైనా మాంజాను వాడకండి..**

చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం మన రాష్ట్రంలో 2016లో ఆ పతంగులను నిషేధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం వీటిని విక్రయించిన వారికి అయిదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు. చైనా మాంజా పతంగులతో పక్షులు చనిపోతే మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష. లేదంటే రూ.10 వేల జరిమానా విధిస్తారు.

కొందరు గాజు కోటింగ్‌తో కూడిన నైలాన్, సింథటిక్ దారాన్ని వాడుతుంటారు. ఇదీ ప్రమాదకరమే. ఈ దారానికి పక్షులు చిక్కుకొని చనిపోతున్నాయి. వ్యక్తులు గాయపడుతున్నారు. చైనా మాంజాకు బదులు సంప్రదాయ దారం వాడాలని పర్యావరణవేత్తలు, అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. పిల్లలూ.. నిర్మానుష్య ప్రదేశాలు.. ఆట స్థలాలు తదితర అనువైన ప్రదేశాల్లో ఎగురవేయండి. ఆనందాన్ని పొందండి.. ఆపద కొని తెచ్చుకోకండి.

**తస్మాత్ జాగ్రత్త..**రద్దీ ప్రాంతాల్లో జన సంచారం ఉన్న చోట ఎగురవేయొద్దు. దారం రోడ్డుకు అడ్డంగా పడితే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. పతంగి తెగి పడితే పైకి చూస్తూ వెంట పరుగెత్తకూడదు.కొందరు పిల్లలు, యువకులు మేడ పైభాగంలో నాతో ఆడుతుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కింద పడతారు. ఒక వేళ తప్పదు అనుకుంటే పెద్దల పర్యవేక్షణ ఉండేలా చూసుకోండి. కరెంటు తీగలు, చెట్లు లేని ప్రదేశాలు చూసుకోవాలి. చెట్లకు, తీగలకు గాని చిక్కితే తీసే సాహసం చేయొద్దు. ప్రమాదం జరిగే అవకాశముంది.

# మత్తు.. యువత జోగుతూ..

హైదరాబాద్: మిత్రులతో కలసినా.. మానసిక ఒత్తిడిలో ఉన్నా.. చుక్కేస్తున్నారు.. కొన్నాళ్లకు అంతకుమించిన కిక్ కోసం మత్తుపదార్థాలు తీసుకుంటున్నారు. వీధి బాలలు వైట్నర్ తీసుకుంటుంటే.. కాస్త వైద్య పరిజ్ఞానం ఉన్న యువకులు నిషేధిత దగ్గుమందు, నొప్పిమాత్రలు వేసుకుంటున్నారు. ఆసిఫ్‌నగర్ సమీపంలోని ఒక బస్తీలో 50కు పైగా కుటుంబాలు కర్ణాటక, రాజస్థాన్ నుంచి నిద్రమాత్రలు తీసుకొచ్చి రహస్యంగా విక్రయిస్తున్నారు.

**దొరికితేనే దొంగలు**

టీజీ న్యాబ్ సిబ్బంది ఈ ఏడాది అక్టోబరు వరకూ 6700 మత్తు మాత్రలు, 4500 నిషేధిత ఇంజెక్షన్లు, 100 దగ్గు సిరప్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మందులను గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వస్తున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.



కొరియర్, ప్రైవేటు వాహనాల్లో నిత్యావసర సరుకుల మాటున వీటిని నగరానికి తరలిస్తున్నారు.

**లాభాల కక్కుర్తితో..**

నగరంలో పలు మందులు దుకాణాలు కమీషన్ కక్కుర్తితో నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. వైద్యుల సిఫార్సు లేకుండానే శస్త్రచికిత్స, తీవ్ర అనారోగ్య సమస్యలకు ఉపయోగించే ఇంజెక్షన్లు, నొప్పుల, నిద్ర మాత్రలను విక్రయిస్తున్నాయి. గతేడాది హెచ్‌న్యూ పోలీసుల తనిఖీలో సుమారు 10 మందుల దుకాణాలు ఇటువంటి నిషేధిత మాత్రలు విక్రయిస్తున్నట్టు గుర్తించాయి. బిహార్ కేంద్రంగా చిరువ్యాపారి రాజ్‌కుమార్‌గుప్త మత్తు ఇంజెక్షన్లకు ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ఏకంగా యూనిట్ రూపొందించాడు. ఇ-కామర్స్ వెబ్‌సైట్ ద్వారా రూ.26 ధర పలికే ఇంజెక్షన్‌ను రూ.150 చొప్పున దేశవ్యాప్తంగా 88 లక్షల ఇంజెక్షన్లు విక్రయించాడు. బంజారాహిల్స్‌లోని ఒక ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగి నొప్పులకు ఉపయోగించే మాత్రలను బయటకు తీసుకొచ్చి యువతకు విక్రయిస్తున్నాడు.

# కళా విహీనంగా కూడళ్లు!

కరీంనగర్ : ఇందిరాగాంధీ, తెలంగాణ చౌక్ కూడలిని అన్ని హంగులతో తీర్చిదిద్ది గతేడాది జూన్ 25న అందుబాటులోకి తీసుకొచ్చారు. డిజిటల్ లైటింగ్‌తోపాటు నీళ్ల ఫౌంటెయిన్ ఆకర్షణీయంగా కనిపించాల్సి ఉండగా ప్రస్తుతం అంధవికారంగా తయారైంది. నాలుగేళ్ల కిందట బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన జంక్షన్‌లో లైటింగ్, వాటర్ ఫౌంటెయిన్ పని చేయడం లేదు. చౌరస్తా మధ్యలో ఉన్న హైమాస్ట్ లైట్లు కూడా పది రోజులుగా వెలగడంలేదు. వాహనాలు తగలడంతో ఒక వైపు కూలినా మరమ్మతులు చేయడంలేదు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్ నగర పరిధిలో కూడళ్లను అభివృద్ధి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారికి, నగరవాసులకు రాత్రిపూట ఆహ్లాదకరంగా, అందంగా ఉండేలా ప్రధాన కూడళ్లను తీర్చిదిద్దారు. దీనికోసం స్మార్ట్‌సిటీలో రూ.4.50 కోట్లు వెచ్చించారు. తీగల వంతెన సదాశివపల్లి వైపు, రామగుండం బైపాసు రోడ్డు మధ్యలో, మారుతీనగర్ చౌరస్తా, ఇందిరాచౌక్, నాకాచౌరస్తా, పాత ఎంప్లాయిమెంట్ కూడలి, ఆచార్య జయశంకర్, పొట్టి శ్రీములు విగ్రహం కూడలి ఉండగా, నాలుగేళ్ల కిందట కమాన్ చౌరస్తా, బస్టాండ్ ఇన్ గేట్ శ్రీపాద జంక్షన్, ఆర్అండ్‌బీ, అంబేడ్కర్ విగ్రహం, మంచిర్యాల చౌరస్తాలలో అన్ని హంగులు కల్పించారు. ప్రధానంగా లైటింగ్‌తోపాటు అన్ని చోట్ల వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు.

**నిర్లక్ష్యంగా వదిలేశారు**

నగరంలోని ప్రధాన కూడళ్లను ఆకర్షించేలా ఒక్కో కూడలికి రూ.20 లక్షల నుంచి రూ.1.30 కోట్ల వరకు ఖర్చు చేశారు. లైటింగ్, పౌంటెయిన్, మొక్కల నిర్వహణ, మరమ్మతులు వంటివి ఎప్పటికప్పుడు



తనిఖీలు చేస్తూ మరమ్మతులు చేయాల్సి ఉండగా పట్టించుకునే వారే కరవయ్యారు. కొన్ని చోట్ల వాహనాలు తగిలి కొంతమేర ఊడిపోయాయి. ఇంజినీరింగ్ అధికారులు సైతం ఆ కూడళ్లు నగరంలో లేనట్లుగానే అంటి ముట్టనట్లుగా ఉంటున్నారు.

**దృష్టి సారించని ఉన్నతాధికారులు..**

కూడళ్లను సుందరీకరించి అప్పగించిన కూడళ్లను.. వాటి నిర్వహణ గడువు ముగిసే వరకు సంబంధిత గుత్తేదారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. స్మార్ట్‌సిటీలో భాగంగా గతేడాది జూన్‌లో వీటిని ప్రారంభించారు. వీటికి కనీసం రెండేళ్లు నిర్వహణను చూడాల్సి ఉండగా స్మార్ట్‌సిటీ ఏజెన్సీ నిర్వాహకులు కూడా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కూడళ్ల నిర్వహణ, మరమ్మతులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

**చర్యలకు ఆదేశించాం**– వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

కూడళ్ల నిర్వహణను రెండేళ్లపాటు గుత్తేదారు చేపట్టాలి. యథావిధిగా పని చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాల్సిందే. పనులు చేయకపోతే బిల్లులో రికవరీ చేయించాలి. నిర్లక్ష్యం వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించాం.

# సరైన ప్రణాళికే.. ప్రగతికి వేదిక



పరిగి: దినదినాభివృద్ధి చెందుతున్న పరిగి పురపాలక సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే గత ప్రభుత్వం పంచాయతీ హోదా నుంచి మున్సిపల్ హోదాకు మార్చింది. వీటికి ప్రత్యేక నిధులను సమకూరుస్తోంది. అయితే గతంలో సరైన ప్రణాళిక లేని కారణంగా అభివృద్ధి అనుకున్న విధంగా సాగలేదు. తాజాగా ప్రభుత్వం వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలకు ఉపక్రమించింది. మెరుగైన వసతుల ద్వారా అదనపు ఆదాయ వనరులను సమకూర్చేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల పరిగి మున్సిపాలిటీకి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద రూ.25కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులను ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.

**భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని..**

గతంలో వివిధ పథకాల కింద లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు దెబ్బతిన్నాయి. ప్రణాళిక లేకుండా రోడ్డు పనులు పూర్తిచేశారు. వాటి కిందఉన్న మంచినీటి పైపులైన్ల లీకేజీలతో రోడ్లు దెబ్బతిన్నాయి. మరో చోట మీటర్ల కొద్దీ ఉన్న పైప్‌లైన్లను వదిలిపెట్టి కొత్త పనులు చేపట్టాల్సి వచ్చింది. ఇప్పుడు అలా జరగకుండా భవిష్యత్తు అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

నీటి ఎద్దడి శాశ్వత పరిష్కారంలో భాగంగా అమృత్ -2 పథకం కింద రూ.14.5కోట్లు వెచ్చిస్తుండగా టీయూఎఫ్ఐడీసీ కింద ప్రధానంగా అంతర్గత రహదారులను సీసీతో మెరుగు పరచాలి. మురుగు కాల్వలను నిర్మించి పారిశుధ్య వ్యవస్థను తీర్చిదిద్దాల్సి ఉంది. అనేక కొత్త కాలనీలలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించాల్సి ఉంది.

కొత్తగా చేపట్టే పనులివే..

మున్సిపల్ ఆఫీస్ నుంచి మల్కాపూర్ రోడ్డులో 800 మీటర్ల దూరం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం.

మల్లెమోనిగూడ రోడ్డు మరమ్మతు పనులు.

ఎర్రగడ్డపల్లి తారు రోడ్డు అభివృద్ధి.

కూడళ్ల సుందరీకరణ ద్వారాల ఏర్పాటు.

మున్సిపాలిటీకి రూ.5కోట్లతో పక్కా భవనం ఏర్పాటు.

# వరద నిలుపు.. పొలం తడుపు



తాండూరు: జిల్లాలో కాగ్నా, కాకర వేణి నదులపై 5 ఆనకట్టల నిర్మాణ పనులు రెండు నెలల్లో ప్రారంభం కాబోతున్నాయి. ఇప్పటికే రెండు చోట్ల గడచిన వేసవిలో పనులకు శ్రీకారం చుట్టగా భారీ వర్షాల నేపథ్యంలో ఆగిపోయాయి. ప్రస్తుతం నదుల్లో ప్రవాహం తగ్గడంతో నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఐదు చోట్ల ఆనకట్టలు పూర్తయితే బహుళ ప్రయోజనాలు ఒనగూరనున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

2022-23 ఆర్థిక సంవత్సరంలో నిధుల మంజూరు: గత ప్రభుత్వం 2022-23లోనే రెండు నదులపై ఆనకట్టల నిర్మాణానికి రూ.43 కోట్ల నిధులు మంజూరు చేసింది. అంతకు ముందే నదులకు అడ్డంగా ఆనకట్టల నిర్మాణం ఎక్కడెక్కడ చేపట్టాలనే విషయంలో భూగర్భ వనరులు, నీటి పారుదల శాఖ ఇంజినీర్లు సర్వే చేశారు. ఆమేరకు ఆనకట్టల నిర్మాణం చేపడితే నీరు ఎంత పొడవున నిలుస్తుంది. పరివాహక బోర్లలో జల మట్టం పెరిగితే ఎన్ని ఎకరాల ఆయకట్టు అదనంగా అందుబాటులోకి వస్తుందనే వివరాలను నివేదికలో పొందు పరిచి ప్రభుత్వానికి పంపించారు. ఒక్కో ఆనకట్ట నిర్మాణానికి ఎన్ని నిధులు వ్యయమౌతాయనే విషయంలో నీటి పారుదల శాఖ అంచనాలను రూపొందించింది. ఆమేరకు నిధులు మంజూరయ్యాయి. వెంటనే టెండర్లు కూడా పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది వేసవిలో మొత్తం ఐదు ఆనకట్టలకు గాను రెండు చోట్ల పనులు ప్రారంభించింది. జులై నుంచి భారీ వర్షాలు కురిశాయి. నదులు ఉధృతంగా ప్రవహించడంతో పనులు ఆగిపోయాయి. తాజాగా నదుల్లో వరద అంతగా లేనందున పనులు చేపట్టేందుకు ప్రతికూలత పెద్దగా ఉండదని అధికారులు చెబుతున్నారు.

**ఆనకట్టలు నిర్మించే గ్రామాలు**

పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి

తాండూరు మండలం చంద్రవంచ, ఖాంజాపూరు

యాలాల మండలం: దేవనూరు, బెన్నూరు (గడచిన వేసవిలో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి).

చేకూరే బహుళ ప్రయోజనాలు

ఒక్కో ఆనకట్ట వద్ద ఆరు అడుగుల ఎత్తుతో కిలోమీటరు పొడవునా వరద నిలుస్తుంది. పరివాహక వ్యవసాయ బోర్లు, తాగు నీటి వనరుల్లో 10నుంచి 20 అడుగుల ఎత్తుకు నీటి మట్టం పెరుగుంది.

ప్రతి ఆనకట్ట పరిధిలో 300 ఎకరాల చొప్పున ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. మత్స్య కారులు చేపలు పెంచి ఏడాది పొడవునా ఉపాధి పొందుతారు వన్య ప్రాణులు, పక్షులకు తాగు నీటికి ఎద్దడి ఉండదు.వేసవి చివరి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం

ఈ ఏడాది వేసవి చివరి వరకు ఆనకట్టలను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాం. అనుకున్నట్లు నిర్మాణాలు పూర్తయితే వచ్చే వర్షాకాలంలోనే ఆనకట్టలు నీటితో నిండుతాయి. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. కాగ్నా, కాకర వేణి నదుల నుంచి వృథాగా పోయే వరదకు అడ్డుకట్ట పడుతుంది. – సుందర్, ఈఈ, జిల్లా నీటి పారుదల శాఖ.

# విద్యార్థులకు ఆర్థిక ఉపశమనం



వికారాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థుల డైట్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలను పెంచటంతో జిల్లాలోని సుమారుగా 20,000 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు అతి తక్కువగా డైట్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించటంతో వీటితోనే నెట్టుకు రావాల్సి వచ్చింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి రెండు, మూడు సంవత్సరాలకోసారి డైట్ ఛార్జీలు పెంచాల్సింది పోయి ఏళ్ల తరబడి పెంచక పోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. తాజా పెంపుతో విద్యార్థులకు కొంతమేరకైనా నాణ్యమైన భోజనాన్ని పెట్టడానికి అవకాశం ఉందని పలువురు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అందిస్తున్న కథనం..

**2017 తరువాత మళ్లీ ఇప్పుడే..**

డైట్ ఛార్జీలు గత 2017లో పెంచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పెంచకపోవటంతో విద్యార్థి సంఘాలు తరచుగా ఆందోళనలు జరిపారు. ఇక విద్యార్థినులకు చెల్లించాల్సిన కాస్మొటిక్ ఛార్జీలు 2008 తరవాత పెంచలేదు. 16 సంవత్సరాల క్రితం పెంచిన ఛార్జీలే నేటికీ చెల్లిస్తున్నారు. వీటిని కూడా సక్రమంగా విడుదల చేయకపోవటంతో విద్యార్థినులు ఇబ్బందులకు లోనయ్యారు. డైట్ ఛార్జీలు 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1330లకు, 8వ తరగతి నుంచి 10 విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540కు ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థులకు రూ.1500 నుంచి రూ.2100కు పెంచారు.

**బీసీ విద్యార్థులకు పాకెట్ మనీకి డిమాండ్**

ఇంటర్ ఆపైన చదివే బీసీ విద్యార్థులకు పాకెట్ మనీ కింద నెలకు రూ.500 చెల్లించాలని ఎప్పటి నుంచో విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీన్ని కొన్నేళ్లుగా ఎస్సీ ఇంటర్ విద్యార్థులకు చెల్లిస్తున్నారు. తమకివ్వక పోవడం శోచనీయమని బీసీ విద్యార్థులు అంటున్నారు.

**ఈనెల నుంచే అమలు**

పెంచిన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు ఈనెల నుంచి అమలులోకి వస్తాయి. ఛార్జీలు పెంచటం వల్ల విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుంది. – ఉపేందర్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి.

# రిజర్వాయర్లకు రక్షణేదీ?

హైదరాబాద్: లక్షలాది మంది ప్రజల ఆరోగ్యంతో ప్రతిపాదనలకే సీసీ కెమెరాలు, ప్రత్యేక నిఘాడిపడి ఉన్న కీలక అంశంపై జలమండలి ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. జలమండలి రిజర్వాయర్ల వద్ద అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడంతోపాటు కనీస భద్రతా చర్యలను విస్మరిస్తోంది. సుమారు 400కు పైగా సర్వీసు రిజర్వాయర్లుండగా వీటిలో కీలకమైనవి 225. రెండున్నర ఏళ్ల క్రితం ముషీరాబాద్ ప్రాంతంలో రిసాల్‌గడ్డ వాటర్ ట్యాంక్‌లో కుళ్లిపోయిన మృతదేహం బయటపడింది. అప్పటికే ఆ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా కాగా లక్షలమంది ఆ నీటినే తాగారు.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..**

జలమండలి రిజర్వాయర్ ప్రదేశం నిషేధిత ప్రాంతమైనా ఎవరైనా



వెళ్లి రావడానికి ఎలాంటి అభ్యంతరాలుండవు. కనీసం అడిగేవారు కూడా ఉండరు. కీలకమైన ప్రదేశాల్లో, విశాలంగా చెట్లతో ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు సాధారణంగా మారాయి. భారీ రిజర్వాయర్‌లపైకి మెట్ల సాయంతో చేరుకున్నా పట్టించుకునే వారు ఉండరు. ఎవరుపడితే వారు సెల్ఫీలు తీసుకునేందుకు పైకి ఎక్కుతున్నారు. ఆకతాయిలకు ఆటవిడుపు కేంద్రాలుగా పలు రిజర్వాయర్ పరిసరాలు మారాయి.

**నియంత్రించలేమంటున్న జలమండలి సిబ్బంది**

వాటర్ ట్యాంకర్లకు నీటిని నింపడం, నీటి సరఫరా వంటి అంశాల్లో తలమునకలై ఉండే తాము ఎవరొస్తున్నారని గుర్తించడం, నియంత్రించడం సాధ్యం కాదని పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా సెక్యూరిటీని నియమించాలని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ప్రయోజనం ఉండటం లేదని రిజర్వాయర్ వద్ద విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

# స్థానిక సమరానికి సామగ్రి సిద్ధం

పెద్దపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. తుది ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికారులు మిగిలిన పనుల్లో వేగం పెంచారు. జిల్లాల వారీగా బ్యాలెట్ డబ్బాలకు మరమ్మతు పనులు చేపట్టారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాలకు చేరుతోంది. షెడ్యూలు ఎప్పుడు విడుదలైనా ఎన్నికల నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల సిబ్బంది శిక్షణకు సంబంధించిన మాడ్యూల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల కరదీపికలు జిల్లాలకు చేరాయి. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల సామగ్రి విడతల వారీగా వస్తోంది.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. తాగునీరు, ప్రహరీ, విద్యుత్తు సరఫరా, ఫ్యాన్లు, ర్యాంపులు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా? ఏమైనా సమస్యలున్నాయా? అనే కోణంలో మండల స్థాయిలో అధికారులు పరిశీలించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఎక్కడైనా అదనంగా పోలింగ్ కేంద్రాలు అవసరమా? అనే విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కుల గణనకు సంబంధించి ఇంటింటి కుటుంబ సర్వేకు దాదాపు రెండు నెలల సమయం పట్టనుండగా ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే కొంతవరకు ఇబ్బందికరంగా ఉండనుంది. కుల గణన పూర్తయిన వెంటనే రిజర్వేషన్లపై స్పష్టత రానుంది. మొత్తంగా 2025లోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

**నిఘా నీడలో..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,210 పంచాయతీల పరిధిలో 11,132 వార్డులున్నాయి. 58 జట్పీటీసీ, 653 ఎంపీటీసీ స్థానాలున్నాయి. కొద్ది రోజులుగా ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాలకు చేరుతోంది. వీటిని స్థానిక గోదాముల్లో భద్రపరుస్తున్నారు. ఇతరులు ఎవరూ వాటి లోపలికి వెళ్లకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఒక్కో వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె వినియోగించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు విడతల వారీగా నిర్వహించనుండటంతో ఒక చోట వినియోగించిన బ్యాలెట్ పెట్టెలను మరో చోట వాడుకునే వీలుంటుంది.

# ధాన్యం తడిసి.. మొలకెత్తుతోంది..!

కామారెడ్డి : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి 20 రోజులు దాటుతున్నా.. ఇంకా కాంటా వేయలేదు. వర్షాలు కర్షకులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ధాన్యాన్ని రక్షించుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. కొందరు రైతులు నేరుగా రైస్‌మిల్లర్లకు క్వింటాలుకు రూ.1900 చొప్పున విక్రయించుకుంటన్నారు.

**రైతులకు నష్టం..**

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తున్న రైతులకు సంచుల అద్దె భారం పెరిగిపోతోంది. సమయానికి టార్పాలిన్ కవర్లను సరఫరా చేయకపోవడంతో చాలా మంది రైతులు ఆయా గ్రామాల్లో ధాన్యం రక్షణకు సంచులను అద్దెకు తీసుకుంటున్నారు. ఒక్కో రైతు 5-10 సంచులు అద్దెకు తీసుకోవడంతో నిత్యం రూ.150 వరకు అద్దె భరిస్తున్నారు. ధాన్యాన్ని నిత్యం కుప్ప చేయడం, ఉదయం మళ్లీ కూలీల సహాయంతో ఆరబెట్టడానికి ప్రతీ రోజు రూ.500 వరకు ఖర్చులు భరిస్తున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్కరు చొప్పున 24 గంటల పాటు ధాన్యం కుప్పలకు కాపలాగా ఉంటున్నామని పేర్కొంటున్నారు. ధాన్యం త్వరగా కాంటా చేయిస్తే యాసంగి పంటల సాగుపై దృష్టి పెట్టేవారమని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే రైతులపై భారం మరింత పడే అవకాశం ఉంది. ఈ విషయమై పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా నుంచి కొనుగోళ్లు వేగవంతం చేస్తామన్నారు.

'చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు భాస్కర్. కామారెడ్డి మండలం పాత రాజంపేట నివాసి. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని 12 రోజుల క్రితం తీసుకువచ్చాడు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి, కుప్పగా పోసిన తర్వాత రాత్రిపూట రక్షణ కోసం సంచులను(టార్పాలిన్లకు బదులుగా) అద్దెకు తీసుకువచ్చాడు. ఒక్కో సంచికి నిత్యం రూ.20 చొప్పున 8 సంచులు తెచ్చుకున్నాడు. నిత్యం రూ.160 చెల్లిస్తున్నాడు. ఇప్పటి వరకు రూ.1920 కేవలం సంచులకు అద్దె చెల్లించాడు. కానీ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ధాన్యం కాంటానే ప్రారంభించలేదు'

# రేవులో విధ్వంసం..!

కొత్తూరు : అధికారం చేతిలో ఉంది. ప్రతిపక్ష నాయకులను సైతం మన ఆధీనంలోకి తెచ్చుకున్నాం. ఇక మనల్ని ఎవరు అడ్డేది అన్న ధోరణిలో ఇసుక తవ్వకాలను దక్కించుకున్న గుత్తేదారులు బరితెగిస్తున్నారు. అధికారుల అండదండలతో యథేచ్ఛగా నిబంధనలు విస్మరించి, ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. ఇసుక ర్యాంపుల్లో కాసులు దండుకుంటున్నారు. వంశధార నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఇసుక రేవుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ సాగిస్తున్న తవ్వకాలు, తరలింపు కొందరికి వరంగా మారింది. గుట్టల కొలదీ ఇసుక తరలిపోతున్నా అధికార యంత్రాంగం చూస్తుందే తప్ప, పట్టించుకునే పరిస్థితి లేదని కూటమి నేతలే విమర్శిస్తున్నారంటే ఇక్కడ సాగుతున్న దందాను అర్థం చేసుకోవచ్చు.

**రాత్రి, పగలు తేడా లేకుండా..**

కొత్తూరు మండలంలోని ఆకులతంపర, నివగాం గ్రామాల్లో అనుమతితో నడుస్తున్న ఇసుక ర్యాంపుల నుంచి నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీల్లో తోడేస్తూ తరలిస్తున్నారు. ఆకులతంపరలో ఒక అడుగు ముందుకేసి నదీ గర్భంలోకి ఏకంగా అనధికారికంగా రహదారి వేసేశారు. ఇసుక తవ్వకాలు జరిపే సమయంలో పాటించాల్సిన నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక ర్యాంపుల్లో మీటరు లోతులో కేవలం మనుషులతోనే తవ్వకాలు చేపట్టాలి. కానీ యంత్రాలతో తోడేస్తున్నారు. ఐదారు మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపడుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను స్టాక్ పాయింట్‌కు చేర్చి, అక్కడి నుంచి లారీలకు లోడు చేయాల్సి ఉన్నా.. అలా జరగడం లేదు. విశాఖపట్నం, విజయనగరం, సరిహద్దు



రాష్ట్రం ఒడిశాకు నిత్యం వందల లారీల్లో రవాణా చేస్తున్నారు. నదీ గర్భంలో పొక్లెయినర్‌తో ఎత్తేందుకు రూ.8–10 వేల వరకు తీసుకుంటున్నారు. అయినా గనుల శాఖ కళ్లు మూసుకుంది.. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

**ప్రవాహంలో మార్పు..**

నిబంధనలు అతిక్రమించి మీటరు దాటి తవ్వేస్తే నది సమతుల్యత దెబ్బతిని, ప్రవాహంలో మార్పు వచ్చే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నివగాంలో వంశధార నదీ సమీపంలో తవ్వకాలు చేపడుతుండటంతో వంతెన బలహీనమై కూలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమాల బాగోతంపై తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకులతంపర ఇసుక ర్యాంపును గురువారం సందర్శించారు. ర్యాంపు వద్ద నుంచే ఉన్నతాధికారులతో మాట్లాడారు. యంత్రాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. 'ఆకులతంపర, నివగాం రేవుల్లో అక్రమ తవ్వకాలపై విచారణ చేస్తాం. నిబంధనల మేరకు తవ్వాలి. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం' అని కొత్తూరు తహసీల్దారు రవిచంద్ర తెలిపారు.

# హరిత వికాసానికి అడుగులు

ఒంగోలు: భూ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలనేది కేంద్ర అటవీ శాఖ మార్గదర్శకాలు. జిల్లాలో అటవీ విస్తీర్ణం 22.77 శాతమే(2023 గణాంకాల ప్రకారం) ఉంది. 2021తో పోల్చితే 6.97 చదరపు కిలో మీటర్లు తగ్గినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు హరితాంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టింది. పచ్చదనం పెంపుపై దృష్టిసారించింది.

నాడు అయిదేళ్లకు రూ. 65 లక్షలు: వైకాపా ప్రభుత్వం తన అయిదేళ్ల పాలనలో రూ.65 లక్షలు ఖర్చు చేసి 15 లక్షల మొక్కలు నాటినట్లు చూపింది. వాటితోపాటు 2019కి ముందు తెదేపా హయాంలో నాటిన వాటినీ సంరక్షించక.. పరోక్షంగా పచ్చదనం ఎండిపోవడానికి కారణమైంది. నేడు ఏడాదికే రూ. 3.98 కోట్లు: జిల్లాలో పచ్చదనం విస్తీర్ణం భూ విస్తీర్ణంలో సగభాగం(యాభై శాతం) ఉండాలన్నది హరితాంధ్రప్రదేశ్ లక్ష్యం. అందుకు అనుగుణంగా జిల్లాలో ఖాళీ స్థలాలు, రహదారుల వెంట, ఇళ్లల్లో సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో 30 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఆ మేరకు ఉపాధి నిధులు రూ.3.98 కోట్లను విడుదల చేశారు. వీటితో సుమారు 30 రకాలకు పైగా మొక్కలను పెంచి ఇంటికి అయిదు చొప్పున ఉ



చితంగా అందించనున్నారు. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడానికి డ్వామా ఆధ్వర్యంలో రహదారుల వెంట గుంతలు తీసి నాటించనున్నారు. కంపా, అటవీ శాఖ నిధులతో మరో నాలుగు లక్షల మొక్కలు పెంచనున్నట్లు జిల్లా సామాజిక అటవీ శాఖ డివిజనల్ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు.

సిద్ధమైన నర్సరీలు

గతంలో కొత్తపట్నం, కలుజువ్వపాడు, తుమ్మలచెరువు గ్రామాల్లోని నర్సరీలే మొక్కల పెంపకానికి అనువుగా ఉన్నాయి. తాజాగా వీటితోపాటు తాపచెట్లు, హాజీపురం, బల్లిపల్లి, మర్రిపాలెం, మర్రిపల్లి, తోకపల్లి గ్రామాల్లోని నర్సరీలను పునరుద్ధరించారు. జూన్, జులైలో వర్షాలు సమృద్ధిగా కురిసే సమయానికి మొక్కలు అంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఇంత నిర్లక్ష్యమా?



నర్సీపట్నం : రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎక్కడా ఢోకా లేకుండా చేపట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. తాజాగా చేపట్టిన పనులే కాకుండా గత వైకాపాలో చేసిన రోడ్ల పనుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అయినా కొందరు ఇంజినీరింగ్ అధికారులకు ఈ విషయం తలకెక్కడం లేదు. ఈ దిశగా పరిశీలించాలంటూ శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సూచించినా తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా రోడ్ల పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఓటర్ల మెప్పు పొందేందుకు యుద్ధప్రాతిపదికపై పనులు చేయాలంటూ గుత్తేదారులకు హుకుం జారీ చేశారు. నాణ్యతతో పనిలేకుండా ఎన్నికల కోడ్ కూయకముందే ప్రారంభోత్సవాలు జరగాలంటూ ఉత్సాహం చూపడంతో గుత్తేదారులు ఇదే అదునుగా మొక్కుబడి పనులు చేసి బిల్లులు మార్చేసుకున్నారు. నాణ్యత లేకుండా నిర్మించిన రోడ్లు ఇప్పుడు గిరిజనులకు సంకటంగా మారాయి. గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ గదబపాలెం నుంచి నిమ్మగెడ్డకు తారురోడ్డు నిర్మాణానికి గతేడాది పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి పథకం (నాబార్డు) ద్వారా 4 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ. 60 లక్షల నిధులు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైకాపా నాయకుల ఆదేశాలతో గుత్తేదారు హడావుడిగా పనులు చేసి నాణ్యతకు నీళ్లొదిలేశారు. ఈ నాసిరకం పనులపై గతేడాది ఈనాడులో 'మొక్కుబడి పనులు మొదట్లోనే తూట్లు' అనే శీర్షికతో కథనం వెలువడింది. అప్పట్లో ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో 2024 జనవరి 30న అప్పటి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హడావుడిగా ప్రారంభోత్సవం చేసేశారు. ఇంజినీరింగ్ అధికారులు సహకారంతో బిల్లులు మార్చేసుకున్న గుత్తేదారు రోడ్డువంక చూడలేదు.

ప్రస్తుతం ఈ రోడ్డు అంచులు కంకరకు బదులు మట్టితో పూడ్చడం వల్ల అంచులు కోతకు గురయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకొనే యత్నంలో బోల్తా పడుతున్నాయి. రోడ్డుపై తారుపూత పూర్తిగా లేచిపోయింది. నాలుగు కిలోమీటర్లు మేర రోడ్డు పరిస్థితి ఇలాగే ఉండటంతో అటుగా రాకపోకలు సాగించే నాలుగు గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల పోరాట ఫలితంగా మంజూరైన తారురోడ్డు నిర్మాణం ఇలా నాణ్యత లేకుండా నిర్మించి ఇబ్బందులకు గురిచేశారని ఈ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న తారురోడ్డు కంటే గతంలో ఉన్న మట్టిరోడ్డే బాగుండేదంటున్నారు గిరిజనులు. మారుమూల గ్రామాలకు చిరకాలం ఉండాల్సిన తారురోడ్డును నాణ్యత లేకుండా నిర్మించారంటూ గదబపాలెం, నిమ్మగెడ్డ, భీమునిపట్నం గ్రామాలకు చెందిన గిరిజనులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం రోడ్డు పనుల నాణ్యత చక్కదిద్దాలని వేడుకున్నారు. ప్రజావాణి కార్యక్రమాల్లో ఫిర్యాదులు ఇచ్చారు. కానీ ఇంజినీరింగ్, మండలశాఖ అధికారులు పట్టించుకోలేదు. తక్షణం అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపాలు చక్కదిద్దాలని.. లేకుంటే ఆందోళన బాట పడతామని సీపీఎం నాయకులు చంద్రరావు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాం..: గదబపాలెం తారురోడ్డు పనులు సక్రమంగా లేకపోవడం వాస్తవమే. ఆ ప్రాంతీయులు ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేశాం. తొలిదశలో హడావుడిగా పనులు చేపట్టడం వల్ల.. మరిగిన తారుపిక్క ఉష్ణోగ్రత శాతం ఎక్కువ కావడంతో రోడ్డుపై అంటుకోలేదని గుర్తించాం. ప్రకాశం జిల్లాకు చెందిన గుత్తేదారు ఈ పనులు చేపట్టారు. పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.సత్యనారాయణ, డీఈ, పంచాయతీరాజ్, ప్రాజెక్టు నర్సీపట్నం

# 'క్లాప్'..కనుమరుగయ్యేనా..!



నర్సీపట్నం : రాష్ట్రంలో చెత్త సేకరణకు వినియోగిస్తున్న క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఏటా కోట్ల రూపాయల ప్రజాధనం గుత్తేదార్లకు దోచిపెడుతున్న తీరుపై పూర్తిగా విచారించి... క్లాప్ వాహనాలు నిలిపివేయాలన్న నిర్ణయానికి వచ్చింది.వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులకు లబ్ధిచేకూర్చేలా జీవీఎంసీ (మహా విశాఖ నగర పాలక సంస్థ)పై ఆర్థికభారం మోపుతూ 900 వాహనాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూర్చారు.. నగరంలో కొండవాలు ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, ఆయా చోట్లకు వాహనాలు వెళ్లవని నాటి ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నా, వైకాపా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వాహనాలు ఏర్పాటు చేసింది. అప్పటివరకు నగర గుత్తేదారులు చెత్త సేకరణకు సమకూర్చిన ఒక్కో వాహనానికి రూ.45 వేలు ఇచ్చిన జీవీఎంసీ అధికారులు, క్లాప్ పథకంలో ఒక్కో వాహనానికి రూ.65 వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అలా పెంచిన మొత్తాన్ని 'చెత్త సేకరణ ఛార్జీల' పేరిట ప్రజల నుంచి వసూలు చేసి, గుత్తేదారుకు జమ చేసేవారు.

**అయినా సరే..:** 'క్లాప్' ద్వారా జీవీఎంసీలో సేవలు అందిస్తున్న టాటా ఏస్ వాహనాలను భవిష్యత్తులోనూ కొనసాగించేలా పైరవీలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సంబంధిత గుత్తేదారు మధ్యవర్తుల ద్వారా జీవీఎంసీ ఉన్నతాధికారులను కలిసి చర్చలు జరిపినట్లు సమాచారం. క్లాప్ వాహనాలను పక్కన పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినా, కొందరు జీవీఎంసీ అధికారులకు ఆర్థికంగా ఊతమిస్తున్న గుత్తేదారును కొనసాగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

**కూలీల పేరిట కొల్లగొట్టారు:** రెండేళ్ల కిందట చెత్త సేకరణ చేస్తున్న జీవీఎంసీ కార్మికుల్ని రహదారులు శుభ్రం చేసేందుకు, కాలువల్లో పూడిక తీసేందుకు కేటాయించి, చెత్త సేకరణకు 600 మంది కార్మికులను అదనంగా సమకూర్చారు. ఒక్కో కార్మికుడికి రూ.12 వేలు చొప్పున వేతనం ఇచ్చేందుకు జీవీఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ టెండర్‌ను అప్పటి ప్రజారోగ్యం విభాగాన్ని పర్యవేక్షించిన ఓ అధికారి సహకారంతో 'క్లాప్ వాహనాల గుత్తేదారు' దక్కించుకున్నారు. అలా ఒక్కో వాహనానికి కార్మికునితో కలిపి రూ.77 వేలు ఇవ్వాల్సి వచ్చేది.

# నిర్మాణ, నిర్వహణ లోపాలతోనే ఎసెన్షియా ప్రమాదం

అనకాపల్లి : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదానికి నిర్మాణ, నిర్వహణ లోపాలే ప్రధాన కారణమని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తేల్చారు. గతేడాది ఆగస్టు 21న జరిగిన ఈ ప్రమాదంలో 17 మంది చనిపోగా, 39 మంది క్షతగాత్రులయ్యారు. ప్రాణనష్టం భారీగా జరగడంతో ఈ ప్రమాదంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) సుమోటోగా కేసు నమోదు చేసింది. కేంద్ర కాలుష్యనియంత్రణ మండలిని మొదటి ప్రతివాదిగా చేర్చి తదుపరి విచారణలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పీసీబీ అధికారులు ఇటీవల ఎన్జీటీలో తమ పరిశీలన అంశాలతో అఫిడవిట్ దాఖలు చేశారు. అందులో ప్రమాదానికి దారితీసిన పలు కారణాలను వివరించారు. ప్రమాదకర రసాయనాలు వినియోగించి మందులు తయారు చేసినప్పుడు ప్రమాద విశ్లేషణ, ఆపద మదింపు (హజార్డ్ ఎనాలసిస్ రిస్క్ అసెస్‌మెంట్– హర) చేసే ప్రక్రియ చేపట్టాలి. అలాంటిది చేపట్టకుండా రెమిజ్‌పెంట్ సల్ఫేట్ మందు తయారు చేస్తున్నప్పుడే ఈ ప్రమాదం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. 'ఈ మందు తయారీలో ఉపయోగించే మిథైల్ టెర్ట్ బ్యూటైల్ ఈథర్ (ఎంటీబీఈ) రసాయనం 200 లీటర్లు పైప్‌లైన్ నుంచి లీకయింది. చాలావరకు ఆవిరిగా మారిపోగా.. కొన్ని చుక్కలు కింది అంతస్తులో ఉన్న విద్యుత్తు స్విచ్‌బోర్డుపై పడడంతో చిన్న నిప్పు రేగి పేలుడు చోటుచేసుకుంది. ఆవిరిగా మారిన రసాయనం బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో భారీ పేలుడు జరిగి గోడలు, సీలింగ్ కూలిపోయి ఎక్కువ మంది చనిపోయారు'




**ఏడాది ముందే చెప్పినా..**

'ఎసెన్షియా ఫార్మాలో 2023 జులైలో సేఫ్టీ ఆడిట్ జరిగింది. కంపెనీలో వెంటిలేషన్ సమస్య ఉందని, గాలిని బయటకు పంపే పంకాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారి సూచనను పట్టించుకోలేదు. ప్రమాద తీవ్రతకు ఇది కూడా ఒక కారణమే. లీకైన ఎంటీబీఈ మొత్తం ఎయిర్ హ్యాండ్లింగ్ డక్ట్‌ల్లో నిండిపోవడంతోనే పేలుడు తీవ్రత భారీస్థాయికి చేరింది. రసాయనాలు లీకైనప్పుడు వాటిని గుర్తించే సాంకేతిక పరికరాలేవీ ఏర్పాటు చేసుకోలేదు. మందుల తయారీకి ముందు రసాయనాలు పైప్‌లైన్‌లో పంపించేటప్పుడు ఒత్తిడి, లీకేజి పరీక్షలు చేయాలి. ఇక్కడ అలాంటి పరీక్షలు జరగలేద'ని నివేదికలో స్పష్టంచేశారు.

# వైకాపా పాపం.. వెన్నాడుతుంది శాపం

నెల్లూరు : సముద్రంలో వేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు అందించే మత్స్యకార భరోసాకు 8 నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. అప్పట్లో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రభుత్వం జాప్యం చేయడం.. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పరిహారం విడుదల కాలేదు. జిల్లాలో 110 కిలోమీటర్ల పొడవున సముద్రతీరం ఉంది. దీని వెంట ఉన్న గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. కందుకూరు, కావలి, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉలవపాడు, గుడ్లూరు, కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, మనుబోలు మండలాలకు చెందిన ప్రాంతాలున్నాయి. 14వేలకు పైగానే మత్స్యకారులు ఉన్నారు. వీరంతా సముద్రంలో వేటకు వెళ్లడం, దొరికిన మత్స్య సంపదను అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. మత్స్యకారులలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఎక్కువ. ఏ రోజుకారోజు వేట చేసుకుని పూట గడుపుకొనే పరిస్థితి.

**12,444 మంది బాధితులు**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు



అంటే 61 రోజుల పాటు వేట నిషేధ%రి%ం ఉంటుంది. ఈ సమయంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం కింద ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ప్రభుత్వం జీవన భృతి అందిస్తుంది. పరిహారం వేట నిషేధ కాలంలో మే నెలలో అందజేస్తారు. మత్స్యకారుల పేర్ల నమోదు, ఆధార్ తదితర వివరాలు వారి నుంచి తీసుకోవడం, అర్హులను గుర్తించడం, జాబితాలను ప్రచురించడం చేస్తారు. గతేడాది జిల్లాలో మత్స్యకార భరోసా కింద 12,444 మంది మత్స్యకారులను అర్హులుగా గుర్తించారు. వీరికి భృతి కింద డబ్బులు అందజేయాల్సి ఉంది. అప్పట్లో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఎన్నికల కోడ్ తదితర కారణాల్లో పరిహారం విడుదల కాలేదు. ఇప్పటికే 8నెలలు గడిచింది. పరిహారం విడుదల కాక ఎదురు చూస్తున్నారు. అసలు భృతి డబ్బులు వస్తాయా లేదా అన్న ఆందోళనలో ఉన్నారు. మరో మూడు నెలలు గడిస్తే మళ్లీ వేట నిషేధకాలం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం- నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ జేడీ**

గతేడాది వేట నిషేధకాలంలో మత్స్యకార భరోసా పథకానికి 12,444 మందిని అర్హులుగా గుర్తించాం. అప్పట్లోనే వివరాలు ప్రభుత్వానికి అందజేశాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది.

# 1030 ఎకరాల్లో అటవీ వనాలు

ఆత్మకూరు : జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంపుపై ఆ శాఖ దృష్టిసారించింది. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో 1030 ఎకరాల్లో మొక్కలు నాటారు. ఒక్క ఆత్మకూరు రేంజి పరిధిలోనే 480 ఎకరాల్లో పూర్తి చేశారు. గ్రీన్‌కో కంపెనీ తన అవసరాల కోసం కర్నూలు జిల్లాలో తీసుకున్న అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా జిల్లాలో కేటాయించారు. అందులో అటవీ జాతి మొక్కలు నాటి.. పెంచుతున్నారు. అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు, అనుమసముద్రంపేట మండలం దూబగుంటల్లో ఎర్రచందనం, తెల్లమద్ది, నేరేడు, వేప, రావి, మర్రి తదితర 12 రకాల మొక్కలను పెంచి.. అడవులుగా



తీర్చిదిద్దుతారు.

**జామాయిల్ నరికివేతకు...**

వీఎస్ఎస్‌ల పరిధిలోని జామాయిల్ మొక్కలు కొట్టేందుకూ అటవీశాఖ కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాలో 1,02,000 మెట్రిక్ టన్నుల యూకలిప్టస్ ఉన్నట్లు సమాచారం. వాటిని కొడితే రూ. 80 కోట్లపైనే ఆదాయం వస్తుందని.. అందులో సగం తిరిగి వీఎస్ఎస్‌ల అభివృద్ధికే ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆత్మకూరు రేంజి పరిధిలో ఇప్పటికే 22 టన్నుల జామాయిల్ కర్ర కొట్టారు. మరో ఏడు వేల టన్నులు సిద్ధంగా ఉంది. సంక్రాంతి తర్వాత కొట్టడం మొదలు పెట్టాలని నిర్ణయించారు. దీనిపై డీఎఫ్‌వో మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. ఈ ఏడాది లక్ష్యం మేరకు అటవీ ప్లాంటేషన్ వేశాం. యూకలిప్టస్ చెట్లు కొట్టే ప్రక్రియ సంక్రాంతి తర్వాత చేపడతామని తెలిపారు.

# పాడి రైతుకు పండగ

ఒంగోలు : పాడి పరిశ్రమకు మరింత చేయూతనివ్వడంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. ఇందుకుగాను ఒక్కో యూనిట్‌కు రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు కేటాయించింది. వీటిని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మంజూరు చేసింది. గత ఏడాది జులైలో జిల్లాకు మొత్తం 1,075 యూనిట్లు కేటాయించగా.. అంతకుమించి 1,342 షెడ్ల నిర్మాణానికి అధికారులు అనుమతి ఇచ్చారు. మద్దిపాడు నుంచి మొదలు: షెడ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న పాడి రైతుల నుంచి తొలుత దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 458 మంది ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేయగాబీ మిగతావి పలు దశల్లో ఉన్నాయి. వీటిని ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు పూర్తయిన షెడ్లను ఈ నెల 12వ తేదీ వరకు ప్రారంభించనున్నారు. అందులో భాగంగా మద్దిపాడులో నిర్మించిన గోకులాన్ని మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభిస్తారు.

# కప్పం కట్టు.. బరులు పెట్టు

కప్పం : ఒక పక్క కోడిపందేలు నిర్వహిస్తే ఊరుకొనే ప్రసక్తే లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మరో పక్క కళ్లెదుటే బరులు, పందెం కోళ్లు కత్తికట్టి కాలు దువ్వడానికి సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నెలరోజుల నుంచి అడపాదడపా వేర్వేరు చోట్ల ఓ మాదిరి పందేలు జరుగుతున్నా పోలీసులు కిమ్మనడం లేదు. సంక్రాంతి సంప్రదాయం ముసుగులో పొలాలు, స్థిరాస్తి వెంచర్లను చదును చేసి మరీ బరులకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులు వేలం పాటలు నిర్వహించి మరీ జూదాల వారీగా అప్పగిస్తున్నారు.

**మధ్యవర్తిత్వాలతో..**

వీరవాసరం మండలంలో ఏడెకరాల్లో అతిపెద్ద బరిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిసింది. వద్దంటూ ఒకరిద్దరు హైకోర్టును ఆశ్రయించగా, పార్టీలకతీతంగా పెద్దలు రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆచంటలో గతేడాది కంటే ఈ సారి బరుల సంఖ్య పెరగడంతోపాటు విస్తీర్ణం మరింత పెంచుతున్నారు. ఇటీవల పెనుమంట్ర మండలంలోని ఓ గ్రామంలో బరుల నిర్వాహకులు, పందెంరాయళ్లకు విందు భోజనాలు ఏర్పాటుచేసి మరీ వారికి ఆహ్వానాలు పలికారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి రెండు గ్రామాలకు ఒకటి వంతున బరులు సిద్ధం చేసేందుకు ఇప్పటికే చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు రాజకీయ నేతల అండదండలతో నిర్వాహకులు చక్రం తిప్పుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 500పైగా బరులు సిద్ధం అవుతున్నాయని అంచనా.

**ఫ్లడ్‌లైట్ల వెలుగులో..** ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే జోరుగా కోడి పందేలు సాగుతున్నాయి. మొన్న భీమవరం, సీసలి, పెదఅమిరం, నిన్న ఎన్.ఆర్.సి.అగ్రహారం, మహదేవపట్నం



ప్రాంతాల్లోని ఖాళీ జాగాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాత్రి 10 నుంచి 2 గంటల మధ్య పందేలు నిర్వహించారు.

**అభివృద్ధి పేరుతో వేలం పాటలు..** ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పేరిట వేలం పాటలు నిర్వహించి, హెచ్చు పాటదారునికి బరులు అప్పగిస్తున్నారు. బరుల పరిమాణం, రాబడిని బట్టి మధ్యవర్తులు భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని సమాచారం. గతంలో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ నిర్వహిస్తే ఈసారి అదనంగా మరో రెండు రోజులు ఆడించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై నిర్వాహకులు ఇప్పటికే ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని ఉన్నతాధికారులను కలిసి ముట్టచెప్పినట్లు తెలిసింది. గతేడాది కంటే ఈ ఏడాది బరుల సంఖ్య పెరగడంతో భారీ మొత్తంలో చేతులు మారే అవకాశం ఉందని పందెం రాయుళ్లు చెబుతున్నారు.

**విడిది కోసం ప్రత్యేక ఏర్పాట్లు..** జిల్లాలో నిర్వహించే కోడి పందేల్లో పాల్గొనేందుకు గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. ఇప్పటికే భీమవరం, ఆకివీడు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, కైకలూరు, నూజివీడు తదితర పట్టణాల్లోని లాడ్జిల్లో గదులన్నీ నిండిపోయాయి. నేటి నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు, శనివారం నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సెలవులు కావడంతో జిల్లాకు పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు రానున్నారు. వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# వన్నెతగ్గిన పాలిష్

బనగానపల్లి : గత కొన్ని నెలలుగా నాపరాతి బండల ఎగుమతులు ఆగిపోయాయి.. పోర్టుల్లో వేల టన్నుల సరకు పేరుకుపోయింది.. దీంతో పరిశ్రమల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పరిశ్రమల్లో పనిలేక కార్మికులకు ఉపాధి కొరవడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 900 వరకు నాపరాతి బండలను పాలిష్ చేసే పరిశ్రమలు ఉన్నాయి. అలాంటి పరిశ్రమలు ఒక్క బేతంచెర్లలోనే సుమారు 400 వరకు ఉన్నాయి. గనుల్లో తీసిన నాపరాళ్లను పరిశ్రమలకు తీసుకెళ్లి పాలిష్ చేస్తారు.. వాటిని వివిధ రకాల సైజులుగా మార్చి ఎగుమతికి సిద్ధం చేస్తారు. కంటెయినర్లలో కాకినాడ, చెన్నై, కృష్ణపట్నం పోర్టులకు తరలిస్తారు.. అక్కడి నుంచి నౌకల్లో బ్రిటన్, కెనడా, అమెరికా వంటి 18 దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో టన్నుల మేర సరకు పోర్టుల్లో నిలిచింది.



**పరిశ్రమలకు తాళం**

గతంలో నిత్యం 90 నుంచి 100 కంటెయినర్లలో ఎగుమతి చేసేవారు.. ప్రస్తుతం 10 వాహనాలు కూడా వెళ్లడం లేదు. ఓ కంటెయినర్‌లో 28 టన్నుల పాలిష్ బండలు ఉంటాయి.. వాటి విలువ రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఉంటుంది. ఒకప్పుడు నిత్యం 2,800 టన్నుల సరకు పోర్టులకు వెళ్లేది. అక్కడి నుంచి నిత్యం ఐదువేల టన్నుల సరకు వివిధ దేశాలకు ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం గిరాకీ లేక ఏజెంట్లు ఖాళీగా ఉంటున్నారు. నిత్యం రూ.3 కోట్లు అంటే నెలకు రూ.30 కోట్ల వ్యాపారం పడిపోయింది. “ పాలిష్ పరిశ్రమలు బతకాలంటే ప్రభుత్వం రాయితీ కల్పనతో పాటు రాయల్టీ తగ్గించాలి.. గత మూడేళ్లుగా వ్యాపారాలు పడిపోయాయి.. ఈ ఏడాది మరింత తగ్గాయి.. కూలీలకు ఉపాధి కల్పించలేకపోతున్నాం.. ఇప్పటికే పలువురు పరిశ్రమలకు తాళం వేశారు.. గుజరాత్‌లో చౌకగా దొరకడంతో ఈ పరిస్థితి వచ్చిందని” పరిశ్రమ యజమాని కార్తిక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# లైనింగ్ వద్దు.. విస్తరణ ముద్దు



అనంతపురం: శ్రీశైలం నుంచి వీలైనంత ఎక్కువ నీటిని తీసుకోవాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. ఫేజ్–1లో జీడిపల్లి జలాశయం వరకు కాలువ విస్తరణ, ఫేజ్–2లో జీడిపల్లి నుంచి శ్రీసత్యసాయి–అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు లైనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఫేజ్–2లో లైనింగ్ పనులను జిల్లా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రధాన కాలువకు లైనింగ్ చేస్తే భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైనింగ్ పనుల్ని టెండరు దశలోనే నిలిపివేయాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే రైతులు, రైతు సంఘాలు హంద్రీనీవా కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. లైనింగ్ పనులు చేస్తే ప్రయోజనం లేకపోగా రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందని వివరిస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

**హంద్రీనీవాతో మారిన రూపురేఖలు**

ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంతో నిర్మించిన హంద్రీనీవా 312 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 2014లో ఫేజ్–1కు, 2016లో ఫేజ్–2కు శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశారు. డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇంకా ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. కానీ, ప్రధాన కాలువలో మోటార్లు ఏర్పాటు చేసుకుని పంటలు పండిస్తున్నారు. భూగర్భ జలాలు పెరగడంతో వేలాదిమంది రైతులు బోర్లు వేసుకున్నారు. గుంతకల్లు, ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు పెరగడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. ఫలితంగా పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రూపురేఖలు మారిపోయాయి. ఇప్పుడు ప్రభుత్వం మంచి ఉద్దేశంతోనే లైనింగ్ పనులు చేపట్టినా.. భూగర్భ జలాలు తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని కూటమి ప్రజాప్రతినిధులు సైతం వ్యతిరేకిస్తున్నారు.

**భవిష్యత్తులో ఇబ్బంది రాకూడదని..**

శ్రీశైలం నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని తీసుకునేలా హంద్రీనీవా ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టారు. కాలువ పటిష్ఠంగా లేకపోవడంతో 1,100 క్యూసెక్కులకు మించి తీసుకోలేపోతున్నాం. తలుపుల మండలంలోని పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు వచ్చేసరికి ప్రవాహ 200 క్యూసెక్కులకు తగ్గిపోతోంది. నీటి నష్టాలను అరికట్టాలంటే లైనింగ్ ఒకటే పరిష్కారమని ప్రభుత్వం భావిస్తోంది. అయితే కాలువ విస్తరణ చేపట్టకుండా లైనింగ్ పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇక విస్తరణ పనులు చేసేందుకు వీలుండదని రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఫేజ్–2లోనూ విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

**రైతులకు నష్టం తెచ్చే పనులు చేయం - పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆర్థిక మంత్రి**

కూటమి ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిచేయాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగానే మొదటి బడ్జెట్‌లోనే భారీగా నిధులు కేటాయించాం. ఫేజ్–1లో విస్తరణ, ఫేజ్–2లో లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే లైనింగ్ పనులు చేపడితే భూగర్భ జలాలు తగ్గిపోతాయని జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైనింగ్‌పై ప్రభుత్వానికి మా అభ్యంతరం వ్యక్తం చేశాం. దీంతో స్పందించిన సీఎం చంద్రబాబు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ప్రక్రియను నిలిపివేసేలా నీటిపారుదలశాఖకు సూచించారు. రైతులకు నష్టం చేకూర్చే పనులను ఎట్టిపరిస్థితుల్లో చేపట్టబోం.

**విస్తరణతోనే రైతులకు మేలు - పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే**

హంద్రీనీవా జలాలు వచ్చిన తర్వాత ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగాయి. వేలాదిమంది రైతులు బోర్లు వేసుకుని పంటలు సాగుచేస్తున్నారు. ప్రధాన కాలువకు లైనింగ్ పనులు చేయడంపై ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లైనింగ్ కంటే విస్తరణతోనే మరింత మేలు జరుగుతుందని ప్రభుత్వానికి విన్నవించాం. విషయాన్ని నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయు డు దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం లైనింగ్ నిర్ణయంపై పునరాలోచించాలి.

# జీర్ణకోశవ్యాధుల విభాగానికి గ్రహణం



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పక్క జిల్లాలకు కూడా వరంగా ఉన్న సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో జీర్ణకోశవ్యాధుల(మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ) విభాగానికి సంబంధించి ప్రభుత్వం వైద్యులను నియమించకపోవటంతో విభాగం తలుపులు కూడా తీయని పరిస్థితి నెలకొంది. దీంతో రూ.కోట్లు విలువ చేసే వైద్యసామగ్రి నిరుపయోగంగా మారింది. వైద్యులను నియమించేందుకు చర్యలు చేపట్టాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో జీర్ణకోశవ్యాధుల విభాగానికి గ్రహణం పట్టింది.

**రూ.కోట్లు విలువైన యంత్రాలు నిరుపయోగం**

జీర్ణకోశవ్యాధుల విభాగంలో రూ.కోట్లు విలువ చేసే వైద్యసామగ్రి ఏళ్ల తరబడి వృథాగా మారిపోయింది. ఇందులో భాగంగా కడుపులో అల్సర్‌లు, గ్యాస్‌ట్రబుల్, పేగు సమస్యలు వంటి వాటిని గుర్తించేందుకు వీడియోఎండోస్కోపీ యంత్రాన్ని వినియోగిస్తారు. ఈ యంత్రం రూ.55 లక్షలు పెట్టి కొనుగోలు చేసి సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలకు పంపారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఎండోస్కోపీ పరీక్ష ప్రైవేట్‌గా చేయించుకోవాలంటే రూ.3 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. లివర్ ఫంక్షన్ వివరాలను తెలుసుకునేందుకు రూ.1.50 కోట్లు విలువ చేసే ఫైబ్రోస్కాన్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రం అనంతపురంలోని రెండు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉంది. సదరు పరీక్షను ప్రైవేట్‌గా చేయించుకోవాలంటే రూ.4 వేలు అవుతుంది. లివర్ ఫంక్షన్‌కు సంబంధించి రక్తపరీక్షలు (హెచ్‌బీఎస్ఏజీ) చేయించుకునేందుకు లక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కిట్లన్నీ ఈ ఏడాది ఆఖరుకు సమయం ముగిసే పరిస్థితి ఉంది.

**ఏఏ సేవలందించాలంటే..**

జీర్ణకోశవ్యాధులకు సంబంధించిన విభాగంకు సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలో 21 పడకలు కేటాయించారు. ఓపీ సేవలు అందించేందుకు ప్రత్యేక గదులు కేటాయించారు. 2022 మార్చి 18న వైద్యశాలను ప్రారంభించారు. కడుపునొప్పి, కడుపులో మంట, ఆకలి లేకపోవటం, శరీరంలో వికారం గ్యాస్‌ట్రబుల్, పేగు వ్యాధులు, జాండీస్, మూత్రవిసర్జనలో సమస్యలు వంటి వాటికి వైద్యసేవలు అందించాలి. ఈ సేవలకు సంబంధించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు పొందాలంటే ఒక్కొక్కరితో రూ.500 కన్సల్టేషన్ ఫీజు కింద వైద్యులు వసూలు చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ వైద్యులు రాయించే పరీక్షలు చేయించుకోవాలంటే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంపై ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలో జీర్ణకోశవ్యాధుల విభాగానికి వైద్యులను కేటాయించాలని డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. వైద్యులు వస్తే ఓపీ, ఐపీ సేవలను ప్రారంభిస్తామని తెలిపారు.

# పండగ వేళ.. ప్రైవేటు దందా!

విశాఖపట్నం : సంక్రాంతి వేళ కొన్ని ప్రైవేటు బస్సుల యజమానులు టికెట్ల ధరలు పెంచేశారు. ప్రయాణికుల డిమాండును ఆసరాగా చేసుకొని మూడింతలు పెంచి దోచేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని స్వస్థలాలకు వచ్చేవారు అధికం. దీంతో పండగ సమీపంచే కొద్దీ ధరలు పెంచుకుంటూ పోతున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు వచ్చేందుకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీట్లు లేవు. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో పరిమితంగా ఉన్నాయి. దీంతో కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ ట్రావెల్స్ బస్సులో హైదాబాద్ నుంచి విశాఖకు సాధారణ రోజుల్లో రూ.3 వేలుండే టికెట్ ప్రస్తుతం రూ.6,000లకు పెంచి విక్రయిస్తున్నారు.

సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.1500 ఉండే నాన్ ఏసీ స్లీపర్ బస్సు టికెట్ ధర రూ.3,500 నుంచి రూ.4 వేలకు పెంచేశారు. నాన్‌ఏసీ బస్సుల్లో రూ.1200 టికెట్ రూ.2500కు పెంచారు. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి విశాఖ వచ్చే ఏసీ బస్సుల్లో టికెట్ ధర రూ.1500 ఉంటే...దానిని రూ.3 వేలుకు పెంచేశారు. సాధారణ బస్సుల్లో రూ.800 నుంచి రూ.2 వేలకు పెంచి ఆన్‌లైన్‌లో ఉంచారు. రవాణాశాఖ దృష్టేది: పండగ రద్దీ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ దందాపై రవాణాశాఖ దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. అధిక ధరలు, అదనపు సీట్లు, కాంట్రాక్టు క్యారేజ్ పర్మిట్లు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాటిపై కన్నేయాలి. కొందరు అనుమతి లేని బస్సులను రోడ్డెక్కిస్తుంటే..మరికొందరు సరైన ఫిట్‌నెస్ లేనివాటినీ



తిప్పుతున్నట్లు సమాచారం. **ప్రత్యేక బృందాలతో తనిఖీలు:** ‘ట్రావెల్ బస్సుల ఉల్లంఘనలపై తనిఖీలు ప్రారంభించాం. 13వ తేదీ వరకు కూర్మన్నపాలెం, ఎన్ఏడీ వద్ద రెండు బృందాలు విశాఖ వచ్చే బస్సులను తనిఖీ చేస్తాయి. అలాగే 15 నుంచి 18వ తేదీ వరకు విశాఖ నుంచి బయలుదేరే వాటినీ తనిఖీ చేస్తాం. నిబంధనలు అతిక్రమించిన వారి మీద కఠిన చర్యలు తీసుకుంటాం’ అని ఆర్టీవో రామ్‌కుమార్ పేర్కొన్నారు.

# పది విద్యార్థులకు ప్రత్యేక పాఠం


కర్నూలు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది.. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో పలు పాఠశాలల్లో బోధన ఉపాధ్యాయుల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.. దీన్ని గమనించి ప్రయోగాత్మకంగా వర్చువల్ బోధనకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక చొరవ తీసుకొని నగరపాలక సమావేశ భవన పైభాగంలో విశాలమైన గదిని కేటాయించారు. అక్కడ వర్చువల్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ రిసోర్సు నెట్వర్క్ (వీ–లెర్న్) కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు బోధిస్తే ఒకేసారి 352 పాఠశాలల్లోనివిద్యార్థులు పాఠాలు వింటున్నారు.

**యూట్యూబ్‌లో పాఠాలు**

వర్చువల్ తరగతి గదిలో బోధించిన పాఠాలను వీడియో రికార్డింగ్ చేయిస్తున్నారు. వాటిని ప్రధానోపాధ్యాయుల జీ–మెయిల్‌కు పంపడంతోపాటు విద్యాశాఖ రూపొందించిన యూట్యూబ్‌లోనూ అప్‌లోడ్ చేస్తారు. యూట్యూబ్‌ను అధికారికంగా విడుదల చేయాల్సి ఉంది.

**352 పాఠశాలలు.. 14,600 మంది విద్యార్థులు**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 38 వేల మంది వరకు పదో తరగతి చదువుతున్నారు. వర్చువల్ తరగతులు వినడానికి ఉపాధ్యాయుల కొరత ఉన్న 352 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇవి పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. హిందీ ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. ఈ సబ్జెక్టుపై ప్రధానంగా దృష్టి సారించారు. గతేడాది సాంఘిక



శాస్త్రంలో చాలామంది ఫెయిల్ కావడంతో ఈసారి ప్రత్యేక దృష్టి సారించారు. గణితం, సైన్సు సబ్జెక్టుల్లో పట్టులేని విద్యార్థులకు వర్చువల్ పద్ధతిలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

సి, డి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు 40 నుంచి 50 మార్కులు తెచ్చుకునేలా పాఠ్యాంశాలను సులువైన పద్ధతిలో బోధించడంతోపాటు వీడియో చిత్రీకరణ చేస్తున్నారు.

**నిత్యం గంట పాటు బోధన**

వర్చువల్ బోధనకు మొదట సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి.. ఇంటర్‌నెట్ సరిగా లేకపోవడంతో వీడియో సరిగా రాక.. మాటలు పూర్తి స్థాయిలో వినిపించేవి కావు. ఏపీ ఫైబర్‌నెట్ ఫ్రీక్వెన్సీ పెంచడంతో సమస్య తీరింది. విద్యా నిపుణులు నిత్యం సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య వర్చువల్ గదిలో పాఠాలు బోధిస్తారు.. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులు వింటారు. ఆ రోజు ఏ పాఠం బోధిస్తారు.. ఎవరు బోధిస్తారో ముందుగానే సమాచారం ఇస్తారు.

సాయంత్రం బోధించిన పాఠ్యాంశాలకు సంబంధించి మరుసటి రోజు బడికి వచ్చిన విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

# ఒప్పందానికి పొగ

నందికొట్కూరు : పొగాకు సాగు చేస్తే మంచి ధర ఇస్తామని కంపెనీలు నమ్మించాయి.. వాతావరణ పరిస్థితులను తట్టుకొని రైతులు పంటను కాపాడారు.. చేతికొచ్చింది.. కొనుగోలుకు వెళ్తే కొర్రీలు పెడుతున్నారు.. ‘తేమ’ పేరుతో పొగ పెడుతున్నారు. రైతులకు అనువుగా లేని దూర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అష్టకష్టాలుపడి అక్కడికి బేళ్లను తీసుకెళ్తే ధరలు తగ్గించేస్తున్నారు. కొన్ని బేళ్లను కొని మిగిలినవి వెనక్కి పంపిస్తున్నారు. వాటిని విక్రయించేందుకు మళ్లీ టోకెన్ వచ్చే వరకు వేచి ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

**సాగు చేసిన రకాలు** బర్లీ (సిగరెట్) వీఐఎన్–5, వీబీహెచ్–3, రుస్టిక (బీడీ) ఏ–119 రకాలతోపాటు నాగు పొగాకు మరికొన్ని చోట్ల ఫ్లూ క్యూర్డ్ వర్జీనియాఎకరాకు పెట్టుబడి: రూ.40 వేలు రూ.50 వేలు దిగుబడి(ఎకరాకు): 7–12 క్వింటాళ్లు

**అమాంతం పెరిగిన సాగు**గతేడాది కంపెనీలు క్వింటా పొగాకుకు రూ.15 వేల వరకు చెల్లించాయి. బయట రూ.20 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది క్వింటా రూ.18 వేలు ఉంటుందన్న ఆశతో చాలామంది దీనిని సాగు చేశారు. ఈ ఏడాది అన్నదాతల ఉత్సాహాన్ని చూసి పలు కంపెనీలు విత్తనం ఇచ్చి ప్రోత్సహించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది కంటే 40 వేల ఎకరాలు అదనంగా సాగైంది. ఒక్క నందికొట్కూరు నియోజకవర్గంలోనే 10 వేల ఎకరాల్లో పంట వేశారు. పొగాకు సాగు చేసిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు.. పొలం రకాన్ని బట్టి ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు కౌలు చెల్లించారు.

**కొర్రీలు పెట్టి కొసరంత కొని**తేమ 8 శాతం ఉంటే క్వింటాకు రూ.15,500 చెల్లించాలని కంపెనీలు నిర్ధారించాయి. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. రకాన్ని బట్టి క్వింటా రూ.12 వేల నుంచి రూ.15,500 వరకు ధర చెల్లిస్తున్నాయి. స్థానికంగా కొనుగోలు కేంద్రాలున్నా సరే కంపెనీలు చెప్పినచోటే విక్రయించాలి. సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు వెళ్తే మొత్తం దిగుబడులు కొనకుండా కొర్రీలు పెడుతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

“ నాణ్యత సరిగా లేదు.. తేమ ఎక్కువగా ఉందంటూ కొర్రీలు పెడుతున్నారు. ఆకు పూర్తిగా ఎండిన తర్వాతే తీసుకురావాలని వెనక్కి పంపిస్తున్నారు.. రూ.13 వేలకు మించి ఇవ్వడం లేదని” రైతులు వాపోతున్నారు. తేమ లేకుండా ఉన్న వాటికే టోకెన్ ఇస్తున్నారు.

నమ్మకం లేక తక్కువ సాగుచేశా

ఫక్కీరన్న, చౌట్కూరు, మిడుతూరు

పంట సాగుచేస్తే మేమే కొంటామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. నేను బీడీలకు వచ్చే సూరు పొగాకును సాగు చేసుకున్నా. దీన్ని వ్యాపారి ఇంటి వద్దకొచ్చి కొంటారు. చుక్క బర్లీ పొగాకు వేస్తే బేళ్లు తయారు చేసుకుని కంపెనీ ఎక్కడికి చెబితే అక్కడికి తీసుకెళ్లాలి. ఈ కష్టాలన్నీ ఉంటాయనే నేను రెండెకరాల్లో మాత్రమే పంటను సాగుచేశా. దానిని విక్రయించేందుకు తీసుకొచ్చా. కిలో రూ.134 ధర వేశారు. అదే సూరు పొగాకు అయితే పుట్టి రూ.40 వేల వరకు ఉంది. ఎకరాకు 4– 5 పుట్లు అవుతుంది. శ్రమ కూడా ఉండదు. కంపెనీ మాటలు వింటే రైతులకు నష్టమే మిగులుతోంది.

చురకలు




# కొత్త అడుగులు.. మేలి మలుపులు

అచ్యుతాపురం : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం, వనరులు ఉన్నా గత అయిదేళ్లు నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పారిశ్రామికవేత్తలు అనకాపల్లి జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వారు కోరిన మౌలిక సదుపాయాలను కల్పించగలిగితే పారిశ్రామికంగా జిల్లా మరో మెట్టుపై నిలుస్తుంది. దీనిపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టలేదు. ఏళ్లతరబడి వృథాగా పడిఉన్న వల్లూరు భూములను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ గతనెలలో అవకాశాలను అందిపుచ్చుకుందామా' దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ విజయ్‌కృష్ణన్ జిల్లాలో ఖాళీగా ఉన్న ఏపీఐఐసీ భూముల అభివృద్ధితోపాటు దీర్ఘకాలిక సమస్యలపైనా దృష్టి సారించారు. కొత్త పరిశ్రమలకు రాచబాట వేస్తున్నారు.

**వల్లూరు భూములకు మోక్షం**

ఏళ్ల తరబడి తుప్పలు, డొంకలతో వృథాగా ఉన్న వల్లూరు భూములకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడ మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు కోసం సోమవారం దిల్లీ నుంచి ఓ పారిశ్రామిక వేత్తల బృందం పరిశీలనకు వస్తుంది. గత నాలుగు రోజులుగా 25 పొక్లెయిన్లు పెట్టి ఈ భూములన్నింటిని పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా చదును చేయిస్తున్నారు. ఇక్కడ సరుకు రవాణా కేంద్రం ఏర్పాటుకోసం గత తెదేపా ప్రభుత్వంలోనే ఇక్కడ 400 ఎకరాలకుపైగా సేకరించారు. ప్రభుత్వం మారి వైకాపా గద్దెనెక్కిన తర్వాత ఈ భూములను పట్టించుకోవడం మానేశారు. వందల ఎకరాలు నిరుపయోగంగా ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వంలో తిరిగి ఈ భూముల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. లాజిస్టిక్ పార్క్ కోసం భూములు సిద్ధం చేయడంతో పాటు 1.7 కి.మీ పొడవునా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), ఏలేరు



కాలువపై వంతెన నిర్మాణానికి రూ. 50 కోట్లతో నిర్మించడానికి సిద్ధమవుతున్నారు. ఈ పార్క్ కార్యరూపంలోకి వస్తే స్థానికంగా వేలమందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు చెబుతున్నారు.

**నీటి ఇబ్బందులు తొలగేలా..**

పరవాడ, అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో కంపెనీలకు అవసరమైన నీటిని ఏలేరు కాలువ నుంచే మోటార్లతో పంపింగ్ చేసి అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో మోటార్లు పాడై తరచూ నీటికి ఇబ్బందులు తలెత్తేవి. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సైతం తుప్పలు, పూడికతో నిండిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. వీటన్నింటిని ఇప్పుడిప్పుడే గాడిలోకి తెస్తున్నారు. మోటార్లను బాగుచేయించి నీటి పంపింగ్‌లో సమస్య లేకుండా చేశారు. తాజాగా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. యంత్రాలు పెట్టి పూడికలు, తుప్పలు, చెట్లు తొలగిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఏలేరు కాలువ నిర్వహణ కోసం నీటి సరఫరా నిలిపే అవకాశం ఉండడంతో ఇప్పటి నుంచే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నింపేలా చర్యలు మొదలుపెట్టారు. 2 వేల మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసేలా గత మూడు రోజులుగా రోజుకు 20 మిలియన్ లీటర్ల వరకు ట్యాంక్‌లోకి పంపింగ్ చేస్తున్నారు.

**విద్యుత్తు సమస్యలకు పరిష్కారం**

పరవాడ ఫేజ్-3 పారిశ్రామిక పార్క్ 175 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ 66 కంపెనీలకు ప్లాట్లు కేటాయించారు. వీటి కోసం ప్రత్యేకంగా ఓ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మించాలని ఎప్పటి నుంచో పరిశ్రయ యాజమాన్యాలు కోరుతున్నాయి. ఏపీఐఐసీ సైతం రూ. 4.38 కోట్లు తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థకు (ఈపీడీసీఎల్) చెల్లించింది. 50 సెంట్ల స్థలం కేటాయించింది. కానీ గత అయిదేళ్లూ ఈ ఉపకేంద్రానికి అడుగులు పడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపకేంద్రం నిర్మాణ పనులు మొదలుపెట్టారు. త్వరలోనే విద్యుత్తు సమస్యలు పరిష్కారం అవుతాయని ఏపీఐఐసీ అచ్యుతాపురం జోనల్ మేనేజర్ హరిప్రసాద్ చెప్పారు.

# నగరంలో..3 ఇసుక నిల్వ కేంద్రాలు

విశాఖ : విశాఖ జిల్లా ప్రజలకు అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు భీమిలి, ముడసర్లోవ, గాజువాక వద్ద ప్రయివేటు ఏజెన్సీల ద్వారా ఇసుక నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, ఇసుక కమిటీ ఛైర్మన్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. సోమవారం నుంచే భీమిలి, ముడసర్లోవ కేంద్రాల వద్ద సరఫరా ప్రారంభవుతుందని, టన్ను రూ.700కి విక్రయిస్తారని పేర్కొన్నారు. ఇసుక కావాల్సిన వారు %sand.ap.gov.in% వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, రిజిస్ట్రేషన్



కాపీతో ఇసుక నిల్వ కేంద్రానికి వెళ్లాలని, లేనిపక్షంలో ఆధార్ కార్డు తీసుకెళ్లి నిల్వ కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని సూచించారు. కేవలం డిజిటల్ చెల్లింపులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఇసుక అవసరమైన వారు భీమిలి కేంద్రం ఇన్‌ఛార్జి ఫోన్ నెంబర్లు 93980 02019, 79897 15157, ముడసర్లోవ కేంద్రం ఇన్‌ఛార్జి ఫోన్ నెంబర్లు 83091 86417, 63008 05838లో సంప్రదించాలన్నారు.

# అర్జీలు దండిగా.. పరిష్కారం ఒట్టిదేగా!



అనంతపురం: కార్యాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సులభంగా పరిష్కరించదగ్గ దరఖాస్తులను సైతం నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. వారంలో రెండు, మూడు రోజులు పనులు వదులుకొని మరీ తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల అవినీతి కారణంగా మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రెవెన్యూ సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7 నుంచి జనవరి 8వ తేదీ వరకు ఎక్కడికక్కడ సదస్సులు ప్రారంభించింది. వందల సంఖ్యలో అర్జీలు వస్తున్నా.. ఒక్కటీ పరిష్కారానికి నోచుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రీసర్వే గ్రామాల్లో మరింత జఠిలం**

వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వేను అస్తవ్యస్తం చేశారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండానే సర్వే పూర్తయినట్లు నివేదికలు సమర్పించడంతో అంతటా తప్పులు దొర్లాయి. అనంతపురం జిల్లాలో 198 గ్రామాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 161 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. వీటిలో అత్యధికంగా భూముల విస్తీర్ణం తగ్గుదల, సరిహద్దుల్లో తేడాలు, జాయింట్ ఎల్‌పీ నంబర్ల కేటాయింపులపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిలో కొన్ని క్షేత్రస్థాయిలో మరోసారి సర్వే చేస్తే పరిష్కరించదగ్గవి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జాయింట్ ఎల్‌పీ ఖాతాలు ఉన్న రైతులు బ్యాంకు రుణాలు, మార్టిగేజ్ రుణాలు పొందాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లోనూ వీటిపైనే ఎక్కువ అర్జీలు వస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో రీసర్వే సమస్యలపై ఒకేరోజు 48 దరఖాస్తులు అందడం గమనార్హం.

**చాలాచోట్ల మొక్కుబడిగానే..**

గ్రామస్థాయిలో అక్కడికక్కడే రెవెన్యూ సమస్యలు, భూవివాదాలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. మండలాల వారీగా ఒక్కోరోజు ఒక్కో గ్రామంలో సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే మొదటిరోజైన శనివారం చాలాచోట్ల మొక్కుబడిగానే నిర్వహించారు. ముందస్తు ప్రచారం కల్పించకపోవడంతో స్పందన కరవైంది. అమరాపురంలో కేవలం ఒక అర్జీ మాత్రమే రావడం గమనార్హం. కదిరి, గుడిబండ, ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట మండలాల్లో రెండేసి చొప్పున, మరో 4 మండలాల్లో మూడేసి చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. అధికారులు ఎలాంటి రికార్డులు లేకుండానే హాజరవుతున్నారు. ప్రజావేదిక మాదిరిగానే కేవలం అర్జీలు తీసుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారు.

**పేరు చేర్చాలన్నా బరువే..**

తల్లిదండ్రుల పేరుపై ఉన్న భూములను తమ పేరుతో మ్యుటేషన్ చేయాలని ఎక్కువమంది దరఖాస్తు చేసుకుంటున్నారు. నెలలు, సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని, పదులసార్లు దరఖాస్తు చేసినా స్పందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సాగులో ఉన్న భూమిని వేరొకరి పేరుతో ఎక్కించారని ఇప్పటికే ప్రజావేదికగా పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోవడంతో మళ్లీ రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు అందజేస్తున్నారు.

రాప్తాడు మండలం బొమ్మేపర్తికి చెందిన ఎర్రిస్వామికి 264 సర్వేనంబరులో 4.50 ఎకరాల భూమి ఉంది. కానీ, రీసర్వేలో ముగ్గురికీ కలిపి ఒకటే ఎల్‌పీ నంబరు ఇచ్చారు. అందులో 11 ఎకరాల విస్తీర్ణం చూపించడంతో పథకాలకు అర్హత కోల్పోయినట్లు వాపోతున్నారు.

తన తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిని కేవలం తన తమ్ముడి పేరుతో మాత్రమే ఆన్‌లైన్‌లో ఎక్కించారని చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దలకు చెందిన వ్యక్తి వాపోయారు. వైకాపా హయాంలో పలుమార్లు వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వంలోనైనా తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

సాంకేతిక సమస్యలతోనే ఆలస్యం

శివనారాయణశర్మ, జేసీ, అనంతపురం

రీసర్వే గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీ నంబర్లపై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిని పరిష్కరించడంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వాటిపై మరింత కసరత్తు చేస్తున్నాం. వారం తర్వాత ప్రత్యేక కార్యాచరణతో సమస్యలు పరిష్కరిస్తాం. ఇతర సమస్యలపైనా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నాం.

# ఆధునిక సాంకేతికతతో ముందడుగు



అచ్యుతాపురం : రకరకాల పన్నాగాలతో తమ కళ్లుగప్పి తిరుగుతున్న నేరస్థుల ఆటకట్టించడానికి పోలీసులు ముందడుగు వేశారు. ఇందుకోసం అత్యున్నత సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. పెద్దపెద్ద నేరాలు, దోపిడీలు, దొంగతనాలు, గంజాయి రవాణా, ఆర్థిక మోసాలు చేసి చిక్కకుండా తిరుగుతున్న వారే లక్ష్యంగా పోలీసులు ఖోజ్ యాప్‌తో పట్టు బిగిస్తున్నారు. ఇలా తప్పించుకొని తిరుగుతున్న 26 మంది కరుడుగట్టిన నేరస్థులను జిల్లా పోలీసులు ఈ యాప్ ద్వారా ఇప్పటికే జైళ్లకు పంపించి విజయం సాధించారు. అనకాపల్లి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుహిన్ సిన్హా తనకు ఉన్న సాంకేతిక అంశాల పట్టుతో సొంత నిధులు ఖర్చుచేసి ఖోజ్ అనే ఆధునిక యాప్‌ను కొనుగోలు చేశారు. జిల్లాలో పనిచేసే ప్రతి పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు (ఎస్ఎహెచ్ఓ)కి దీనిపై అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా నేరస్థుల సమాచారాన్ని ఇట్టే పట్టేయడానికి ఉన్న అవకాశాలను పోలీసులు ఉపయోగించుకుంటున్నారు.

**ఈ-మాల్‌ఖానాలతో సాక్ష్యాలకు రక్షణ**

నేరం చేసి కూడా సాక్ష్యాలు లేకుండా చేయడం, నేరం చేయడానికి ఉపయోగించిన ఆయుధాన్ని తరవాత కనిపించకుండా చేస్తున్న ఉదంతాలకు అడ్డుకట్ట వేయడానికీ పోలీసులు ఆధునిక సాంకేతికత ఉపయోగిస్తున్నారు. కోర్టుల్లో నేరస్థుడికి శిక్ష పడాలంటే కోర్టుకు సాక్ష్యాలు, ఆధారాలు చాలా ముఖ్యం. దీనిని ఆధారంగా చేసుకొనే కోర్టులో శిక్షలు విధిస్తాయి. ఇటువంటి క్రైమ్ ప్రోపర్టీని భద్రపరచడంలో గతంలో చాలా లోపాలు వెలుగుచూశాయి. కేసు విచారణ చేసే అధికారి తరవాత కాలంలో బదిలీపై వెళ్లిపోవడం, కేసుల విచారణకు సమయం పట్టడంతో కేసుల్లో కీలకమైన క్రైమ్ ప్రోపర్టీని పెద్దగా పట్టించుకునేవారు.

జిల్లాలో 43 పోలీసుస్టేషన్లు, సర్కిల్ స్టేషన్ల పరిధిలో ఉన్న క్రైమ్ ప్రాపర్టీకి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి భద్రతా వ్యవస్థను డిజైన్ చేశారు. ప్రతి స్టేషన్‌కి ఒక యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ను కేటాయించారు. నేరం జరిగిన స్థలంలో స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటువాటి వివరాలను ఈ-మాల్‌కాణా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే కేసు పూర్తి వివరాలు తెలిసేలా ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ వస్తుంది. దీనిని క్రైమ్ ప్రాపర్టీ బాక్సులపై ముద్రించి పోలీసుస్టేషన్లలో భద్రపరుస్తున్నారు.

**నిధాన్ పోర్టల్‌లో సమాచారం**

మాదక ద్రవాల వినియోగం, రవాణా, వ్యాపారంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడానికి ముందుకెళ్తోంది. ఇలాంటి నేరస్థులను కటకటాల వెనక్కి పంపించడానికి పోలీసులు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారి వివరాలను నిధాన్ పోర్టల్‌లో నమోదు చేస్తూ ఏ ప్రాంతంలోనైనా వారిని గుర్తించే పనిలో ఉన్నారు. వీటితోపాటు ఈగల్ టీమ్, ఎన్‌డీపీఎస్ సెల్ 93929 18196 (నార్కొటిక్ డ్రగ్స్, సైకో థెరపిక్ సబ్‌స్కేండ్స్) ప్రత్యేక బృందాలు, విభాగాన్ని ఏర్పాటు చేసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తున్నారు. గంజాయి నార్కోటిక్ కొకైన్, హెరాయిన్, గంజాయి సంబంధిత నేరాలపై దేశంలో ఎక్కడ అరెస్టయినా వారి వివరాలను నిధాన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

**పాత కేసులకు పరిష్కారం** ఖోజ్ యాప్ ద్వారా పాత కేసులకు పరిష్కారం చూపిస్తున్నాం. దీని ద్వారా ఇప్పటికే జిల్లాకు సంబంధించిన 26 మంది పెద్దపెద్ద నేరాలు చేసి తప్పించుకున్న వారిని పట్టుకుని జైళ్లకు పంపించాం. ఆధునిక సాంకేతికత ఉపయోగించుకొని నేరస్థులను కటకటాల వెనక్కి పంపించి తీరుతాం. తుహిన్‌సిన్హా, ఎస్పీ

# గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్

దేవరాపల్లి : సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాల్లో ఇంటరు విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, నీట్ కోచింగ్ ప్రారంభించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయ అధికారి రూపవతి చెప్పారు. తెనుగుపూడి బాలుర గురుకుల విద్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ.. గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఐఐటీ, నీట్కు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పరీక్ష జరుగుతుందన్నారు. మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. వీరిలో ఉత్తరాంధ్రకు చెందిన బాలురకు విశాఖ నగరంలోని శ్రీకృష్ణాపురం గురుకుల కళాశాలలో, బాలికలకు చీపురుపల్లి బాలికా విద్యాలయంలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఇంటరు తరగతులతోపాటు నీట్ ఐఐటీ ప్రవేశ పరీక్షల శిక్షణ ఇస్తామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, రాత్రి గంట చొప్పున ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయన్నారు.

**వారంలో బకాయిల విడుదల**

ఉమ్మడి విశాఖ జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు 11 ఉన్నాయని, వీటిలో 6400 మంది విద్యార్థులు చదువుతున్నారని




రూపవతి చెప్పారు. వీరిలో 825 మంది పదో తరగతి, 1400 మంది ఇంటరు విద్యార్థులు ఉన్నారన్నారు. గురుకులాలకు వంట సామగ్రితోపాటు కూరగాయలు సరఫరా చేస్తే గుత్తేదారులకు చెల్లించాల్సిన ఆరు నెలల బకాయిలు వారంలో విడుదలయ్యే అవకాశముందన్నారు. తెనుగుపూడి, గొలుగొండ, నక్కపల్లి, విశాఖ, శ్రీకృష్ణాపురం, మేహాద్రిగెడ్డ గురుకులాల్లో భవనాల మరమ్మతుకు రూ.1.2 కోట్ల చొప్పున మంజూరయ్యాయని చెప్పారు. తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, సబ్బవరం గురుకులాల్లో చిన్న చిన్న మరమ్మతులకు రూ.30 లక్షల చొప్పున ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

# దెబ్బేసిన ఫెయింజల్

పుత్తూరు : ఫెయింజల్ తుపాను కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతులు సాగు చేసిన వరి, వేరుసెనగ, ఉద్దులు, మొక్కజొన్న దెబ్బతిన్నాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు కళ్లేదుటే పాడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.వేలు ఖర్చు చేసి సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరో తుపాను గండం పొంచి ఉందని వాతావరణశాఖ అధికారుల హెచ్చరికలతో రైతులు కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో ఉద్యానశాఖ అధికారుల పంట నష్టం అంచనాలు సిద్ధం చేయలేదని, మరో రెండ్రోజులు పడుతుందని చెప్పడం గమనార్హం. చిత్తూరు జిల్లాలో నగరి, విజయపురం, నింద్ర మండలాలు, తిరుపతి జిల్లాలో పుత్తూరు, రామచంద్రాపురం, వడమాలపేట మండలాల్లో వేరుసెనగ విత్తారు. ఇప్పటివరకు మొలకెత్తలేదు. వరదయ్యపాళెం, నారాయణవనంలో కోత దశలో వరి దెబ్బతింది. ప్రభుత్వం నివేదించి వారికి విత్తనాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పుత్తూరు మండలం గంగమాంబాపురానికి చెందిన రైతు ధనలక్ష్మి



పెయింజల్ తుపాను ముందు రెండెకరాల్లో వేరుసెనగ విత్తారు. ఇందుకు శ్రీకాళహస్తిలో వేరుసెనగ విత్తన పప్పు రూ.30 వేలకు కొనుగోలు చేశారు. సాగు ఖర్చుకు మరో రూ.20 వేలు ఖర్చయింది. అయితే విత్తిన మరుసటి రోజు నుంచి వర్షాలు కురిసి మొలకెత్తలేదు. ఇప్పటికే రూ.50 వేలు ఖర్చయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది. పుత్తూరు మండలం గంగమాంబాపురానికి చెందిన రైతు గోవిందరెడ్డి శ్రీకాళహస్తిలో వేరుసెనగ విత్తనాలు కొనుగోలు చేసి విత్తారు. నాలుగు రోజుల వర్షానికి పొలంలో ఇసుక మేట వేసింది. మరికొంత పూర్తిగా మొలకెత్తలేదు. దీంతో దిక్కుతోచక వాపోతున్నార. నగరి మండలం మాంగాడు గ్రామానికి చెందిన దేవరాజులు ఒక ఎకరాలో బంతిపూలు, సంపంగి సాగు చేశాడు. నారు ఖర్చు రూ.30 వేలైంది. బంతిపూల తోట పూర్తిగా దెబ్బతింది. సంపంగిలో నీళ్లు నిలిచాయి. రూ.50 వేలు నష్టపోయినట్లు రైతు తెలిపారు.

# అలా ఎగిరి.. గగనాన ఎదిగి

రేణిగుంట : విమానయాన రంగం రెక్కలు విచ్చుకుంటోంది. ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సందడిగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం రాకతో పారిశ్రామిక సందడి నెలకొనడం, ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి రావడం ఇందుకు ప్రధాన కారణం. ఇటీవల ప్రారంభించిన ముంబయి సర్వీసు కలిపి ప్రస్తుతం రోజువారీగా 16 సర్వీసులు నడుస్తుండగా 1,600 మందిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని రంగాల్లోనూ మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా విమానయానం ప్రత్యేక గుర్తింపుని సంతరించుకుంది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ఈ రంగంపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా రోజుకో ప్రత్యేక విమానం ఇక్కడికి వస్తోంది. శ్రీవారి దర్శనం చేసుకొనే వారి సంఖ్య పెరిగింది.

**పారిశ్రామిక పెట్టుబడులకు సానుకూలం**

విమానాశ్రయానికి చుట్టూ ఉన్న భూముల్లోనే నేడు అధిక సంఖ్యలో పరిశ్రమలు స్థాపిస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు శ్రీసిటీలో పలు పరిశ్రమల నిర్మాణానికి భూమిపూజ చేసిన విషయం విదితమే. దీంతోపాటు రేణిగుంట, ఏర్పేడు మండలాల మధ్య ఉన్న ఈఎంసీ 1, 2లోనూ పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో యువ పారిశ్రామికవేత్తలతోపాటు ఔత్సాహికులు పెట్టుబడులకు వస్తున్నట్లు సమాచారం.

ఏడునెలల కిందటి వరకు నెలకు 65 వేలమంది వరకు ప్రయాణికులు ఈ విమానాశ్రయానికి రాగా ప్రస్తుతం ఆ సంఖ్య 77 వేలకు చేరువగా ఉంది. త్వరలో 80 వేలకు చేరుకోనున్నట్లు విమానాశ్రయం అధికారులు అంచనా వేస్తున్నారు.

# దర్జాగా స్వాహా

చిత్తూరు: జిల్లాలో మాత్రం పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై అందిన కాడికి దోచేస్తున్నారు.. వందశాతం కార్డులకు కందిపప్పు అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది.

440 టన్నులకే సరఫరా..జిల్లాలో 1,379 చౌకదుకాణాల ద్వారా 336 ఎండీయూ వాహనాల్లో సరకులు అందజేస్తున్నారు. డిసెంబరు కోటా కింద ప్రభుత్వం జిల్లాకు 543.259 టన్నుల కందిపప్పు కేటాయించింది. కార్డుకు కిలో రాయితీపై రూ.67కు అందజేస్తారు. గోదాముల్లో నిల్వలు అవసరమైనంత అందుబాటులో ఉన్నా 440.105 టన్నులే దుకాణాలకు సరఫరా చేశారు. ఈ లెక్కన లక్ష కార్డులకు కందిపప్పు లేనట్లే. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో పౌరసరఫరాల శాఖకు అధికారుల కొరత తీవ్ర జఠిలంగా ఉంది. 31 మండలాలకుగాను ఒక్క సీఎస్‌డీటీ లేరు. జిల్లా కార్యాలయంలో ఏఎస్‌వో పోస్టులు ఖాళీ. కనీసం అటెండరు లేడు.

డీలర్లు, ఆపరేటర్లు దయతలిస్తేనే..

కొందరు డీలర్లు కందిపప్పు సరఫరాకు నామమాత్రంగా చెల్లించి తక్కువ మొత్తంలో తెప్పించుకుని మొదట్లో వచ్చిన వారికే అందజేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై అధిక ధరకు అమ్ముకుంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే తప్ప వందశాతం కార్డుదారులకు పూర్తి స్థాయిలో కందిపప్పు, ఇతర సరకులు అందే పరిస్థితి లేదని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు.

జిల్లాలో కార్డులు..

బియ్యం కార్డులు : 5,43,259

డిసెంబరు కోటా కందిపప్పు కేటాయింపు: 543.259 టన్నులు

చౌక దుకాణాలకు సరఫరా: 440.105 టన్నులు


# పేదల బియ్యం గుటుక్కు

విశాఖపట్నం : జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు భారీగా ఉంటున్నాయి. తనిఖీల్లో బయటపడుతున్నవి అంతంతమాత్రమే. పర్యవేక్షించాల్సిన శాఖలు చూసీచూడనట్లు వదిలేస్తున్నాయి. దీంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. గతంలో నిల్వలు పట్టుబడిన చోటే మళ్లీమళ్లీ గుర్తిస్తున్నారు. తగరపువలసలో ఒకే దుకాణదారుడి వద్ద ఆరు సార్లు గుర్తించారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో కొద్ది రోజుల వ్యవధిలో ఒకసారి 3 మెట్రిక్ టన్నులు, మరోసారి 124 బస్తాలు కనుగొన్నారు. వీటి ఆధారంగా చూస్తే పేదల బియ్యం ఎంత దారుణంగా పక్కదారి పడుతుందో తెలుస్తుంది.

పౌరసరఫరాల వ్యవస్థలో క్షేత్రస్థాయి లోపాలు కొందరికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పక్కదారి పట్టించిన బియ్యాన్ని మొదట మిల్లులకు తరలించి పాలిష్ చేయిస్తారు. అక్కడి నుంచి పోర్టుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. ఇదంతా ఒక పథకం ప్రకారం సాగుతుంది.

విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి కాకినాడకు వెళ్తున్నవి అధికంగా ఉంటున్నాయి. నగరంలోని లబ్ధిదారులు, దుకాణదారుల నుంచి అక్రమార్కులు కొందరు బియ్యాన్ని సేకరించి చోడవరం, ఇతర గ్రామీణ ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి అమ్ముతున్నారు. ఇలా అవుతున్న వాటిల్లో తూకం, పంపిణీలోని లోపాల్లో మిగిలిన బియ్యమే ఎక్కువ.

**గోనె సంచులతో..:** ప్రస్తుతం తూకాల్లో మోసాలు పెద్దగా లేనప్పటికీ వైకాపా ప్రభుత్వ హయాంలో కొంతకాలం దర్జాగా ఇది సాగింది.




బియ్యాన్ని గోనె సంచులతో కలిపి తూయడం, కేజీ గుండు బియ్యంలో ఉంచడం వంటివి చేసేవారు. ఇలా 20 కేజీలకు కేజీ తక్కువుండేలా మిగుల్చుకునేవారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పక్కదారి పట్టినవి ఏడాదికి కొన్ని వేల టన్నులుంటాయి. అయిదేళ్లలో లక్షల్లోనే తరలించారు.

**చాలామంది అక్కడే..:** నగరంలోని పలువురు లబ్ధిదారులు రేషన్ వాహనదారుల వద్దే బియ్యం ఉంచేస్తున్నారు. అనుమానం రాకుండా ఉండేందుకు రేషన్ బస్తాల నుంచి ప్లాస్టిక్ బస్తాల్లో ఉంచి నిల్వ చేస్తున్నారు. నగరం నడిబొడ్డునే ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసినవి ఎక్కడికక్కడ అక్రమంగా నిల్వ ఉంచుతున్నారు. వీటిపై విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ, తూనికలు-కొలతలు, రెవెన్యూ గట్టి నిఘా పెట్టాల్సినప్పటికీ జిల్లాలో ఆ స్థాయి దృష్టి ఎక్కడా కనిపించడం లేదు. బియ్యం అక్రమ నిల్వలపై తనిఖీల కోసం సర్కిళ్ల వారీగా అధికారులు విధులు నిర్వహిస్తున్నట్లు డీసీఎస్‌వో భాస్కరరావు తెలిపారు.

**పౌరసరఫరాల శాఖలో..**

జిల్లాలోని రేషన్ లబ్ధిదారులు: 5.29 లక్షలు

పంపిణీ చేసే బియ్యం: 8 వేల టన్నులు

పట్టుకున్న అక్రమ నిల్వలు: 102 టన్నులు

# ప్రతిరోజూ నీరు.. మార్మోగింది పేరు!

నక్కపల్లి : గ్రామంలోని ప్రతి ఒక్కరికీ రోజంతా సమృద్ధిగా నీరు అందించడం పంచాయతీల బాధ్యత. ఈ విషయంలో నక్కపల్లి మండలం న్యాయంపూడి పంచాయతీ దేశంలోనే అత్యుత్తమంగా నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను పెంచింది. దేశంలోని వేల పంచాయతీలతో పోటీపడి మెరుగైన తాగునీటి సరఫరా అంశంలో సత్తా చాటింది. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్‌ను సాధించింది. దీనికి సంబంధించి ఈనెల 11న దిల్లీలో రాష్ట్రపతి అవార్డుతో పాటు, రూ. కోటి నగదు రివార్డును ప్రదానం చేయనున్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పోటీలను ఈ ఏడాది ప్రారంభంలో చేపట్టారు. దీనిలో భాగంగా సమృద్ధిగా తాగునీరు, పారిశుద్ధ్యం, మహిళా స్నేహపూర్వక, బాలల స్నేహపూర్వక.. ఇలా తొమ్మిది అంశాల్లో జిల్లాలోని పంచాయతీలు పోటీ పడగా. నక్కపల్లి మండలం నుంచి న్యాయంపూడి (సమృద్ధిగా తాగునీరు), డోలివాని లక్ష్మీపురం (బాలల స్నేహపూర్వక) అంశాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. తుది పోటీల్లో న్యాయంపూడి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది.

**ఇంటింటి కుళాయిలు**

న్యాయంపూడి గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా దాదాపు రూ. 40 లక్షలు మంజూరు కాగా..అధికారులు, పాలకులు కలిసి సంపు, మోటారు, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. గ్రామానికి పైలట్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటితోపాటు ప్రత్యామ్నాయంగా గ్రామం వద్ద బోరు వేసి మోటారు ద్వారా నీటిని ఎక్కించేవారు. బయటి నుంచి వచ్చే నీరు రెండు రోజులకోసారి ఇస్తుండగా, ఇక్కడ వేసిన మోటారు ద్వారా ప్రతిరోజూ నీరు అందుతుంది. దీంతో స్థానికులకు నీరు సమృద్ధిగా లభిస్తోంది. పోటీల పరిశీలన నిమిత్తం రాష్ట్ర, జాతీయ స్థాయి బృందాలు ఇక్కడకు వచ్చినప్పుడు ఇక్కడ నీటి సరఫరా తీరుతెన్నులను పరిశీలించి నివేదిక తయారు చేశారు. ఫలితంగా ఇదే అంశంలో ప్రస్తుతం జాతీయ అవార్డు వరించింది.

**అందరి సహకారంతోనే**

గ్రామానికి తాగునీటి సరఫరా అంశంలో జాతీయస్థాయి అవార్డు రావడం సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. వేల పంచాయతీలు పోటీపడితే మేము ఈ విభాగంలో నెగ్గడం గర్వంగా ఉంది. అవార్డు సాధించడంలో ప్రజలు, అధికారులు, తోటి ప్రజాప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిది. అవార్డు స్ఫూర్తితో గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి చేస్తా. ఇది నా జీవితంలో మరిచిపోలేని విజయం.రెడ్డి వరహాలబాబు, సర్పంచి, న్యాయంపూడి

**గ్రామాన్ని తీర్చిదిద్దుకుంటాం**

ఎక్కడో మారుమూల గ్రామంగా ఉన్న మా ఊరు పేరు ఈ రోజున దిల్లీస్థాయికి చేరింది. తాగునీటిని అందించే అంశంలో జాతీయ అవార్డు సాధించడం చాలా ఆనందంగా ఉంది. అవార్డు ద్వారా వచ్చే నగదుతో ఊరు రూపురేఖలే మారిపోతాయి. దీనిపై అంతా కలిసి కూర్చుని ఎలా అభివృద్ధి చేసుకోవాలో ప్రణాళికలు తయారుచేసుకుని, గ్రామాన్ని తీర్చిదిద్దుకుంటాం.ఆకేటి గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు

# ఐసీడీఎస్‌లో కోడిగుడ్ల వివాదం



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) అధికారులు కొత్త చిక్కుల్లో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒప్పందం (ఎంఓయూ) లేకుండానే కొత్త గుత్తేదారులకు ఇండెంట్ ఇవ్వడం.. వెనువెంటనే కోడిగుడ్ల సరఫరా చేయడంపై వివాదం రాజుకుంది. ఇదే క్రమంలోనే ప్రభుత్వ మార్గదర్శకాలు లిఖిత పూర్వకంగా లేకపోతే కోడిగుడ్లను తీసుకోమ ంటూ కొందరు సీడీపీఓలు తిరస్కరించడం ప్రస్తావనార్హం. ఇలా.. కొత్త గుత్తేదారుల వ్యవహారం ఆదిలోనే హంస పాదులా తయారైంది. కోడిగుడ్లే కాదు.. ఐదు రకాల అదనపు పౌష్టికాహారంతో కూడిన కిట్ల విషయం కూడా సమస్యగా మారింది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఈ అక్రమ బాగోతం అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో వాడివేడిగా సాగుతోంది. ఆశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వు, ఎంఓయూ లేకుండానే క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఇదే వారి మెడకు చుట్టుకుంది. ప్రస్తుతం తొలి విడత కోడిగుడ్ల సరఫరా నడుస్తోంది. ఇప్పటికే చాలా కేంద్రాలకు గుడ్లను పంపిణీ చేశారు. కిట్లు కూడా కొన్నింటికి వెళ్లాయి. ప్రభుత్వ ఉత్తర్వు లేకుండానే కొత్త గుత్తేదారులకు బిల్లు ఎలా చెల్లిస్తారన్నదే డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

**2.92 లక్షల లబ్ధిదారులు**

ఉమ్మడి అనంత జిల్లాలో 23 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 5,126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 2,91,838 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్కరికి ప్రతి నెలా 25 కోడిగుడ్లు పంపిణీ చేయనున్నారు. గర్భిణులు, బాలింతలు 41 వేల మంది ఉన్నారు. వీరికి మాత్రమే కిట్లు ఇవ్వనున్నారు. ఈ రెండింటికే ప్రతి నెలా రూ.3.5 కోట్ల నుంచి రూ.4 కోట్లమేర వ్యయం అవుతుంది. ఈ మొత్తం గుత్తేదారులకే చెల్లించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన అంశంపై స్పష్టమైన ఉత్తర్వు ఏదీ లేకుండానే సరఫరా హక్కులు కొత్త గుత్తేదారులకు ధారాదత్తం చేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. పాత గుత్తేదారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వు ఆధారంగా కొత్త గుత్తేదారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఐసీడీఎస్ డైరెక్టర్ ఉత్తర్వు, ఎంఓయూతో నిమిత్తం లేకుండా సీడీపీఓ, పీడీలు గుత్తేదారుల ఉత్తర్వును పరిగణనలోకి తీసుకోవడమే వివాదమైంది.

**'జూమ్'లో జేడీ అసంతృప్తి**

రెండు రోజుల కిందట రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంయుక్త సంచాలకురాలు (జేడీ) మనోరంజని రాష్ట్రవ్యాప్తంగా పీడీ, సీడీపీఓలతో జూమ్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ క్రమంలో కోడిగుడ్లు, కిట్ల సరఫరా వ్యవహారం చర్చకు వచ్చింది. శ్రీసత్యసాయి, అనంత జిల్లాలలో అత్యధిక ప్రాజెక్టుల్లో కొత్త గుత్తేదారులే కోడిగుడ్లు సరఫరా చేయడంపై జేడీ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వెలిబుచ్చినట్లు తెలిసింది. డైరెక్టర్ కార్యాలయం నుంచి ఎలాంటి ఎంఓయూ, ఉత్తర్వు లేకుండానే కొత్త వారికి ఎలా సరఫరా అవకాశం కల్పిస్తారంటూ శ్రీసత్యసాయి పీడీని ప్రశ్నించినట్లు సమాచారం. గుత్తేదారులతో కుదుర్చుకునే ఒప్పందం, ఉత్తర్వు లేకుండానే కొత్త వారికి ఇవ్వొద్దని ఖరాకండిగా చెప్పినట్లు తెలిసింది. కానీ, రెండు జిల్లాల్లో ఇందుకు విరుద్ధంగా పాత వారితో నిమిత్తం లేకుండా కొత్త గుత్తేదారులే తొలి విడత(స్పెల్) గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు. ఇదే తరహాలో కిట్లను కూడా ఇస్తున్నారు.

**ఉత్తర్వు కోసం నిరీక్షిస్తున్నాం**

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వు ఆధారంగా కొత్త గుత్తేదారులకు కోడిగుడ్ల ఇండెంట్లు ఇచ్చిన మాట నిజమే. కొత్తవారే జిల్లా అంతటా గుడ్లను సరఫరా చేస్తున్నారు. మాశాఖ డైరెక్టర్ నుంచి ఒకటి రెండు రోజుల్లో ఎంఓయూ, ఉత్తర్వు వస్తాయని అనుకుంటున్నాం. ఇదే విషయాన్నే ఉన్నతాధికారులకు నివేదించాం. వరలక్ష్మి, పీడీ, శ్రీసత్యసాయి

# అవగాహనతో లంచావతారుల ఆటకట్టు



అనంతపురం : ప్రభుత్వ కార్యాలయాల్లో చాలాచోట్ల చేయి తడపందే పనులు జరగని పరిస్థితి. రాజకీయ నేతలు మొదలుకొని అధికారులు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేటు రంగంలోనూ లంచాలు, కమీషన్లు ఇవ్వనిదే ఏ పనీ కాదన్నట్లుగా వ్యవస్థ మారింది. కళ్లముందు జరుగుతున్న అన్యాయాన్ని ఏదో ఒక వేదికగా గట్టిగా ప్రశ్నించడమే ఈ రుగ్మతకు మందు. ప్రశ్నిస్తేనే అవినీతిని అరికట్టవచ్చు.

**రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ శాఖల్లో అధికం**

అవినీతి ఏ ఒక్క శాఖకో పరిమితం కాలేదు. అత్యధిక శాఖల్లో సామాన్యుల నుంచి ఏదో ఒక రూపంలో అధికంగా డబ్బులు గుంజుతున్నారు. రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్, నగరపాలక సంస్థల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోంది. పట్టాదారు పాసుపుస్తకాల జారీ, మ్యుటేషన్, వివిధ రకాల ధ్రువపత్రాలు, తండ్రి నుంచి కుమారుడికి భూహక్కుల మార్పిడి, సర్వేలో భూకొలతల నుంచి మొదలుకొంటే అనేక రకాలుగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.

**మూడేళ్లలో 20 కేసులు**

లంచాలు కింది నుంచి పైస్థాయి వరకు.. హోదాకు అనుగుణంగా లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2022 జనవరి నుంచి ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీ వరకు కేవలం 20 కేసులు నమోదయ్యాయి. వాటిలో రెవెన్యూలో 6, పోలీసుశాఖలో 4, స్టాంపులు, రిజిస్టర్ శాఖలో 4, సంక్షేమశాఖ, కమర్షియల్ ట్యాక్స్, వ్యవసాయం, విద్యుత్తు, విద్యాశాఖలో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. 2022లో 6, 2023లో 7, 2024లో 7 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ కేసుల్లో 15 కేసులు బాధితులు ఫిర్యాదు చేయడం వల్ల ట్రాప్ చేసి పట్టుకున్నవే.

**ఏటికేడు పెరుగుతున్న వైనం..** ప్రభుత్వ శాఖల్లో లంచాలు డిమాండు చేసేవారి సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు కూడా అప్రమత్తమై వారిని వలపన్ని పట్టుకుంటున్నారు. 2017 నుంచి 2024 వరకు ఉమ్మడి జిల్లాలో ఏసీబీ 50 కేసులు నమోదు చేసింది. 2017లో 7, 2018లో 7, 2019లో 5, 2020లో 8, 2021లో 3, 2022లో 6, 2023లో 7, 2024లో 7 కేసులు నమోదయ్యాయి.

**చరవాణే బహ్మాస్త్రం**

ఏ మూలన అవినీతి, అక్రమాలు జరిగినా తక్షణమే స్పందించి, ప్రశ్నించడానికి ప్రతి ఒక్కరూ చేతిలో ఉన్న చరవాణిని ఆయుధంగా ఉపయోగించవచ్చు. ఇప్పటికే కొందరు ఉపయోగిస్తున్నారు కూడా. ఈ క్రమంలో అవినీతి అధికారులు, వ్యవస్థలను కొందరు నిరంతరం ప్రశ్నిస్తున్నారు. తమను ఎవరైనా లంచం అడిగితే ఏసీబీని ఆశ్రయించి లంచావతారుల్ని పట్టిస్తున్నారు. ఈ చైతన్యం మరింత రావాలి. విరివిగా సామాజిక మాధ్యమాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తే అవినీతిపరుల ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

**జరిగిన సంఘటనల్లో కొన్ని..**

ఈ ఏడాది జులైలో వజ్రకరూరు మండలంలో నంద్యాల జిల్లాకు చెందిన ఓ రైతు స్థానిక మండలంలో భూమి కొనుగోలు చేశారు. పాసుపుస్తకాల మంజూరు కోసం ఆర్ఐ రఫీని ఆశ్రయించగా ఆయన లంచం డిమాండ్ చేశాడు. సదరు రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, ఆర్ఐని వలపన్ని పట్టుకున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు కుమ్మక్కై కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన విలువైన రైతుల భూమిని నకిలీ ధ్రువపత్రాలతో కాజేశారు. రైతుల ఫిర్యాదుతో పైన చెప్పిన అధికారులపై కేసులు నమోదు చేశారు.

పాఠశాల నిర్వహణకు నిరభ్యంతర ధ్రువపత్రం ఇవ్వడానికి కూడేరు మండలానికి చెందిన మండల విద్యాధికారి రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి సదరు అధికారి ఆటకట్టించారు. 2024 మార్చిలో శ్రీసత్యసాయి జిల్లా మడకశిర సబ్ రిజిస్ట్రార్ దామోదర్ ఓ వ్యక్తి నుంచి రూ.2.50 లక్షలు లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడ్డాడు.

**ఇలా చేయండి**

ప్రభుత్వ ఉద్యోగులు చట్టప్రకారం పనులు చేయకుండా డబ్బులు డిమాండు చేస్తే నేరుగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అవినీతి ఉద్యోగులపై అనిశా అధికారులు చట్టప్రకారం కేసు నమోదు చేస్తారు. అనిశా కార్యాలయానికి కూడా వెళ్లి వివరాలను అందజేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నా, చేయాల్సిన పనులకు లంచం అడిగినా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

**ఫిర్యాదు చేయవలసిన నంబర్లు**

ఉమ్మడి అనంత జిల్లా ఏసీబీ కార్యాలయం: 08554 274170

ఏసీబీ డీఎస్పీ చరవాణి నంబరు: 94404 46181

ఫిర్యాదు చేయవలసిన మెయిల్ అడ్రస్: %acb@ap.gov.in

# ఐదేళ్ల నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం

అనంతపురం : వైకాపా ప్రభుత్వ హయాంలో అనంతపురం జిల్లాలో ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టు చేపట్టింది లేదు. పాతవాటికి మరమ్మతులు చేసిందీ లేదు. అంతకుముందు తెదేపా ప్రభుత్వ హయాంలో మొదలైన సాగునీటి ప్రాజెక్టుల పనులన్నీ ఎక్కడికక్కడే నిలిపేశారు. అందుకు రాప్తాడు నియోజకవర్గానికి మేలు చేసే 4 లిఫ్టులు ఉదాహరణ. జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టును అప్పటి తెదేపా ప్రభుత్వం 2018లో రూ.804 కోట్లతో మొదలుపెట్టారు. జీడిపల్లి జలాశయం నుంచి హంద్రీనీవా జలాలు తరలించేందుకు 54 కిలోమీటర్ల కాలువ నిర్మాణం, నాలుగు చోట్ల లిఫ్టులు, నీటి నిల్వ కోసం జలాశయాల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకొని కొంతమేర పనులు పూర్తి చేశారు. 75 వేల ఎకరాల మేర ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు ద్వారా నీరందుతుంది. 2019లో వైకాపా ప్రభుత్వం రావటంతోనే ఈ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిపేశారు. మరలా అవే పనులను తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రస్తావించారు. ఇటీవల నేమకల్లు వచ్చిన సీఎం చంద్రబాబుకి జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టు పనులు మళ్లీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. త్వరలోనే నిధులు కేటాయించి పనులు ప్రారంభం అవుతాయని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కంటిపాపలను కాపాడేవారేరీ?

నర్సీపట్నం : కంటిపాపలు.. ఇంటి దీపాలైన పిల్లలకు కాస్తంత నలత చేస్తేనే తల్లిదండ్రులు తల్లడిల్లిపోతారు. అలాంటిది వ్యాధులు, లోపాలతో ఉన్న పిల్లల తల్లిదండ్రుల వేదన చెప్పనలవి కాదు. రేపటి ఆశాకిరణాలైన బాలలందరూ చక్కగా ఎదిగేలా అవసరమైన వైద్యం అందించే లక్ష్యానికి గ్రహణం పట్టింది. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 18 వయసు నిండేవరకు బాలల్లో కలిగే ప్రతి రుగ్మతను ముందుగానే కనుగొని ఉచితంగా చికిత్స అందించడానికి నర్సీపట్నంలో ఏర్పాటైన జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం వైద్యుల కొరతతో కునారిల్లుతోంది. నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం నియోజకవర్గాల్లోని పలు మండలాలతో పాటు పొరుగున అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి తదితర మండలాల నుంచి అనేకమంది పిల్లలను ఇక్కడకు తీసుకువచ్చేవారు. దాదాపు 45 రకాల లోపాలకు ఇక్కడ ఉచితంగా చికిత్సలు అందేవి. కోలుకున్న తమ కంటిపాపలను తల్లిదండ్రులు సంతోషంగా తిరిగి తీసుకువెళ్లేవారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ చికిత్సా కేంద్రానికి వైద్యుల కొరత సమస్యగా మారింది.

బాలల సత్వర చికిత్స కేంద్రంలో పిల్లల వైద్య నిపుణుడి పోస్టు నాలుగు



నెలలుగా, వైద్యాధికారి (పిల్లల వైద్యుడు) పోస్టు ఏడాదిగా, దంత వైద్యాధికారి పోస్టు ఏడునెలలుగా ఖాళీగా ఉన్నాయి. స్పీచ్ థెరఫిస్ట్, ఆప్టోమెట్రిస్ట్ సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

**ఏ వ్యాధులకు చికిత్సలంటే..**

వంకరపాదాలు, పుట్టుకతో వచ్చే క్యాటరాక్టు, వినికిడిలోపం, నాడీ వ్యవస్థ లోపాలు, నడుం భాగంలో అభివృద్ధి లోపం, పెదవి చీలిక, గ్రహణం మొర్రి రక్తహీనత, విటమిన్ ఏ, డీ లోపం, తీవ్ర పోషకాహార లోపం,చర్మవ్యాధులు, చెవినుంచి చీము, రక్తం కారడం, రుమాటిక్ గుండెవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, పిప్పిపళ్లు, గారపట్టడం, చిరుగువాపు, మూర్ఛ వంటి బాల్యంలో వచ్చే వ్యాధులు.

దృష్టి సమస్యలు, అభివృద్ధి ఆలస్యం, ఆటిజం వంటి వైకల్యాలు

**తొలిదశలో చికిత్స అందితేనే...**

పిల్లల్లో రుగ్మతలు తొలి దశలోనే గుర్తించి చికిత్స అందించాలి. రెండు, మూడుచోట్ల ప్రైవేటు వైద్యుల వద్ద పిల్లలను చూపించిన తరువాత ఇక తగ్గదేమోనని గ్రామీణులు అపోహపడి పిల్లలను అలాగే ఉంచేస్తున్నారు. కానీ రుగ్మతల్లో చాలావరకు శస్త్రచికిత్స, ఇతర చికిత్సల ద్వారా నయం చేయగలిగేవే. నర్సీపట్నంలో సేవలు, చికిత్సలు అన్నీ ఉచితమే. రూ. 1.06 కోట్ల ఖర్చుతో నిర్మించిన కొత్త భవనంలో 2022 జూన్ నుంచి ఆసుపత్రి నడుస్తోంది. రూ.లక్షలు విలువైన వైద్య పరికరాలు, అనేక ఉపకరణాలు ఈ ఆసుపత్రిలో ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా పరిస్థితి ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన వైద్యులు పిల్లలకు అనేక శస్త్ర చికిత్సలు నిర్వహించి తల్లిదండ్రుల్లో సంతోషం నింపారు. ఈ సత్వర చికిత్స కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించేలా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

**త్వరలో భర్తీ**

బాలల సత్వర చికిత్స కేంద్రంలో వైద్యుల కొరత విషయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాలాజీ దృష్టికి తీసుకురాగా వైద్యుల పోస్టుల ఖాళీల వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. త్వరలోనే భర్తీ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# పచ్చదనం.. పరిశుభ్రతకు అందలం

కొత్తూరు : అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామ పంచాయతీకి పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో గత కొన్నేళ్లుగా చేస్తున్న సేవలకు జాతీయ పురస్కారం లభించింది. పంచాయతీ పరిధిలో సంపద కేంద్రం ఏర్పాటు చేసి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి తిరిగి వినియోగించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికీ ఇందుకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ప్రజలకు అవగాహన, చైతన్య సదస్సులను నిర్వహిస్తూ స్వచ్ఛభారత్ దిశగా అడుగులు వేశారు. శారదానది ఒడ్డున ఉన్న ఈ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనంలతో పాటు ప్రజలను చైతన్య పరచడంలోనూ ముందంజలో ఉంది.గ్రామంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. దీనికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీలో ఉన్న ఉప కేంద్ర భవనం శిథిలావస్థలో చేరింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు రహదారులు నిర్మించాలి. ప్రాథమిక పాఠశాలతో పాటు రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గతంలో నిర్మాణం చేపట్టిన ఒక అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణం పూర్తి చేయాలి. రెండో అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. శారదానదిని ఆనుకొని ఉన్న ఈ గ్రామంలో అత్యధికులు వ్యవసాయం, పాడి పరిశ్రమలపై ఆధారపడి ఉన్నందున వీరి నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాల్సిఉంది. గ్రామంలో అత్యధికుల భూములు నది అవతల ఉండటంతో కొందరు పెనాలపై, మరి కొందరు చుట్టూ తిరిగి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ గ్రామం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.గ్రామంలో ఏర్పాటు చేసిన సంపద కేంద్రంలో వ్యర్థాల నిర్వహణ ఆదర్శనీయంగా నిలిచింది. పచ్చదనం, పరిశుభ్రతతో పాటిస్తూ పలువురి మన్ననలు అందుకుంది. గ్రామస్తులతో పాటు పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీ అయిన ఎస్తేరు పేర్కొన్నారు. **బాధ్యత పెరిగింది**కేంద్ర ప్రభుత్వ జాతీయ స్థాయి పురస్కారం మా పంచాయతీకి రావడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో తనతో పాటు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం కూడా ఉంది. ప్రోత్సాహకంగా అందనున్న రూ.కోటి పంచాయతీ అభివృద్ధికి దోహదపడుతుంది. యాదగిరి అప్పారావు, సర్పంచి

# రష్మిక కాలి గాయం ఎంత పని చేసింది!

వరుస చిత్రాలతో గత ఏడాది అంతా బిజీ బిజీగా ఉంది రష్మిక మందన్న. ఇటీవలే విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'పుష్ప 2' విజయాన్ని ఆస్వాధిస్తూనే, వరుసగా సెట్స్ పై ఉన్న సినిమాలను పూర్తి చేస్తోంది. సికందర్, థామ, కుబేర చిత్రాల కోసం రష్మిక లొకేషన్లు షిఫ్టవుతూనే ఉంది. అయితే అనూహ్యంగా ఇంత బిజీలోనూ ఊహించని ట్విస్టు ఎదురైంది. ప్రస్తుతం సెట్స్ పై ఉన్న సినిమాల నిర్మాతలు రష్మిక తేదీలను రీషెడ్యూల్ చేయాల్సిన పరిస్థితి. దానికి కారణమేమిటో రష్మిక తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోగ్రాఫ్ చూస్తేనే అర్థమవుతోంది. చూడగానే.. అరే రష్మికకు ఏమైంది? కాలు ఏమైనా విరిగిందా? అంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రష్మిక మందన్న కాలికి గాయమైంది. జిమ్ లో కసరత్తులు చేస్తుండగా గాయానికి గురైన పాదం ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "సరే... నాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు! నా పవిత్ర జిమ్ మందిరంలో నన్ను నేను గాయపరచుకున్నాను. ఇప్పుడు నేను రానున్న కొన్ని వారాలు లేదా



నెలలు 'హాప్ మోడ్'లో ఉన్నాను.. దేవుడికి మాత్రమే తెలుసు.. కాబట్టి నేను థామ, సికందర్, కుబేర కోసం సెట్‌లకు తిరిగి వెళ్తున్నట్లు అనిపిస్తుంది! నా దర్శకులను అడుగుతున్నాను.. ఈ ఆలస్యానికి క్షమించండి... నా కాళ్ళు యాక్షన్‌కి (లేదా కనీసం దూకడానికి) సహకరించేలా చూసుకుని త్వరలోనే తిరిగి వస్తాను" అని వ్యాఖ్యానించింది. ఈలోగా మీకు నా అవసరం ఉంటే... నేను చాలా అధునాతనమైన బన్నీ హాప్ వర్కౌట్ చేస్తూ మూలలో ఉంటాను. హాప్ హాప్ హాప్..! అని కూడా ఛమత్కరించింది. సల్మాన్‌తో 'సికందర్' చివరి షెడ్యూల్ జనవరి 10న ముంబైలో ప్రారంభం కావాల్సి ఉంది. అయితే రష్మిక గాయం కారణంగా షూటింగ్ ను తాత్కాలికంగా నిలిపివేసారు. సికందర్ 2025 ఈద్ సందర్భంగా విడుదలవుతుంది. దీనిని %ూా=% మురుగదాస్ దర్శకత్వం వహించారు. సాజిద్ నదియాద్వాలా నిర్మించారు. ఆయుష్మాన్ ఖురానాతో 'థామా' కూడా సెట్స్‌లో ఉంది. ఈ చిత్రం మాడాక్ సూపర్‌నేచురల్ యూనివర్స్‌లో భాగం. వాంపైర్ల చుట్టూ తిరిగే కథాంశంలో రష్మిక నటించింది. ఈ సంవత్సరం దీపావళికి విడుదల అవుతుంది. ధనుష్‌తో కలిసి నటించిన 'కుబేర' కూడా 2025 లో విడుదల అవుతుంది. దీనితో పాటు రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ సంవత్సరం కీలక చిత్రాలలో ఒకటి.

# శ్రేయా క్యూట్ స్మైల్

టాలీవుడ్ లో చిన్న పాత్రలతో కెరీర్ మొదలుపెట్టిన శ్రేయా ధన్వంతరి ఇప్పుడు బాలీవుడ్ డిజిటల్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. తాజాగా హవాయ్ లోని వైమనలో బీచ్ లో గడిపిన తన తాజా ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ లో పంచుకుంటూ మరోసారి నెటిజన్లను కట్టిపడేసింది. సముద్ర అలలతో ఆడుకుంటూ అందంగా సగరతీర సుందరిగా కనిపించిన శ్రేయా, కలర్ ఫుల్ బికినీలో తన ఫిట్‌నెస్ ను హైలైట్ చేస్తూ సోషల్ మీడియాలో హీట్ పెంచింది. ఈ ఫోటోల్లో ఆమె ట్రెండీ లుక్ కు తోడు ఆమె స్మైల్ కూడా అదనపు ఆకర్షణగా మారింది. "వాటర్ బేబీ" అని క్యాప్షన్ ఇచ్చి పలు ఫోటోలను షేర్ చేసిన ఆమె, ఫ్యాన్స్ నుంచి విశేష స్పందనను అందుకుంది. ట్రెండీ బికినీ లుక్ తో స్టన్నింగ్ గా మెరిసిన శ్రేయా, హవాయ్ సముద్ర తీరంలో తన మైదానాన్ని చూపించింది. సహజ సౌందర్యానికి పర్యావరణం కలిసివచ్చినట్లు ఆమె పిక్స్ చూస్తే అర్థమవుతోంది. ట్రెండీ



డ్రెస్సింగ్ కి స్టైలిష్ పర్సనాలిటీ ని జోడించి ఫోటోలలో తన సొగసును కుర్రాళ్లకు ఆహ్లాదం చేస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, శ్రేయా మొదట టాలీవుడ్ లో జోష్ వంటి చిత్రాలతో ప్రారంభించింది. తర్వాత "స్నేహగీతం" చిత్రంలో నటించి ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ చిత్రాలతో ఆశించిన గుర్తింపు రాకపోవడంతో ఆమె బాలీవుడ్ పై దృష్టి పెట్టింది. అక్కడ ఆమె "వై చీట్ ఇండియా" వంటి సినిమాతో మంచి పేరు సంపాదించుకుంది. ఇక వెబ్ సిరీస్ లో అయితే ఆమె తన కంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ ను క్రియేట్ చేసుకుంది. "ది ఫ్యామిలీ మాన్" "స్కామ్ 1992" వంటి హిట్ ప్రాజెక్టులతో మరింత గుర్తింపు పొందిన శ్రేయా, నటనతో పాటు గ్లామర్ షోలోనూ తనదైన ముద్ర వేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే శ్రేయా, తరచుగా తన ఫోటోషూట్ లతో అభిమానులను అలరిస్తుంది. ఇటీవల బీచ్ లో ఫోటోలు షేర్ చేసి నెటిజన్ల మనసును దోచుకున్న ఈ సుందరి, ఫిట్‌నెస్ మరియు ఫ్యాషన్ కు సమపాళ్ళలో ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంది. ట్యాటూ డిజైన్ ను హైలైట్ చేస్తూ, తక్కువ డ్రెస్సింగ్ తోనూ ఆకర్షణీయంగా కనిపించగల అందం ఆమె సొంతం. ప్రస్తుతం శ్రేయా నెక్స్ట్ ప్రాజెక్ట్స్ పై దృష్టి పెట్టి బిజీగా ఉంది.




# ఇండియన్ ఇండస్ట్రీలలో ఫస్ట్ 500 కోట్లు కొట్టిన సినిమాలివే!




ప్రస్తుతం ఇండియన్ మార్కెట్‌లో భారీ సినిమాకు హిట్ టాక్ వస్తే 1500 కోట్లకు పైగానే కలెక్షన్లు అందుకుంటున్నాయి. రీసెంట్‌గా పుష్ప 2 1800 కోట్ల మార్క్‌ను టచ్ చేయడంతో ఈ ట్రెండ్ స్పష్టమైంది. అయితే ఒకప్పుడు 500 కోట్ల మార్క్ అనేది చాలా ప్రత్యేకమైనదిగా భావించబడింది. మొదటగా ఈ రికార్డును బాలీవుడ్‌లో ఆమిర్ ఖాన్ సాధించారు. ఇండియన్ ఇండస్ట్రీల వారిగా మొదటిసారి 500 కోట్లు అందుకున్న సినిమాలు ఈ విధంగా ఉన్నాయి. 2013లో విడుదలైన ధూమ్ 3 బాలీవుడ్‌లోనే మొదటిసారి 500 కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రం. అమీర్ ఖాన్ డిఫరెంట్ యాక్టింగ్ స్కిల్స్, అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లు, వరల్డ్ రేంజ్ ఆడియెన్స్ కు తగిన గ్రాండ్ విజువల్స్ ఈ సినిమాను భారీ విజయంగా నిలిపాయి. ధూమ్ సిరీస్‌లో మూడో భాగంగా వచ్చిన ఈ సినిమా, భారతీయ ప్రేక్షకులతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ప్రభావం చూపించింది.

**టాలీవుడ్ నుంచి బాహుబలి...** బాహుబలి: ది బిగినింగ్ 2015లో భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త ట్రెండ్ ను ప్రారంభించింది. రాజమౌళి దర్శకత్వంలో, ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా నటనతో టాలీవుడ్‌ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లింది. అత్యున్నత సాంకేతికత, విలువలు కలిగిన కథనంతో ఈ సినిమా మొదటిసారిగా టాలీవుడ్ నుంచి 500 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సినిమా తరువాత వచ్చిన బాహుబలి 2 అయితే ఆ రికార్డులను మరింతగా అధిగమించింది.

**కోలీవుడ్ నుంచి 2.0...** 2018లో రజనీకాంత్, అక్షయ్ కుమార్ ముఖ్య పాత్రల్లో నటించిన 2.0 కోలీవుడ్ నుంచి 500 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి చిత్రం. శంకర్ విజువల్ ఫీస్ట్, రజనీకాంత్ క్రేజ్, అద్భుతమైన VFX వర్క్ ఈ సినిమాను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాయి. భారతీయ సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో ఇది ఓ బిగ్ మూవీగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఈ చిత్రానికి విశేష ఆదరణ లభించింది.

**సాండల్‌వుడ్ నుంచి KGF 2...** 2022లో విడుదలైన కేజీఎఫ్ చాప్టర్ 2 సాండల్‌వుడ్ నుండి 500 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి చిత్రం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యశ్ నటన, పవర్‌ఫుల్ స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు మాస్ అప్పీల్‌ను తీసుకువచ్చాయి. ఈ చిత్రం కేవలం భారతీయ మార్కెట్‌ను కాదు, అంతర్జాతీయ మార్కెట్‌ను కూడా కదిలించింది. సాండల్‌వుడ్‌లోనే కాదు, పాన్ ఇండియా స్థాయిలో ఒక పెద్ద విజయంగా నిలిచింది. ఇవి చూసినప్పుడు, ఇండియన్ సినిమా ఇండస్ట్రీల అభివృద్ధి, వారి మార్కెట్ విస్తరణ స్పష్టంగా కనిపిస్తోంది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్, కోలీవుడ్, సాండల్‌వుడ్ వరకు భారతీయ సినిమాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. 500 కోట్ల క్లబ్ అప్పట్లో ప్రత్యేకమైన మైలురాయిగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం పాన్ ఇండియా హీరోలకు 1000 కోట్ల మార్క్ సాధించడం మినిమమ్ టార్గెట్ గా మారింది.

# డిలే ప్రాజెక్ట్ దూసుకొచ్చేలా ఆ క్రేజీ కాంబో ప్లానింగ్!



కోలీవుడ్ స్టార్ సూర్య 46వ చిత్రం ఫిక్సైందా? పెండింగ్ లో పడిన ప్రాజెక్ట్ నే 46గా ఫిక్స్ చేసారా? అంటే అవుననే తెలుస్తోంది. ప్రస్తుతం సూర్య 45వ చిత్రం ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. అయితే 46వ చిత్రంగా వెట్రీమారన్ ప్రాజెక్ట్ ఖరారైంది. వాస్తవానికి ఈ సినిమా ఇప్పటికే పట్టా లెక్కాలి. కానీ అనివార్య కారణాలతో డిలే అయింది. కానీ ఇక ఆలస్యం అమృతం విషం అన్న చందంగా సూర్య ఈ ప్రాజెక్ట్ ని ఏమాత్రం డిలే చేయకుండా పట్టాలెక్కించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వెట్రీమారన్ %-%వాడివాసల్%-% కి సంబంధించి అధికారిక ప్రకటన ఇప్పటికే ఉంది. కానీ అదెప్పుడు సెట్స్ కి వెళ్తుంది అన్నది క్లారిటీ లేని నేపథ్యంలో తాజా సమాచారం అభిమానుల్లో జోష్ ని నింపింది. ఇందులో సూర్య తండ్రీ-కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. రెండు పాత్రలు పోటా పోటీగా సాగుతాయట. ఈ సినిమా షూటింగ్ 15 నెలలు పాటు సాగుతుందట. ఈ వేసవిలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టనున్నారని సమాచారం. అంటే ఆర్జే బాలాజీ సినిమా షూటింగ్ తో పాటు, సూర్య వెట్రీమారన్ సినిమా చిత్రీకరణలో కూడా పాల్గొంటాడు. జల్లికట్టు క్రీడ నేపథ్యంలో సాగే వాడివాసలపై అంచనాలు ఎలా ఉన్నాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ఈ క్రీడకు తమిళనాడు లో ఎంతో ప్రత్యేకత ఉంది.

అక్కడ గ్రామీణ ప్రాంతాల్లో ఆడే సంప్రదాయ క్రీడ ఇది. తమిళ సాంప్రదాయ యుగానికి చెందినదిగా భావిస్తారు. పొంగల్ పండుగ సందర్భంగా ఏటా జనవరిలో జల్లికట్టు పోటీలు నిర్వహిస్తారు. ఇదే బ్యాక్ డ్రాప్ లో సూర్య సినిమా సాగుతుంది. దీంతో ఈ సినిమాపై టాలీవుడ్ లోనూ భారీ అంచనాలున్నాయి. మూగ జీవాలను హింసించే క్రీడ అంటూ నిషేధం విధించాలని కేంద్రం భావించినా పెద్ద ఎత్తున పోరాటం చేసి మరీ తమిళ ప్రజలు తమ హక్కును కాపాడుకున్నారు.

# అందాల నిక్కీ జీన్స్‌లో బోల్డ్...

తెలుగు ప్రేక్షకులకు చీకటి గదిలో చితక్కొట్టుడు అనే సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ నిక్కీ తంబోలి. ఆ తర్వాత ఎక్కువ సినిమాలు చేయకున్నా సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో సోషల్ మీడియాలో ఈమె ఫాలోయింగ్ అంతకంతకు పెరుగుతూ ఉంది. ఈమధ్య కాలంలో ఈ అమ్మడు మరోసారి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా చలికాలంలో వేడి పెంచినట్లు అయ్యింది. ఈమె అందాల ఆరబోత ఈసారి కాస్త ఎక్కువ అయ్యిందని కొందరు అంటున్నారు. సినిమా ఇండస్ట్రీలో పెద్దగా సినిమాలు చేయకున్నా ఈమె చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఈ అమ్మడు స్కిన్ షో చేస్తూ షేర్ చేస్తున్న ఫోటోలు ఓ రేంజ్‌లో ఉంటున్నాయి. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేసినా, ఇంత అందంగా ఉన్నా ఎందుకు సినిమాల్లో ఎక్కువ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు ఆశ్చర్యంగా కామెంట్స్



చేస్తున్నారు. బోల్డ్ లుక్‌లోనూ చాలా అందంగా కనిపించడం కేవలం నిక్కీ తంబోలికే చెల్లుతుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా నిక్కీ అందాల ఆరబోత ఫోటోల గురించి మరోసారి చర్చించుకునే విధంగా ఈ ఫోటోలు ఉన్నాయి. వైట్ టాప్ వేసి నడుము అందాన్ని చూపిస్తూ నాభి అందంతో మతి పోగొట్టడం మాత్రమే కాకుండా జీన్స్ వేసుకుని కవ్వించే విధంగా ఈ అమ్మడు ఇచ్చిన ఫోజ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా చేసినవి చాలా తక్కువ సినిమాలు. అయినా ఈ అమ్మడికి దక్కిన గుర్తింపు తక్కువేం కాదు. ఈ అమ్మడు సోషల్ మీడియాలో స్టార్ హీరోయిన్స్‌కి ఏమాత్రం తక్కువ కాకుండా అందాల ఆరబోత చేస్తూ ఉంటుందని ఈ ఫోటోలతో మరోసారి నిరూపితం అయ్యింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ అమ్మడి సొంతం. అందుకే ఈమె ఫోటోలకు మంచి ఫాలోయింగ్ దక్కుతుంది. గత ఏడాది బుల్లి తెరపై సందడి చేసిన నిక్కీ తంబోలి ఈ ఏడాదిలో వరుసగా సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. బిగ్‌బాస్ మరాఠి సీజన్ 5లో కనిపించిన నిక్కీ తంబోలి ఆ తర్వాత పలు టీవీ షోల్లో కనిపించింది. ఒకటి రెండు సినిమాల్లో ఛాన్స్ వచ్చినా ప్రాముఖ్యత లేని పాత్రలు కావడంతో సున్నితంగా తిరస్కరించింది. ప్రత్యేక పాటల్లో, ప్రత్యేక పాత్రల్లో నటించేందుకు తనకు ఎలాంటి ఇబ్బంది లేదు అంటూ ఈ అమ్మడు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పింది. కనుక టాలీవుడ్ లేదా ఇతర భాషల్లో ఈ అమ్మడితో ఐటెం సాంగ్ చేయిస్తే బాగుంటుంది కదా అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఈమె ఐటెం సాంగ్ వస్తుందేమో చూడాలి.

# తడిసిన అందాలతో శ్రద్ధా గ్లామర్ మెరుపు!

టాలీవుడ్ కు పరిచయమైనప్పటి నుండి శ్రద్ధా దాస్ అందరినీ తన అందంతో ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోల్లో రెడ్ అవుట్‌ఫిట్‌లో తన గ్లామర్ షోకి మరింత నూతనతను తెచ్చింది. ఫోటోలలో శ్రద్ధా స్లిట్ డ్రెస్‌లో స్టైలిష్‌గా, అదే సమయంలో తన ఫిట్‌నెస్‌తో అందర్నీ మంత్రముగ్ధులను చేస్తోంది. ఫోటోల బ్యాక్‌డ్రాప్‌లోని గ్రీన్‌రీ, శ్రద్ధా కూల్ లుక్‌కి మరింత అందాన్ని జోడించింది. శ్రద్ధా దాస్ కెరీర్ విషయానికి వస్తే, "సిద్ధూ ఫ్రం శ్రీకాకుళం" సినిమాతో ఆమె తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టింది. ఆ తర్వాత ఆర్య 2, డార్లింగ్ వంటి చిత్రాల్లో నటించి, మంచి గుర్తింపును సంపాదించుకుంది. హిందీ, కన్నడ, బెంగాలీ వంటి భాషల్లో కూడా తన ప్రతిభను చాటుకున్న శ్రద్ధా, ప్రత్యేకమైన కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తూ ఉంటుంది. "ఖాకీ: ది బీహార్ ఛాప్టర్" వంటి వెబ్‌సిరీస్‌ల ద్వారా



కూడా ఆమె డిజిటల్ ప్లాట్‌ఫాంలో తన కేరియర్‌కి కొత్త రంగులు అద్దింది. సోషల్ మీడియాలో శ్రద్ధా దాస్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. తరచూ గ్లామర్ పిక్స్‌తో నెటిజన్లను అలరిస్తూ, ఆమె ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతుంటాయి. ప్రత్యేకించి ఈ మధ్య షేర్ చేసిన రెడ్ అవుట్‌ఫిట్ ఫోటోలు, ఆమె స్టైల్ స్టేట్‌మెంట్‌కి కొత్త దిశగా చూపిస్తున్నాయి. షవర్ సెట్ ఫోటోలతో ఆమె తేజస్సు మరింత హైలెట్ అయ్యింది. ఇప్పుడు ఆమె ప్రేక్షకులను ఆకట్టుకునే మరో క్రైమ్ థ్రిల్లర్‌తో తెరపైకి రాబోతోంది. వెబ్‌సిరీస్‌లు, సినిమాలు రెండింటిలోనూ శ్రద్ధా తన ప్రస్థానాన్ని మరింత ఎత్తుకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. నటనతో పాటు గ్లామర్‌కి కూడా తగినంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ అందాల తార, ప్రస్తుతం ఫిట్‌నెస్ పైన మరింత ఫోకస్ చేస్తోంది. మరి అమ్మడికి భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536